
ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఇసి లక్షలాది ఓట్లు తొలగించింది
ఇసిని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చింది : మహేశ్‌కుమార్‌గౌడ్

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల జీతాల్లో కోత విధించొద్దు
సిడిఎంఎ కార్యాలయం ఎదుట ఎఐటియుసి భారీ ధర్నా 03



సంపుటి 09, సంచిక: 260 | బుధవారం | 19-08-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# 36 టన్నుల కల్తీ నెయ్యి

● హైదరాబాద్ నగరంలో అక్రమ దందా గుట్టురట్టు ● 130 ప్రాంతాల్లో ఏకకాలంలో హెచ్ -ఫాస్ట్ , ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు ● పామ్ ఆయిల్, డాల్డా, రసాయనాలతో నెయ్యి తయారీ.. స్టార్ హోటళ్లు, స్వీట్ షాపులకు సరఫరా

ప్రజాపక్షం/హైదరాబాద్

నెయ్యి పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న భారీ కల్తీ దందా హైదరాబాద్‌లో గుట్టురట్టైంది. హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (హెచ్ ఫాస్ట్ ), ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా మంగళవారం నగరవ్యాప్తంగా 130 ప్రాంగణాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించగా.. ఏకంగా 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడి పదార్థాలు, రసాయనాలు బయటపడ్డాయి. 39 తయారీ కేంద్రాలు, 91 విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు భారీగా కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. కల్తీ ముఠా పామ్ ఆయిల్, వనస్పతి (డాల్డా), స్కిమ్డ్ మిల్క్ పౌడర్, స్టార్చ్‌తో పాటు కృత్రిమ సువాసనలను ఉపయోగించి నకిలీ నెయ్యిని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్నిచోట్ల పాల ఘనపదార్థాలకు పామ్ ఆయిల్, డాల్డా, సింథటిక్ ఫ్లేవర్లను కలిపి అసలు నెయ్యిని తలపించేలా తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. స్వాధీనం చేసుకున్నవి ఇవే.. కల్తీ నెయ్యి – 25.5 టన్నులు, మిల్క్ క్రీమ్ – 8.7 టన్నులు,

తరువాయి 8లో

## బహుజనుల వీరుడు సర్వాయి పాపన్న



అమరవీరుల స్తూపం స్థాయిలో పాపన్న విగ్రహానికి ప్రాధాన్యం



● 117 సీట్లతో మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్
● గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత మా ప్రభుత్వానిదే
● ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు
● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన
● ట్యాంక్‌బండ్‌పై బహుజన యోధుడు సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన కులం, కుటుంబం కోసం మాత్రమే కాకుండా బహుజనులందరి కోసం పోరాడారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలన్నారు. బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్ బాబు, సీతక్క, మాజీ ఎంపిలు మధు యాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, బాల్‌రాజ్ గౌడ్ తదితర

తరువాయి 8లో

ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దురాగతాల విచారణకు

## ఉన్నత స్థాయి కమిటీ

● సుప్రీంకోర్టు వెల్లడి
● కమిటీలో సభ్యులు, వివిధ వర్గాల నుంచి సూచనలు స్వీకరించిన తరువాత కమిటీపై ఉత్తర్వులు జారీచేస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురంతాల ఆరోపణలను పరిశీలించేందుకు విశ్రాంత న్యాయమూర్తులు, పూర్వ డిజిపి, మాజీ సిబిఐ డైరెక్టర్, తదితరులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంగళవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఈ ప్యానెల్‌లో చేర్చాల్సిన ఇతర సభ్యుల విషయంలో, వివిధ వర్గాల నుంచి సూచనలు స్వీకరించిన తర్వాత కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వును బుధవారం జారీ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వెల్లడించింది. ఢిల్లీలో జులై 20న పార్లమెంట్ మార్చ్ సమయంలో చోటుచేసుకున్న హింసకు సంబంధించి వీడియో ఫుటేజీ, సిసిటివి రికార్డింగ్‌లను పరిశీలన కోసం ఉన్నత స్థాయి కమిటీకి అప్పగించాలని

తరువాయి 12లో



## ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ట రక్షణతో ముందుకు

● ప్రతి నీటి బొట్టుకూ ఓ లెక్క ఉండాలి
● ఎల్‌నినో కారణంగా తాగునీటి భద్రతకు తొలిప్రాధాన్యం
● వచ్చే రెండు నెలల్లో భారీవర్షాలు కురుస్తాయని ఆశించొద్దు
● జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి ఆధారంగానే నీటి విడుదల ప్రణాళికాబద్ధంగా ఉండాలి
● అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వినియోగించుకునే ప్రతి నీటి చుక్కకూ శాస్త్రీయత తో కూడిన లెక్క ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఎల్‌నినో కారణంగా మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్య ఇస్తూ, అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగానికి సూచించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడు తూరాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయనో,ఎగువ ప్రాంతం నుంచి వరదలు వస్తాయనో ముందుగానే ఊహించుకోకుండ ప్రస్తుతం చేతిలో

తరువాయి 8లో

## పిపిపితోనే ఇంధన విప్లవం

● తెలంగాణతో కలిసి పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు ఉపముఖ్యమంత్రి భట్టి పిలుపు
● క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి
● ఇండియా ఎనర్జీ సమ్మిట్ ఎక్స్‌పో – 2026 ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సిఈఓలకు తెలంగాణ ఆహ్వానం పలుకుతోందని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతోనే ఇంధన విప్లవాన్ని సాధించగలమని, తెలంగాణతో కలిసి పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్ నోవాటెల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ఎక్స్‌పో–2026'ను మంగళవారం డిప్యూటీ సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని అన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర సమృద్ధిని పెట్టుబడిదారులతో పంచుకుంటూ కలిసి ఎదగడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఇంధన రంగంలో మార్పు అంటే కేవలం విద్యుత్ ఉత్పత్తి వనరులను మార్చడం మాత్రమే కాదని, సమగ్ర ఆర్థిక వ్యవస్థను మార్చే విప్లవాత్మక ప్రక్రియ అని అన్నారు. తెలంగాణను స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 26 వేల మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో కీలకమైన విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని కూడా భారీగా పెంచనున్నట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలను వినియోగించుకుని భవిష్యత్ విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు

తరువాయి 8లో

22 ఏ భూములపై

## పుకార్లు, కట్టుకథలు నమ్మొద్దు

ఆ జాబితాలో ఆస్తులుంటే రెండు రోజుల్లో పరిష్కారం
ప్రైవేట్ భూమి అయితే వెంటనే రిజిస్ట్రేషన్
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 22ఎ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎటువంటి పుకార్లు, కట్టు కథలను విశ్వసించవద్దని, ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి

తరువాయి 12లో


20 నుంచి విదేశాలకు సిఎం
ఇంగ్లాండ్, అమెరికాలో పదిరోజులు పర్యటన 10


## ఇరాన్‌తో ఎంఓయు రద్దు

తెల్లజెండా చూపించి లొంగిపోవాలి
హోర్ముజ్‌పై ఇరాన్‌తో చేయి కలిపితే ఒమన్‌పై దాడి : ట్రంప్ హెచ్చరిక
ఎంఓయు అమలు చేయకపోతే దాడులు : ఇరాన్ ప్రతిహెచ్చరిక
హోర్ముజ్ జలసంధిలో నౌకలపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్స్ దాడి



**వాషింగ్టన్ :** ఇరాన్‌తో చేసుకున్న ఎంఓయు (యుద్ధ విరమణ తాత్కాలిక ఒప్పందం)ను రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఫాక్స్ న్యూస్ రిపోర్టర్‌కు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. ఈ ఏడాది నవంబరు నెలలో అమెరికాలో ద్వైవార్షిక ఎన్నికలు ఉన్నప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కోసం తాను తొందరపడటంలేదన్నారు. ఇరాన్ పాలకులు స్తంభింపజేసిన, అసంపూర్ణంగా మిగిలిపోయిన చర్చలు పూర్తి చేసి,తెల్లజెండాలు ఎగురవేసి లొంగిపోవాలని పిలుపు ఇచ్చారు. అదేవిధంగా హోర్ముజ్ జలసంధిని నిర్వహించే విషయంలో ఇరాన్‌తో చేతులు కలిపితే దాడులు చేస్తామని ఒమన్ పాలకులకు కూడా మరో హెచ్చరిక జారీ చేశారు. ఒమన్‌దేశం అమెరికా మిత్రరాజ్యమే. ఇరాన్‌తో జూన్ నెలలో చేసుకున్న ఒప్పందం ఇక చెల్లుబాటు కాదని నెలరోజుల క్రితం హోర్ముజ్ జలసంధిలో కొత్త రహదారి మార్గాల విషయంలో ఘర్షణ

తరువాయి 12లో

## ఈసారి నో ఖేల్ రత్న!

17 మందికి అర్జున అవార్డు, ముగ్గురికి ద్రోణాచార్య అవార్డులు

● తెలంగాణ నుంచి షూటర్ ధనుష్ శ్రీకాంత్, షట్లర్ గాయత్రి గోపీచంద్‌కు అర్జున అవార్డులు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గానూ జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. క్రీడారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డులను ఈసారి 17 మందికి ప్రదానం చేయనున్నట్లు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. అయితే క్రీడా రంగంలో దేశంలోనే అత్యున్నత పురస్కారమైన 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న' అవార్డును ఈసారి ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. 1962 ఆసియా గేమ్స్ స్వర్ణ పతక విజేత ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఐ. అరుమైనాయగం జీవిత సాఫల్య అవార్డు దక్కింది. ఇక కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డును ఈసారి ముగ్గురు గెలుచుకున్నారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ చోటేలాల్ యాదవ్, షూటింగ్‌లో నేహ నందకుమార్‌కు ద్రోణాచార్య అవార్డు దక్కింది. ద్రోణాచార్య లైఫ్ టైం కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్‌లో వీరేంద్ర కుమార్‌కు అవార్డు దక్కింది. చెస్ విభాగంలో భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోశ్ గుజరాతీని అర్జున అవార్డు వరించింది. గత కొంత కాలంగా అంతర్జాతీయ టోర్నమెంట్లలో భారత్‌కు అద్భుత విజయాలను అందించడంలో విదిత్ సంతోశ్

తరువాయి 8లో



## మధ్యప్రదేశ్‌లో జెన్– ఆల్ఫా నిరసన

దిగొచ్చిన అధికార యంత్రాంగం

**భోపాల్ (మధ్యప్రదేశ్) :** వారంతా ఓటు వేయడానికి...ప్రజా పదవిని చేపట్టడానికి..చాలా చిన్న వయసు వారై ఉండవచ్చు. అనేక సందర్భాల్లో వారు ఎదుర్కొంటున్న పెద్దలు కూడా వారిని తీవ్రంగా పరిగణించనంత చిన్నవయసు వారై కూడా ఉండవచ్చు. కానీ వారంతా ఇటీవల దేశవ్యాప్తంగా పెల్లుబుకుతోన్న సమరశీల విద్యార్థి ఉద్యమ వారసులుగా, పోరాట ప్రతీకలుగా మారారు. మధ్యప్రదేశ్ వ్యాప్తంగా 'జెన్ (జనరేషన్) ఆల్ఫా'కు ప్రాతినిథ్యం వహిస్తున్న పాఠశాల విద్యార్థుల తాజా పోరాట పటిమ ఉదంతాలివి. ఇటీవల పెద్దతరాల వారికే

తరువాయి 12లో

# ఓటర్లూ, మేల్కోండి!

ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్‌ఐఆర్‌–'సర్')ముఖ్యోద్దేశం రాజ్యాంగం హామీ ఇచ్చినట్లు వయోజనులందరికీ ఓటు హక్కు కలుగజేయటం కాదనీ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటునూ తొలగించం అంటూనే ప్రతి రాష్ట్రంలో పదుల లక్షల సంఖ్యలో ఓటర్లను 'అనామలీస్' ఇతర కారణాలు చూపి ఓటు నమోదు రిజిస్ట్ నుంచి తొలగిస్తూ ప్రజలను ముప్పతిప్పలు పెట్టటమేనని మరోసారి తేటతెల్లమైంది. తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) సి.సుదర్శన్‌రెడ్డి సోమవారం విడుదలచేసిన ముసాయిదా ఓటర్ల జాబితాయే ఇందుకు తాజా సాక్ష్యం. 92 లక్షలమందికి నోటీసులు జారీ చేస్తామన్నారు. 2026 ఆగస్టు 10 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. వారిలో 2,64,87,213మంది (78.30 శాతం) ఎన్యూమరేషన్ దశలో తమ ఎన్యూమరేషన్ ఫార్మ్స్ సమర్పించారు. అంటే 73,39,235 మంది ఓటర్ల పేర్లు తొలగించారు. తొలగించబడిన 21శాతం ఓటర్లలో 9,22,229 మంది చనిపోయినట్లు గుర్తించారు. నగరాలు, పట్టణాల్లో నివాస ప్రదేశాలు మారటం, వలస వెళ్లటం సర్వసాధారణం కాబట్టి 57,46,803 మంది ఓటర్లు (16.99శాతం) శాశ్వతంగా మకాం మార్పు, జాడ తెలియదు, ఇతర కారణాలు జాబితాలో చేర్చారు. 6,70,203 మంది (1.98 శాతం) ఓటర్లు పెక్కు ప్రదేశాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు లెక్కలో చేర్చారు.

92లక్షలమందికి నోటీసు జారీ చేయటం జరిగే పనేనా? ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ, ఇంటింటి సర్వే ద్వారా వాటిని భర్తీ చేయటంలో ఎన్నికల కమిషన్ యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. నోటీసులు జారీ చేశారని వాదనకోసం అంగీకరించినా 28రోజుల్లో (సెప్టెంబర్ 16వరకు) వారు క్లెయిములు, అభ్యంతరాలు దాఖలు చేయటం జరిగే పనేనా? ఆగస్టు 17 నుంచి అక్టోబరు 15వరకు ఆ ఫార్మ్స్‌ను అధికారులు స్క్రూటినీ చేస్తారు. రోజుకు 24గంటలు పనిచేసినా ఇన్ని లక్షల పత్రాలు (అన్నీ నిజంగా తిరిగి వస్తే) పరిశీలించగలరా? ఇది అసాధ్యమని అధికారులకు తెలుసు. అందుకే ఓటర్ల ఆగ్రహానికి గురికాకుండా – అక్టోబర్ 19న ప్రచురించే ఓటర్ల 'తుది జాబితాలో మీ పేరు లేకపోయినా ఆందోళన చెందకండి. ఫారం 6 సమర్పించి కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆ ఫారానికి నిర్దేశించిన డాక్యుమెంట్లు జత చేయాలి.

సిఇఓ ఇచ్చిన వివరణ ప్రకారం, 60,50,918మంది ఫార్మ్స్‌లో అనామలీస్/తార్కిక వ్యత్యాసాలు ఉన్నాయి. 32,36,659 మంది 2002 ఓటర్ల జాబితానుంచి తమ వివరాలు పూర్తి చేయలేదు. ఈ రెండు కేటగిరీల్లోని 92,87,577 మందికి నోటీసులు జారీ చేస్తారు. బిఎల్ఓ ద్వారానే నోటీసులు అందుతాయి, సమాధానం కూడా బిఎల్ఓ ద్వారానే పంపాలి. వాటిలో అనుమానాలుంటే ఇఆర్ఓ లేదా అసిస్టెంట్ ఇఆర్ఓ ఓటరుకు ఫోన్ చేస్తారట. వ్యక్తిగత హియరింగ్‌లుండవు. వీటి పరిష్కారాన్ని బట్టి తుది ఓటర్లు సంఖ్య పెరగనూవచ్చు, తరగనూ వచ్చు.

2022 నాటి ఓటర్ల జాబితాలో సంబంధీకుల వివరాలు చేర్చాలనే నియమమే అత్యధిక ఓట్ల తొలగింపుకు కారణం. ఓటర్ల జాబితాలో – పేర్ల నమోదులో, వయస్సు, తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేర్లు, వయసు నమోదులో – ఎన్ని తప్పులుంటాయో ఓటర్లకు అనుభవమే. అంతేగాక ముఖ్యంగా పట్టణాలు, నగరాలలో వార్డుల్లో కొన్ని బస్తీలు మొత్తంగా /పాక్షికంగా లేచిపోవటమూ అనుభవమే. ఓటరు గుర్తింపు కార్డులుండీ, ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవటం సర్వ విదితం. ఈ లోపాలు, తప్పులన్నిటికీ ఎన్నికల కమిషన్ ఓటర్లను బాధ్యుల్ని చేస్తున్నది. అనామలీస్ పత్రాలన్నీ పరిష్కరించటం దుర్లభమని బీహార్, బెంగాల్ ఎన్నికల్లో చూశాం.

అసోం సహా ఆ రెండు రాష్ట్రాల్లో దళితులు, ముస్లింలు – ముఖ్యంగా మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు కోల్పోయారు. అది ఎన్నికల్లో బిజెపికి లాభించిందని జనవాక్యం. అటువంటి దుర్భాగ్యులకు రేషన్ తదితర సంక్షేమ చర్యలను ఆ ప్రభుత్వాలు ఎగనామం పెట్టి వేధిస్తున్నాయి. అందువల్ల, తెలంగాణలో ఇంత పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు ప్రమాదం ఎదుర్కొనేందుకు రాజకీయ పార్టీలు అప్రమత్తం కావాలి. పోలింగ్ బూత్‌లవారీ నోటీసులు జారీ అయిన ఓటర్ల జాబితా తీసుకుని ఇంటింటికీ తిరిగి అందుబాటులో ఉన్న ఓటర్ల చేత సమాధానాలు పూర్తి చేయించాలి లేదా ఫారం 6 తీసుకుని కొత్త ఓటర్లుగా చేర్పించాలి. ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల అనంతరం చింతించినా నిష్ప్రయోజనం. ●



## వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

**మంత్రులు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సహా విద్యాశాఖలో పనిచేసే వారందరూ తమ సొంత పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. అప్పుడు మన ప్రభుత్వ పాఠశాలలు ఎంత వేగంగా, అద్భుతంగా మెరుగుపడతాయో చూడండి. వారందరూ వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లోనే ఎందుకు చేర్పిస్తారు? వారు చేసే పనిపై వారికి నమ్మకం లేదా?**

– అభిజీత్ దీప్కే, సిజెపి అధ్యక్షుడు




## మానవత్వ పరిమళాలను వెదజల్లుదాం!

జీవకోటిలో మనిషి మాత్రమే ప్రత్యేక జీవి. మాట్లాడగలడు. జంతువులన్నీ నాలుగు లేదా అంత కన్న ఎక్కువ కాళ్లతో భూమికి సమాంతరంగా శరీరాన్ని కలిగి ఉంటాయి. మనిషి మాత్రం రెండే కాళ్లతో ధరిణిపై నిటారుగా నిలబడి ఆకాశాన్ని ముద్దాడే ప్రయత్నం చేస్తున్నాడు. విపరీతంగా ఆలోచించటంలో ఘనుడు. సహాయం చేయగల సమర్థుడు. వర్తమానాన్ని మార్చగల ప్రబుద్ధుడు. స్వార్థం పెరిగితే హింసకు కూడా వెనుకాడడు. పగలు, ప్రతీకారాలు రగిలితే యుద్ధాలు చేయగలడు. మన చుట్టు జరుగుతున్న మంచి చెడులకు మనమే బాధ్యులు అని మరిచిన అతి తెలివి నవ్య నరుడికే సొంతం.

19 ఆగష్టు 2003 రోజున బాగ్దాద్ నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన బాంబు పేలుడులో 22 మంది మరణించడం, అందులో మానవీయ సేవకులు కూడా ఉండడం కడు విచారకరం. యుద్ధాలు, విపత్తులు, కరువు కాటకాలు, అశాంతియుత వాతావరణాలు, ఆకలి చావులు లాంటి సంక్షోభ సమయాల్లో ఇతరుల ప్రాణాలను కాపాడే విధుల్లో తమ ప్రాణాలను కోల్పోతున్న మానవతామూర్తుల అమరత్వాన్ని, త్యాగాలను, నిస్వార్థ సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట 19 ఆగష్టు రోజున ప్రపంచ మానవత్వ దినోత్సవం లేదా వరల్డ్ హుమానిటేరియన్ డేగా పాటించడం 2009 నుంచి కొనసాగుతున్నది. వరల్డ్ హ్యూమానిటేరియన్ డే–2026 సందర్భంగా ప్రపంచ సంఘీభావాన్ని దృఢ పరచడం, స్థానిక పౌర సమాజాన్ని శక్తివంతం చేయడం అనే ఇతివృత్తాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మానవతామూర్తుల సేవలను గుర్తించడం, వారిని సన్మానించుకోవడం, అలాంటి నిస్వార్థ సేవకులకు నిధులు సమకూర్చడం లాంటి కార్యక్రమాలు ఈ వేదికగా ప్రచారం చేయడం జరుగుతున్నది. ఐరాస స్వచ్ఛంద సేవా బృందాలు, రెడ్ క్రాస్, రోటరీ, లయన్స్ అంతర్జాతీయ సంస్థల ద్వారా సేవా మూర్తులు అభాగ్య జనులను కాపాడటంలో ముందుకు రావడం ముదావహం. మానవత్వం ప్రకటించడానికి ముహూర్తాలు ఉండవు. మన ముందు జరిగే ప్రతి అన్యాయం, అవాంఛనీయ ఘటనను ప్రతిఘటించడానికి మనం కూడా స్వయం సేవకుల వలె మారాలి, సానుభూతికి బదులుగా సహానుభూతిని ప్రదర్శించి మనిషిలోని దైవత్వాన్ని తట్టి లేపాలి. ప్రపంచ సమస్యలకు దివ్య ఔషధం మానవత్వమే అని రుజువు చేయాలి. చెట్టంత పెరిగి చెట్టు వలె పరహితం కోరి బతకడం అలవర్చుకోవాలి.

(19 ఆగష్టు ప్రపంచ మానవత్వ దినోత్సవం సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

### జీవన ప్రమాణాలను పణంగా పెట్టి

# సార్వభౌమత్వ పరిరక్షణకు క్యూబన్‌ల దృఢ సంకల్పం

**కె.రామకృష్ణ,** సిపిఐ జాతీయ కార్యదర్శి

క్యూబా కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానం మేరకు ఫిడెల్ కాస్ట్రో, యువత అంతర్జాతీయ ఆరాధ్యదైవమైన ఎర్నెస్ట్ చే గువేరాల విప్లవ భూమి అయిన క్యూబాకు ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం వెళ్ళింది. అగ్రరాజ్యమైన యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు కేవలం 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ద్వీప దేశం క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో శత జయంతి ఉత్సవాలకు సిపిఐ మాజీ ఎమ్మెల్యే, జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ(వ్యాసకర్త), సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యు డు అరుణ్ ప్రాతినిధ్యం వహించారు.

ఫిడెల్ కాస్ట్రో శత జయంతి ఉత్సవాలు 2026 ఆగస్టు 13న హవానాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయన బాటిస్టా నియంతకు వ్యతిరేకంగా పోరాడి సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభుత్వా న్ని స్థాపించిన ప్రఖ్యాత విప్లవ యోధుడు. ఫిడెల్ కాస్ట్రో, చే గువేరా నేతృత్వంలోని క్యూబన్ ప్రభుత్వం అనేక వలస వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, అన్నింటికంటే ముఖ్యంగా సైనిక పాలన వ్యతిరేక ప్రభుత్వాల ఏర్పాటుకు ఒక స్ఫూర్తిగా నిలిచింది. క్యూబన్ విప్లవానికి ముందు అమెరికా వెనుకనుంచి ఆడించే ప్రభుత్వాలు ఉండేవి. ఆ దేశాలు ప్రపంచ బ్యాం కు, అంతర్జాతీయ ద్రవ్య నిధి మొదలైన వాటి పై ఆధారపడి ఉండేవి.

ప్రజాస్వామ్య సంస్థలను రద్దుచేసిన బాటిస్టా నియంతకు వ్యతిరేకంగా 1959 జనవరి 1న క్యూబన్ విప్లవం జరిగింది. దీనికి ఫిడెల్ కాస్ట్రో, చే గువేరా, రౌల్ కాస్ట్రో తదితరులు నేతృత్వం వహించారు. సైనిక స్థావరంపై ఫిడెల్ కాస్ట్రో చేసిన దాడి విఫలమవటంతో, ఆయనను బంధించి, ప్రవాసానికి పంపించారు. ప్రవాసం నుండి తిరిగి వచ్చిన అనంతరం ఆయన చే గువేరాతో కలిసి 80 మంది విప్లవకారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి హవానాకు తిరిగి వచ్చారు. సమీపంలోని అడవులలో గెరిల్లా బృందాలు ఏర్పడ్డాయి. పట్టణ ప్రాంతాలలో కూడా ప్రతిఘటన పెరిగింది. క్యూబన్ గెరిల్లాల యుద్ధం కారణంగా బాటిస్టా దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. విప్లవానంతరం సోషలిస్ట్ ప్రభుత్వం ఏర్పాటైంది. దాని మొదటి అడుగుగా ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలో భూ సంస్కరణలను అమలు చేసింది. క్యూబా 'చక్కెర సముద్రంలో మునిగిపోతుందని' అమెరికా మాజీ అధ్యక్షులు సవాలు విసిరారు. క్యూబా ఎక్కువగా చక్కెర, పొగాకును పండిస్తుంది. దిగుమతులు, ఎగుమతులపై అమెరికా ఆంక్షలు, దిగ్బంధనాలను విధించింది. నాటి సోవియట్ యూనియన్, మొదట చమురు సరఫరా చేయడం ద్వారా, ఆ తర్వాత వెనిజు లా ద్వారా సోషలిస్ట్ క్యూబాకు మద్దతు ఇచ్చింది. అగ్రరాజ్యమైన అమెరికా, కొత్తగా స్వాతంత్ర్యం పొందిన చిన్న క్యూబాపై కనికరంలేని సామ్రాజ్యవాద దురాక్రమణకు పాల్పడుతున్నప్పటికీ, ఆరు దశాబ్దాలుగా క్యూబా స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని నిత్యం కాపాడుకుంటున్న విప్లవ క్యూబా ప్రజలకు హ్యాట్సాఫ్. ఫిడెల్ కాస్ట్రో ఇరవయ్యవ శతాబ్దపు అత్యుత్తమ సామ్రాజ్యవాద వ్యతిరేకి, గొప్ప మార్క్సిస్ట్ – లెనినిస్ట్. క్యూబా విప్లవం నియంతృత్వానికి లోనైన ఒక చిన్న దేశాన్ని సామ్యవాద దేశంగా మార్చింది. క్యూబా ఆర్థిక వ్యవస్థ నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంది. 1) ఇంధనం 2) ఆహార ఉత్పత్తి 3) జీవ సాంకేతికత 4) రవాణా. వైద్య, ఆరోగ్య రంగాలలో ఇది గొప్ప ఘనతలను సాధించింది. ఇక్కడ ప్రతి 155 మందికి ఒక డాక్టర్ ఉన్నారు. అంటే ప్రతి 155 మందికి ఒక డాక్టర్ అందుబాటులో ఉన్నారు. సామ్యవాద క్యూబా 4 లక్షల మంది వైద్య నిపుణులను 164 దేశాలకు పంపింది. గతంలో ఇది ప్రధానంగా చక్కెర, పొగాకుపై దృష్టి సారించేది. అవే పంటల కారణంగా భూమి సారం క్షీణించడంతో, వారు వ్యవసాయ రంగంలో





కొన్ని సంస్కరణలను తీసుకువచ్చారు. ప్రస్తుతం వారు బహుళ పంటలను సైతం పండిస్తూ, వాటిపై దృష్టి సారిస్తున్నారు. క్యూబా ప్రభుత్వం వివిధ రంగాలలో 176 సంస్కరణలను ప్రవేశ పెట్టింది. సామాజిక న్యాయం ఆధారంగా స్థాపించబడిన ఈ సామ్యవాద సమాజం సార్వత్రిక విద్య, ఉచిత ఆరోగ్య సంరక్షణ మొదలైనవాటిని ప్రవేశపెట్టింది. క్యూబా వైద్యం, బయోటెక్నాలజీ, విపత్తు నిర్వహణ, అన్నింటికంటే ముఖ్యంగా సామాజిక అభివృద్ధి వంటి వివిధ రంగాలలో బహుముఖ విజయాలను సాధించింది.

2014లో లండన్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ బయోటెక్నాలజీ సదస్సులో పాల్గొన్నప్పుడు, ఊపిరితిత్తుల క్యాన్సర్, పిల్లల న్యుమోనియా కోసం క్యూబా శాస్త్రవేత్తలు వ్యాక్సిన్లను, అల్జీమర్స్ వ్యాధి కోసం మోనోక్లోనల్ యాంటీబాడీ ఆధారిత మందులను అభివృద్ధి చేశారని ఒక ప్రతినిధి నాకు తెలియజేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో పాశ్చాత్య బహుళజాతి ఫార్మాస్యూటికల్ సంస్థల మాదిరిగా కాకుండా, క్యూబా అనేక కరేబియన్, లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ దేశాలకు లక్షలాది వ్యాక్సిన్ డోసులను ఉచితంగా సరఫరా చేసింది. క్యూబా వైద్యపరమైన పురోగతులు, అక్కడి ప్రజలకు, సమీప, సుదూర పొరుగు దేశాలకు అద్భుతమైన ఆరోగ్య సంరక్షణను అందించేందుకు వీలు కల్పిస్తున్నా యి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా మొదలైన దేశాల విమోచన పోరాటాలకు ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలోని సామ్యవాద క్యూబా సంఘీభావం తెలిపింది.

కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ఆ తర్వాత ఆయన గ్రీన్‌ల్యాండ్‌ను కూడా స్వాధీనం చేసుకుంటామని ప్రకటించగా, ప్రజలు దానిని తిరస్కరించారు. నిన్న గాజా, నేడు ఇరాన్, రేపు క్యూబా. కానీ, తీవ్రమైన పోరాటా లు చేసిన క్యూబా ప్రజలు సామ్రాజ్యవాద శక్తుల దుష్ట ఒత్తిడికి లొంగబోరు. జాన్ ఎఫ్. కెన్నెడీ నుంచి ట్రంప్ పాలన వరకు, అంటే 67 సంవత్సరాలుగా అమెరికా ఇంధన రంగంపై ఆంక్ష లు విధిస్తుండటంతో, క్యూబాలోని పాఠశాలలు, ఆసుపత్రులు మూతపడుతున్నాయి. రవాణా రంగం సంక్షోభంలో ఉంది. నిత్యావసర వస్తువైన నీటి సరఫరా కూడా నిలిచిపోయింది. తరచుగా విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయి. పర్యాటక రంగం కూడా చాలా వరకు దెబ్బతింది. గతంలో సోవియట్ యూనియన్ చమురును సరఫరా చేసింది. ఆ తర్వాత హ్యూగో ఛావెజ్ నేతృత్వంలోని వెనిజులా ప్రభుత్వం రోజుకు 1.10 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేసింది. ప్రస్తుతం వెనిజులా పరిస్థితి అందరికీ తెలిసిందే.

సోషలిస్ట్ క్యూబా జనాభా కేవలం 90 లక్షలు, అంటే కోటి కూడా లేదు. ఇది అమెరికాలోని మియామికి 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. క్యూబా విప్లవాన్ని నిర్వీర్యం చేయడానికి, ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి అమెరికా ప్రయత్నించింది. గతంలో అమెరికా, ఫిడెల్ కాస్ట్రోను చంపడానికి 368 సార్లు ప్రయత్నించింది. ప్రస్తుతం ట్రంప్, క్యూబా మాజీ పౌరుడైన ఒక విదేశాంగ కార్యదర్శిని క్యూబా అధ్యక్షుడిగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భారతదేశంతో సహా అనేక దేశాలు అమెరికాకు లొంగిపోయాయి. క్యూబాకు దిగుమతులు, ఎగుమతులపై విధించిన ఆంక్షలు, నిషేధాల విషయంలో మోదీ నోరు విప్పడం లేదు.

క్యూబా రాజధాని హవానాలో 2026 ఆగస్టు 7–8 తేదీలలో 24వ అంతర్జాతీయ కమ్యూనిస్ట్, వర్కర్స్ పార్టీల సమావేశం జరిగింది. చైనా, వియత్నాం, నమీబియా, అమెరికా సహా 48 దేశాల నుండి 68 రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు ఇందులో పాల్గొని, క్యూబాకు సంఘీభావాన్ని ప్రకటించడంతో పాటు, క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలను ఖండించారు.


సిపిఐ, సిపిఐ(ఎం) జాతీయ నాయకులైన కె. రామకృష్ణ, అరుణ్, భారతదేశంలో సేకరించిన మందులను క్యూబా వైద్య బృందానికి అందజేశారు. తీవ్రమైన మందుల కొరతను ఎదుర్కొంటున్న క్యూబాకు విరాళంగా ఇచ్చేందుకు సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు భారతదేశంలో ఈ మందులను సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకుడు కామ్రేడ్ వెంకట్ కూడా పాల్గొన్నారు.క్యూబా పర్యటనలో సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు క్యూబా ప్రస్తుత అధ్యక్షుడు డియాజ్ కానెల్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా 'ఖాళీ కంచాలతో సార్వభౌమాధికారం ఉండదు' అని ఆయన పునరుద్ఘాటించారు. సామ్రాజ్యవాద కుట్రలను క్యూబా ప్రజలు సహించబోరని కూడా పలువురు పేర్కొన్నారు.

# మారుతున్న కాలంలో మసకబారుతున్న మట్టి వాసన

పల్లె అంటే నాలుగు ఇళ్లు, పొలాలు మాత్రమే కాదు.. భారతీయ సమాజానికి మూలస్తంభమైన ఒక జీవన విధానం. మట్టితో మనిషికి ఉన్న అనుబంధం, కష్టాన్ని నమ్ముకుని బతికే తత్వం, ఒకరి కష్టానికి మరొకరు అండగా నిలిచే ఆత్మీయత.. ఇవే పల్లె జీవనానికి అసలైన బలం. తెల్లవారకముందే పొలానికి వెళ్లే రైతు నుంచి.. ఇంటి పనులతో పాటు వ్యవసాయ పనుల్లోనూ భాగస్వామి అయ్యే మహిళ వరకు.. పల్లె బతుకులు శ్రమకు ప్రతిరూపాలు. కానీ కాలం మారుతోంది. పల్లె ముఖచిత్రం వేగంగా మారుతోంది. మౌలిక వసతులు పెరుగుతున్నా.. గ్రామీణ జీవనానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోంది. యువత ఉపాధి కోసం పల్లె ను వీడుతోంది. సంప్రదాయ వృత్తులు కనుమరుగవుతున్నాయి. అభివృద్ధి కనిపిస్తున్నా.. పల్లె మనిషి భవిష్యత్తుపై భరోసా మాత్రం ఇంకా ప్రశ్నగానే ఉంది. దేశానికి అన్నం పెట్టే రైతు జీవితంలో మాత్రం స్థిరత్వం కొరవడుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీ, నీరు, విద్యుత్తు.. సాగు వ్యయం ఏటేటా పెరుగుతోంది. మరోవైపు వర్షాభావం, అధిక వర్షాలు, తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలు పంటను దెబ్బతీస్తున్నాయి. పంట చేతికొచ్చిన తర్వాత కూడా రైతుకు అసలు పరీక్ష మొదలవుతోంది. మార్కెట్ ధరపై నియంత్రణ లేకపోవడం, మధ్యవర్తులపై ఆధారపడాల్సి రావడం, నిల్వ సదుపాయాల కొరత.. రైతు శ్రమకు తగిన ఫలితం దక్కకుండా చేస్తున్నాయి. పంట పండించడం ఎంత కష్టమో.. దాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం అంతకంటే పెద్ద పోరాటంగా మారింది. అందుకే రైతు ఆదాయాన్ని పెంచడం అంటే కేవలం పంట దిగుబడిని పెంచడం కాదు.. పంటకు ధర, నిల్వ, రవాణా, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి మొత్తం వ్యవస్థను బలోపేతం చేయడం. రైతు ముడి సరుకును అమ్మే స్థాయి నుంచి విలువ జోడించిన ఉత్పత్తిని మార్కెట్ చేసే స్థాయికి ఎదగడానికి అవసరమైన మద్దతు అందాలి.

వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల్లో మారుతున్న ఆర్థిక పరిస్థితులు యువత ఆలోచనలను కూడా మార్చుతున్నాయి. చదువుకుంటే ఉద్యోగం రావాలి.. ఉద్యోగం అంటే పట్టణంలోనే ఉండాలి అనే భావన బలపడుతోంది. గ్రామంలో ఉండి వ్యవసాయం చేయడం కంటే.. పట్టణానికి వెళ్లి ఏదో ఒక ఉద్యోగం చేయడం భద్రమనే అభిప్రాయం పెరుగుతోంది. యువతకు మెరుగైన అవకాశాల కోసం వలస వెళ్లే హక్కు ఉంది. కానీ పల్లెలోనే అవకాశాలు ఎందుకు సృష్టించలేకపోతున్నామన్న ప్రశ్నను తప్పించుకోలేం. వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలి. ఆహార శుద్ధి యూని ట్లు, పాడి పరిశ్రమ, పశుపోషణ, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, ఉద్యాన పంటలు వంటి అనుబంధ రంగాలను గ్రామాల్లోనే ప్రోత్సహించాలి. స్థానిక వనరులకు అనుగుణం గా చిన్న పరిశ్రమలు, గ్రామీణ సేవా కేంద్రాలు, ఉపాధి అవకాశాలు ఏర్పడితే యువతకు పల్లెలోనే భవిష్యత్తు కనిపిస్తుంది. ఉపాధి కోసం యువత పల్లెను విడిచి వెళ్లే పరిస్థితి కాకుండా.. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి యువత పల్లెకు వచ్చే పరిస్థితి రావాలి. పల్లె ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను కూడా విస్మరించలేం. ఇంటిని నడిపించడం నుంచి పొలంలో పనిచేయడం వరకు ఆమె శ్రమ ఎంతో. పశుపోషణ, వ్యవసాయ పనులు, చిన్నచిన్న వ్యాపారాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు.. ఇలా అనేక రూపాల్లో గ్రామీణ మహిళ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతోంది. అయినా ఆమె శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం చాలా సందర్భాల్లో దక్కడం లేదు. మహిళలకు రుణాలు ఇవ్వడం ఒక్కటే సాధికారత కాదు. నైపుణ్య శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్, ప్యాకేజింగ్, డిజిటల్ విక్రయాలు, బ్రాండింగ్ వంటి అవకాశాలను కల్పించాలి. మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుంది. కుటుంబం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

ఒకప్పుడు పల్లె జీవనంలో భాగమైన కుమ్మరి చక్రం, కమ్మరి కొలిమి, నేత మగ్గం, బుట్టలు అల్లే చేతులు ఇప్పుడు అరుదవుతున్నాయి. సంప్రదాయ వృత్తులకు డిమాండ్ తగ్గడం, ఆధునిక ఉత్పత్తులతో పోటీ, మార్కెట్ సదుపాయాల కొరత.. కారణాలు ఏవైనా వాటితో పాటు ఒక పెద్ద జీవన జ్ఞానం



కూడా కనుమరుగవుతోంది. ఇవి కేవలం పాత వృత్తులు కావు.. తరతరాలుగా వచ్చిన నైపుణ్యాలు, గ్రామీణ సంస్కృతిలో భాగాలు. వాటిని జ్ఞాపకాలుగా మిగలనివ్వకుండా ఆధునిక మార్కెట్‌తో అనుసంధానం చేయాలి. నాణ్యత, డిజైన్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఆన్‌లైన్ విక్రయాలు వంటి అవకాశాలు కల్పించాలి. ఉత్పత్తి చేయడం తెలిసిన చేతులకు మార్కెట్ చేరువైతే.. ఆ చేతులే మళ్లీ పల్లె ఆర్థిక వ్యవస్థకు బలంగా మారగలవు. పల్లె బతుకు నీటితో ముడిపడి ఉంది. చెరువులు, వాగులు, కాలువలు, భూగర్భజలాలు.. ఇవే గ్రామీణ జీవనానికి సహజ ఆధారాలు. నీటి వనరులు దెబ్బతింటే వ్యవసాయం మాత్రమే కాదు.. పశుపోషణ, ఉపాధి, తాగునీరు, మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుంది. అందుకే చెరువుల పరిరక్షణ, ఆక్రమణల నివారణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి పేరుతో సహజ వనరులను కోల్పోతే భవిష్యత్ తరాల కు పల్లెల్లో జీవించడం మరింత కష్టమవుతుంది.

గ్రామాల్లో రోడ్లు వచ్చాయి. విద్యుత్తు, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇళ్ల రూపం మారింది. రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇవన్నీ అవసరమే. కానీ అభివృద్ధిని కేవలం రోడ్లు, భవనాలు, విద్యుత్ స్తంభాలతో కొలవలేం. గ్రామీణ విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతోందా? అత్యవసర సమయంలో వైద్యం అందుబాటులో ఉందా? సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్య సేవలు అందుతున్నాయా? వృద్ధులు, మహిళలు, పిల్లలకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న. సిమెంట్ రోడ్డు అభివృద్ధిలో ఒక భాగం మాత్ర మే.. మనిషి జీవన ప్రమాణం పెరగడమే అసలు అభివృద్ధి. మార్పు పల్లె ఆర్థిక వ్యవస్థకే పరిమితం కాలేదు. సామాజిక సంబంధాలపైనా దాని ప్రభావం పడుతోంది. ఒకప్పుడు ఒకరి ఇంటి కష్టం మొత్తం ఊరి కష్టంగా ఉండేది. పెళ్లి అయినా, పండుగ అయినా, ఆపద వచ్చినా అందరూ కలిసి నిలబడేవారు. ఇప్పుడు వలసలు, వ్యక్తిగత జీవనశైలి, ఆర్థిక ఒత్తిళ్లు, సాంకేతికత ప్రభావంతో ఆ అనుబంధంలోనూ మార్పు కనిపిస్తోంది. మార్పును ఆపలేం. కానీ అభివృద్ధి పేరుతో మానవత్వాన్ని కోల్పోకూడదు. సాంకేతికత పెరగాలి.. సంబంధాలు తగ్గకూడదు. ఆదాయం పెరగాలి.. ఆత్మీయత తగ్గకూడదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అవసరమే. ఆపదలో ఉన్న కుటుంబాలకు అవి ఊరటనిస్తాయి. కానీ సంక్షేమం ఒక్కటే శాశ్వత పరిష్కారం కాదు. ఒక కుటుంబానికి తాత్కాలిక సాయం అందించడం కంటే.. ఆ కుటుంబం తన కాళ్లపై తాను నిలబడేలా చేయడం ముఖ్యం. నైపుణ్యం, పెట్టుబడి, మార్కెట్, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతులు అందించినప్పుడే గ్రామీణ కుటుంబాలు స్వయం ఆధారితంగా ఎదగగలవు. సంక్షేమం చేయి అందించాలి.. సాధికారత నిలబడే శక్తిని ఇవ్వాలి.

పల్లెను కాపాడటం అంటే పల్లెను గతంలోనే నిలిపివేయడం కాదు. పల్లెకు ఆధునిక సౌకర్యాలు రావాలి, మంచి పాఠశాలలు ఉండాలి, నాణ్యమైన వైద్యం అందాలి, ఇంటర్నెట్ ఉండాలి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు రావాలి, రైతుకు సాంకేతికత అందాలి. మహిళలకు ఆర్థిక స్వావలంబన కలగాలి. సంప్రదాయ వృత్తులకు మార్కెట్ దక్కాలి. అదే సమయంలో పల్లె తన మట్టి ని, నీటిని, వ్యవసాయాన్ని, ప్రకృతిని, సంస్కృతిని, మానవ సంబంధాలను కోల్పోకూడదు. పల్లె దేశానికి వెనుకబడిన ప్రాంతం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది. రైతు చేతిలో పండే పంట నుంచి గ్రామీణ కూలీ శ్రమ వరకు.. పల్లె దేశ ఉత్పత్తి వ్యవస్థకు వెన్నెముకగా ఉంది. పల్లె బతుకు బాగుపడితేనే గ్రామీణ భారతం బలపడుతుంది. గ్రామీణ భారతం బలపడితేనే దేశ ప్రగతి సుస్థిరమవుతుంది. అందుకే పల్లెను జాలితో చూడాల్సిన అవసరం లేదు, గౌరవంతో చూడాలి. పల్లెకు దానం కాదు.., అవకాశం కావాలి. పల్లెకు హామీలు కాదు, భరోసా కావాలి. పల్లెకు శాశ్వత ఆర్థిక బలం కావాలి. మారుతు న్న పల్లెకు మార్పు అవసరమే.. కానీ ఆ మార్పు మధ్య పల్లె మనిషి బతుకుకు భరోసా ఉండాలి.

పార్వతి సురేష్ కుమార్
జర్నలిస్ట్, మంచిర్యాల.

# వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్‌టిఎ చెలగాటం

ఎఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి వార్షికోత్సవాలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్‌టిఎ చెలగాటం ఆడుతున్నదని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన బాలసముద్రం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ జూన్‌లో జరిగిన యుజిసి నెట్ ప్రవేశ పరీక్షలో తప్పులు, లోపాలు జరిగి, ఇంగ్లీష్, సోషియాలజీ, కామర్స్ పేపర్‌లను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టిఎ ప్రకటించడం అంటే విద్యార్థుల జీవితాలతో చెలగటమేనని, నీట్ పేపర్ లీక్, పరీక్షల్లో అవకతవకలు మొదలుకొని నేటి యుజిసి నెట్ ప్రశ్న పత్రాల తప్పులు, లోపల వరకు ఎన్‌టిఎ పరీక్షల నిర్వహణ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వుందని, వరుస వైఫల్యాలతో ఎన్‌టిఎలో జరుగుతున్న అక్రమాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. వరుస తప్పిదాలతో ఎన్‌టిఎ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని, దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఎన్‌టిఎ అధికారులు చేస్తున్న తప్పులకు విద్యార్థులు బలి అవుతున్నారని, ఎన్‌టిఎ సంస్థ నిత్యం పరీక్షల నిర్వహణలో తప్పులు చేస్తూ అవకతవకలు, అక్రమాలు చేస్తూన్న కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒక సంస్థను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి ఒక ఎన్‌టిఎ సంస్థ ముఖ్యమా లేక దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమా ఆలోచించాలని, ప్రధాని మోదీ వెంటనే దీనిపై స్పందించాలని, కొన్ని పరీక్షల నిర్వహణ కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో కాకుండా రాష్ట్రాలకు కూడా ఇవ్వాలని, వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎన్‌టిఎను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ 90 వసంతాల ప్రస్థానంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా సెప్టెంబర్ 28,29,30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం, దేశ ఐక్యత, శాంతి కోసం నిరంతరం పోరాడిన చారిత్రక విద్యార్థి సంఘం అని, 1936లో ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక తరాల విద్యార్థులను ఉద్యమ బాటలో నడిపించిన ఘనమైన చరిత్ర ఎఐఎస్‌ఎఫ్‌కు ఉందని అన్నారు. 90 సంవత్సరాల ఈ ప్రస్థానం సందర్భంగా గత పోరాటాలను స్మరించుకోవడం, ఆ పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించడం, భవిష్యత్ విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేయడం ఈ వార్షికోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మాజీ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, విద్యార్థుల తరపున మరింత బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, యాదల్ల శరత్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కొండ చరణ్, బన్నీ, చిర సాయి, జిల్లా సమితి సభ్యులు కందగట్ల అజయ్, మల్లబోయిన రామ్ చరణ్, అవినాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఎవరెక్కడ ఉండాలో ప్రజలదే నిర్ణయం

- రాజకీయాల్లో సద్విమర్శ అవసరమే.. కానీ విమర్శలు హద్దులు దాటకూడదు
- 'శాసన మండలి ఎథిక్స్ కమిటీ' చైర్మన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో ఎవరు, ఎక్కడ ఉండాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, రాజకీయాల్లో సద్విమర్శ అవసరమేనని, కానీ విమర్శలు హద్దులు దాటకూడదని 'శాసన మండలి ఎథిక్స్ కమిటీ' చైర్మన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. శాసనసభ, శాసన మండలి సభ్యులు సమాజానికి ఆదర్శప్రాయంగా వ్యవహరించాలని, ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని తెలిపారు. చట్టసభల జరిగే చర్చలల్లో భాషా విషయంలో కూడా సభ్యులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన శాసనమండలి కౌన్సిల్ హాల్‌లో మంగళవారం 'శాసన మండలి ఎథిక్స్ కమిటీ' ప్రాథమిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయం, సమానత్వం వంటి విలువలను మరింత బలోపేతం చేయడమే ఎథిక్స్ కమిటీ ప్రధాన లక్ష్యమన్నారు. మండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేందుకు ఎథిక్స్ కమిటీ కృషి చేస్తుందని, ప్రజాస్వామ్య విలువలు, నైతిక ప్రమాణాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. నైతిక ప్రమాణాల అమలు, శాసన వ్యవస్థ గౌరవం, ప్రజల విశ్వాస పరిరక్షణ దిశగా ఎథిక్స్ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందని, సభ్యుల హక్కుల విషయంలో ప్రివిలేజ్ కమిటీ తరహాలోనే ఎథిక్స్ కమిటీ కూడా సభ్యుల విలువలను ప్రతిబింబించేలా పని చేసేందుకు కృషి చేస్తుందని మహేష్ కుమార్ అన్నారు.

# '22ఎ' తప్పులను ఒప్పుకున్నాం

- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు
- ధరణి తప్పులకు సమాధానం చెప్పే ధైర్యం హరీశ్ రావుకు ఉందా
- రాష్ట్రసమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 22ఎ నిషేధిత జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేదవాడి న్యాయబద్ధమైన భూమిలో ఒక్క అంగుళం కూడా తీసుకోదని, వారి హక్కులు, ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. 22ఎ జాబితా వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే మొదలైందని తెలిపారు. 24గంటల వ్యవధిలోనే మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4 చొప్పున మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు.

### సాంకేతిక లోపంతోనే జాబితాలోకి..

హైకోర్టు ఆదేశాల మేరకు 22ఎ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరిగాయని మంత్రి వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జిఒలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ అనుమతులు పొందిన స్థలాలు సాంకేతిక లోపం వల్ల 22ఎ జాబితాలోకి చేరాయని చెప్పారు. ఈ పొరపాటును ప్రభుత్వం వెంటనే గుర్తించి, బాధితులకు ఇబ్బంది కలగకుండా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను పునరుద్ధరించిందన్నారు. తప్పు జరిగితే దాన్ని అధికారుల మీదకు నెట్టేసి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని, చిత్తశుద్ధి ఉన్నందునే పొరపాటును బహిరంగంగా అంగీకరించామన్నారు.

### 15 రోజుల్లో పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

22ఎ సమస్యల త్వరిత పరిష్కారం కోసం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి, జెన్యూన్ ప్రైవేట్ ఆస్తులన్నింటినీ తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు.

### ధరణి పేరుతో ప్రజలు పడ్డ ఇబ్బందులకు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా?

'విమర్శలు చేయడం సులువు, బాధ్యత తీసుకోవడం అంత సులువు కాదు. 22ఎ విషయంలో పొరపాటు జరిగిందని మేం బహిరంగంగా అంగీకరించాం, దాన్ని సరిదిద్దే బాధ్యత కూడా తీసుకున్నాం. వారు పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ధరణి పేరుతో ప్రజలు పడ్డ ఇబ్బందులకు ఏనాడైనా బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనేత హరీశ్ రావును ప్రశ్నించారు. పేదవాడి సమస్యలను రాజకీయంగా వాడుకోవడం మానుకోవాలని, తాము తప్పును ఒప్పుకుని సరిదిద్దుతుంటే, తాము చేసిన తప్పులను అంగీకరించే ధైర్యం ప్రతిపక్షానికి ఉందా అని మంత్రి నిలదీశారు. అబద్ధాలు, ఆరోపణలు, రాజకీయ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న హరీశ్ రావుకు ఇప్పటికీ 30 శాతం కమీషన్లు ఎందుకు గుర్తుకొస్తున్నాయో ప్రజలకు తెలుసని, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన పరిణామాలకు ఆయన ఎన్నడైనా బాధ్యత వహించారా? అని ప్రశ్నించారు. తన శాఖలో పొరపాటు జరిగిందని చెప్పి, దానికి పరిష్కారం చూపేందుకు తాను బాధ్యత తీసుకుంటున్నానని, ఇదే తేడా అని మంత్రి అన్నారు.

### ఆరోపణలకు ఆధారాలు చూపాలి : ఏలేటికి కౌంటర్

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలపైనా మంత్రి పొంగులేటి స్పందించారు. తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని, తనపై ఆరోపణ చేసేవారు ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని సవాలు చేశారు. ఫీనిక్స్, రాఘవ తదితర సంస్థలతో వ్యాపార లావాదేవీలు జరగడం సహజమని, వాటిని పట్టుకుని రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నానని, అంచెలంచెలుగా ఎదిగి ఈ స్థాయికి వచ్చానని, ఒక్కరోజులో వేల కోట్లకు ఎదిగిన వ్యక్తిని కాదన్నారు. తన వ్యాపార ప్రస్థానం, నేపథ్యం రాష్ట్ర ప్రజలకు తెలుసని, ఆరోపణలు చేసేవారు ముందుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

# 24 నుంచి ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమ్మె

మీటర్ చార్జీలు పెంచాలి.. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం /హైదరాబాద్:** ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్ ను జెఎసి నాయకులు బి. వెంకటేశం, ఎ. సత్తిరెడ్డి, ఎం.ఎ. సలీం, ఎం. కృష్ణ, ఎం. శ్రీనివాస్, ఎం.డి. నజీర్, చిన్న రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో మీటర్ చార్జీలను పెంచాలని, ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 24 నుంచి సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డితో 'తెలంగాణ ఉద్యమకారుల' కమిటీ భేటీ

'ఉద్యమకారుల గుర్తింపు'పై సమగ్ర నివేదికతో ముఖ్యమంత్రి ముందుకు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో స్వీకరించిన పలు సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని 'ఉద్యమకారుల గుర్తింపు' అంశంపైన సమగ్ర నివేదికను సిద్ధం చేసి, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావాలని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె.కేశవరావు అధ్యక్షతన, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల గుర్తించే ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ఇప్పటికే వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి ఉద్యమకారులు,కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో వారి అనుభవాలు, అభిప్రాయాలను, సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఉద్యమ స్వరూపం, వివిధ దశల్లో ప్రజల భాగస్వామ్యం, ఉద్యమకారుల గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలు తదితర అంశాలపై వచ్చిన సూచనలను ఈ సమావేశంలో సమీక్షించారు.

# రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాల్సిందే



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం జరగాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గతంలో (బిఆర్‌ఎస్ ప్రభుత్వం) ధరణి, ప్రస్తుతం భూ భారతిని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తమ పార్టీ తరపున 'భూలక్ష్మి' పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఎకరం భూమిని పంపిణీ చేస్తామని హామీనిచ్చారు. పేదలకు భూములు పంచాల్సిన ప్రభుత్వమే , పరిశ్రమల పేరుతో వాళ్ల భూములను లాక్కుంటుందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల నుంచి 30 వేల ఎకరాలను గుంజుకున్నారన్నారు. నిజాం, పివి నర్సింహరావు లాంటి వాళ్లు పేదలకు భూములు ఇచ్చారని , వాటికి యాజమాన్య హక్కులను కల్పిస్తామని ఎన్నికల సందర్భంలో మాట ఇచ్చిన కాంగ్రెస్, ప్రస్తుతం ఆ భూములను స్వాధీనం చేసుకుంటుందని ఆరోపించారు. సిఎంను గెలిపిస్తే ఆయన ఏడుగురు అన్నదమ్ములు, శ్రీధర్ బాబును గెలిపిస్తే వాళ్ల సోదరుడు, భట్టివిక్రమార్కను గెలిపిస్తే వాళ్ల కుటుంబం, పొంగులేటిని గెలిపిస్తే వాళ్ల కొడుకు ప్రజలపై జులుం చేస్తున్నారని కవిత ఆరోపించారు. 22–ఎ పేరుతో భూ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం రాచమార్గాన్ని ఏర్పాటు చేసుకుంటుందన్నారు. వి.హనుమంత రావు. శివధర్ రెడ్డికి సలహాదారు పదవులు ఇస్తే, బిసికి చెందిన హనుమంత రావు ర్యాంక్, జీతం ఎందుకు తక్కువగా ఉందని ప్రశ్నించారు. క్రమశిక్షణ చర్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రకులాలకు ఒక రకంగా, ఇతరులపై మరో రకంగా చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు.

# ఇసి లక్షలాది ఓట్లు తొలగించింది

- ఓటర్ల జాబితా నుంచి భారీగా 73 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ
- బిఎల్‌ఒలు క్షేత్రస్థాయిలో పర్యటించడంలేదు
- ఇసిని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చింది
- టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఇసి) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎలాంటి స్పష్టమైన కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ వస్తోందని, సిబిఐ, ఇడిల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'జేబు సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు 1.60 కోట్ల మంది ఓటర్లను ఎందుకు ప్రశ్నార్థకంగా మార్చారో ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. అర్హత కలిగిన ఒక్క ఓటును కూడా తొలగించకుండా కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. బిఎల్‌ఎలు జాబితాలు సమర్పించిన తర్వాత కూడా వాటిని తప్పుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఇంకా సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని, గడువును పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. సుమారు 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా ఉన్నాయని అర్హత కలిగిన ప్రతి ఓటును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఓట్ల తొలగింపునకు దారితీసే నిబంధనలు, షరతులను పునర్‌పరిశీలించాలని కోరారు. ఎఎస్‌డిడి, అనమలీస్, అన్ మ్యాప్డ్ కేటగిరీల్లో కోటి 60 లక్షల మంది ఓటర్లను ఎందుకు ప్రశ్నార్థకంగా ఉంచారో పూర్తి వివరాలను ప్రజలకు, రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా నిరంతరం పోరాడుతోందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై విచ్చలవిడిగా కేసులు పెడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని విమర్శించారు. బిహార్, పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ ఓట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల ఓట్లు ఉంటే 73 లక్షలకు పైగా ఓట్లు తొలగించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ముఖ్యంగా పేద, బలహీన వర్గాల ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.2002 నాటి వివరాలను తప్పనిసరిగా చూపించాలనే నిబంధన కారణంగా పలువురు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేని పరిస్థితి ఏర్పడిందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సుమారు 32 లక్షల 37 వేల ఓట్లు 'అన్ మ్యాప్డ్'గా ఉన్నాయని, 60 లక్షలకు పైగా ఓట్లు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. బిఎల్‌ఎలు 35 వేల ఓట్లకు రసీదులు ఇచ్చినప్పటికీ, ఎన్నికల సంఘం మాత్రం 13,100 మందికే రసీదులు ఇచ్చినట్లు చూపిస్తోందని ఆరోపించారు. ఓటర్ల వివరాలు సరిగ్గా ఉంటే 2002 నాటి వివరాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల.. జీతాల్లో కోత విధించొద్దు

సిడిఎంఎ కార్యాలయం ఎదుట ఎఐటియుసి భారీ ధర్నా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల జీతాలు తగ్గించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ఎసి గార్డ్స్‌లోని సిడిఎంఎ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ, మున్సిపల్ కార్మికులకు మాత్రం వాటిని అమలు చేయకుండా జీతాలు తగ్గించడం దుర్మార్గమని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వేతనాల కోతకు కారణమైన ఆర్థిక శాఖ జిఒ నెంబర్ 1181ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రెండో పిఆర్‌సి అమలు చేయాలని, అది సాధ్యంకాకపోతే శాశ్వతీకరణ జరిగే వరకు నెలకు కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, వాటర్ సప్లై సిబ్బంది, శానిటరీ జవాన్లు, ఎన్ఎంఆర్‌లు, బిల్ కలెక్టర్లు తదితర ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా జీతాలు తగ్గించడం తీవ్ర అన్యాయమన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, వితంతు పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించినా, అనారోగ్యంతో మృతి చెందినా లేదా 60 సంవత్సరాలు పూర్తయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్యతో పాటు కమతం యాదగిరి, కాంతారావు, బొడ్డుపల్లి కిషన్, ఎన్. కృష్ణ, ఏ.ధర్మారావు, ఎం.మద్దిలేటి, కె.నరసయ్య, ఉస్మాన్, ఎ.నారాయణ రెడ్డి, వి. హరనాథ్ రావు, వి.సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడాకారులకు అర్జున అవార్డులు గర్వకారణం

ధనుష్ శ్రీకాంత్, గాయత్రి గోపీచంద్‌కు మంత్రి వాకిటి శుభాభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతూ ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాష్ట్రానికి చెందిన షూటర్ ధనుష్ శ్రీకాంత్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గాయత్రి గోపీచంద్ అర్జున అవార్డులకు ఎంపిక కావడంపై మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ధనుష్ శ్రీకాంత్, గాయత్రి గోపీచంద్ తమ ప్రతిభ, కఠోర శ్రమ, పట్టుదలతో దేశ అత్యున్నత క్రీడా పురస్కారాల్లో ఒకటైన అర్జున అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. వారి విజయాలు తెలంగాణ క్రీడా రంగానికి మరింత గుర్తింపు తీసుకొస్తాయని పేర్కొన్నారు.రాష్ట్రంలోని యువ క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు. తెలంగాణ నుంచి మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. రాష్ట్ర క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు.

# రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అయితే గురువారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమే ఉన్నప్పటికీ, ప్రత్యేక వాతావరణ హెచ్చరికలు ఏవీ జారీ చేయలేదన్నారు.


**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఫోన్ నెం. 0878-2243438, ఫ్యాక్స్ నెం. 0878-224024. ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

NIT No. E1/DB/MCK/8201/280/MCK/2026-27 Date: 17.08.2026

మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ. 4.85 లక్షల అంచనా వ్యయంతో, MCK పరిధిలోని జ్యోతిబా పూలే మైదానంలో ఈద్ మిలాద్ కార్యక్రమ ఏర్పాట్లు కల్పించడం, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 18.08.2026 సా.04.00గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 21.08.2026 సా.04.00గం.ల వరకు, మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 8121-PP/CL/ADVT/2026-27, Date: 18-08-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 51/EE-I/ MKJZ/MMC/2026-27 | నిర్వహణ పనులు, ఇతరాలు-3 | రూ. 10.80 లక్షలు | 18.08.2026 నుండి 21.08.2026 వరకు, ఉదయం 11:30 గంటల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 8158-PP/CL/ADVT/2026-27, Date: 18-08-2026

తెలంగాణా ప్రభుత్వం

**రహదారుల మరియు భవనముల శాఖ**

టెండరు నోటీసు

**ఎన్.ఐ.టి.నం.:** ఎన్.ఐ.టి.నం.8/ఈ.ఈ/డి.బి/హెచ్.డి/2026-27,dt:14.08.2026, **ఎన్ని పనులు:** 7 పనులు, **పనుల పేర్లు:** నిజామాబాదు జిల్లాలోని సాధారణ మరమత్తుల పనులు, రహదారి పనులు మరియు రోడ్డు భద్రత గురించి, **అంచనా మొత్తం:** Rs.155.20 లక్షలు, **వేలం వేయుటకు ప్రారంభ తేది మరియు చివరి తేది:** తేది.20.08.2026 నుండి 03.09.2026 వరకు 3.30 PM, **టెక్నికల్ బిడ్ ప్రారంభ తేది:** తేది. 03.09.2026 @ 3.30PM, **ఫైనాన్స్ బిడ్ ప్రారంభ తేది :** తేది.03.09.2026 @ 4.00 PM. పైన తెలుపబడిన పనులు "ఇ-ప్రొక్యూర్‌మెంట్" వెబ్‌సైట్‌లో తేది.20.08.2026 నుండి 03.09.2026 @3.30PM వరకు లభించును. ఇతర వివరములకు @ www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహక అభియంత (ర. మ.భ) పరిధి, నిజామాబాదు

DIPR R.O. No. : 8197-PP/CL/ADVT/2026-27, Date: 18-08-2026

## అటవీ శాఖ కార్యాలయంపై ఎసిబి దాడి... ఇద్దరు అధికారులు అరెస్టు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కలప వ్యాపారవేత్తల నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై లింగాల మండల కేంద్రంలోని అటవీ కార్యాలయంపై ఎసిబి అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సెక్షన్ ఆఫీసర్ రాంబాబు, బీట్ ఆఫీసర్ మురళీకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప తరలిస్తున్న కొందరు కలప వ్యాపార వేత్తలను అటవీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. వారిని వదిలిపెట్టేందుకు రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ.50 వేల అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు ఎసిబికి ఫిర్యాదు అందింది. మిగిలిన రూ.లక్ష కోసం అధికారులు తరచూ డిమాండ్ చేయడంతో కలప వ్యాపారవేత్తలు ఎసిబి అధికారులను ఆశ్రయించినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంపై దాడి చేసి ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కార్యాయంలోని దస్తావేజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్ కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఉమ్మడి జిల్లా ఎసిబి డిఎస్‌పి బాలకృష్ణతో పాటు ఎసిబి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై దృష్టి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతుల ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూరాల, భీమా ప్రాజెక్టుల నీటిని ఆరుతడి పంటలకు మాత్రమే అందించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం తుంకుంట గ్రామంలో నిర్వహించిన క్షేత్ర ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మినుము, వేరుశనగ, ఆయిల్ పామ్, కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. మినుములో విబిఎన్8 రకం 70 నుంచి 80 రోజుల్లో పంటకు వచ్చి ఎకరాకు 7 నుండి 9 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. వేరుశనగలో కె6, వశిష్ట రకాలను సాగు చేసుకోవాలని, ఇవి సుమారు 110 రోజుల్లో చేతికి వస్తాయని, ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందని వివరించారు. ఆయిల్ పామ్ సాగుతో తక్కువ నీటితో అధిక ఆదాయం పొందవచ్చని డాకేశ్వర్ గౌడ్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఆదాయాన్ని అందించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ నారియా నాయక్, ఆయిల్‌పామ్ క్లస్టర్ అధికారి మహేష్, రైతులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తరలింపునకు చెక్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అక్రమ ఇసుక రవాణాపై మరికల్ పోలీసు లు కొరడా ఝుళిపించారు. మండలంలోని మరికల్ గ్రామ శివారులో కనక మహాలక్ష్మి రెస్టారెంట్ సమీపంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం తనిఖీల సమయంలో ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్ డ్రైవర్లుగా గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్.బాలు, తిగలపల్లి గ్రామానికి చెందిన మహేందర్, ట్రాక్టర్ డ్రైవర్‌గా మహేష్‌కు గుర్తించారు. మూడు వాహనాలను మరికల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

### ధన్వాడ మండలంలో



అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధన్వాడ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఎమునోనిపల్లి గేట్ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టీజీ 06 టీ 6556 నెంబర్ గల టిప్పర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు ఇసుక రవాణాకు సంబంధించి అనుమతులు లేనట్లు గుర్తించారు. వాహనం యజమానిని రాజాపూర్ మండలానికి చెందిన రాఘవేందర్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ధన్వాడ ఎస్సై మహేశ్వరి హెచ్చరించారు. ఈ ఘటనపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో



మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మక్తల్ పోలీసులు ప్రత్యేక తనిఖీల సందర్భంగా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న (04) నాలుగు ట్రాక్టర్లను దాసరపల్లి శివారులో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, సంబంధిత డ్రైవర్లు/ యాజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పి.రాజు ఎస్సై మక్తల్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసే వ్యక్తులు, వాహన యజమానులు, సంబంధిత వ్యక్తులు ఇకపై ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మక్తల్ పోలీసులు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ఆడబిడ్డల ఆర్థిక భరోసా, ఆత్మగౌరవాన్ని నిలిపింది కెసిఆర్

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి :** ఆడబిడ్డల ఆర్థిక భరోసా, ఆత్మగౌరవాన్ని నిలిపే కళ్యాణలక్ష్మి షాదిముబారక్ పథకాలు ఆపే కుట్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వ అంతు తెలుస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ కుట్రలపై బిఆర్‌ఎస్ కదనభేరి పేరిట రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తమ హక్కులు కాపాడుకోవడానికి కెసిఆర్ ఇచ్చిన సంక్షేమ పథకాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఉప్పెనల తరలివచ్చిన మహిళలను నిరంజన్ రెడ్డి అభినందిస్తూ కెసిఆర్ తన మానస పథకాలు కళ్యాణలక్ష్మి షాదిముబారక్ పథకాలు రద్దుకు కాంగ్రెస్ కుట్ర చేస్తే అంతు తెలుస్తామని హెచ్చరించారు.




# కార్మికులపై పని భారం తగ్గించాలి

**కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి : ఎఐటియుసి**



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నూతన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాల సామర్థ్యానికి అనుగుణంగా కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచి, పారిశుధ్యం, భద్రత, పేషెంట్ కేర్, సూప ర్ వైజర్ విభాగాల కార్మికులపై పని భారం తగ్గించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియ న్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణ పేట్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మె డికల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మికుల సమస్యలపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ ఛాంబర్‌లో యూనియన్ నాయకులు, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు, కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ నూతన ఆస్పత్రిలో భవనాలు, వార్డులు, ఓపీ బ్లాక్‌లు, థియేటర్లు, వైద్య సదుపాయాలు పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగకపోవడం బాధాకరమన్నారు. పాత ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులపై నే అదనపు పని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా సిబ్బంది లేకుండా ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రోగులకు సేవలందించడం ఎలా సాధ్యమ ని ప్రశ్నించారు. ఆస్పత్రి పడకల సామర్థ్యానికి అనుగుణంగా పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఏ జెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా కార్మికులకు నే రుగా వేతనాలు చెల్లించాలని కోరారు. కనీస వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని, జాతీయ పండుగలు, ఆర్జిత సెలవులు మంజూర చేయాలని, ఏడాదికి సెలవులు మంజూరు చేయాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం, బూట్లు అందించాలని అన్నారు. కార్మికులకు సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనె, గ్లౌజులు తదితర రక్షణ సామగ్రిని అందించాలని, వేధింపులు నిలిపివేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రవి, ఆస్పత్రి బ్రాం చ్ కార్మికులు లక్ష్యారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీను, కరుణాకర్, యా దేష్, వెంకటయ్య, కురుమయ్య, రమేష్ కుమార్, మొగులప్ప, రాములు, ఖదీర మధు, భీంరెడ్డి, అంబిక, దేవిక, ప్రవీణ, కవి త, లక్ష్మి , మల్లమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శంకుస్థాపనలు చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నర్వ :** మండల కేంద్రంలో మంత్రి వాకిటి శ్రీహరి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.54 లక్షల నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన అండర్ గ్రౌండ్, సీసీ రోడ్డును, ప్రజాప్రతినిధులు, మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో 2025 రబీ సీజన్‌లో ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసిన వరి బస్తాలకు సంబంధించిన రవాణా ఖర్చులను రైతులకు మంత్రి శ్రీహరి పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు నగదును అందజేశారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, స్థానిక నాయకులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి ఆటో కార్మికుల సమ్మె



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఆగస్టు 24 నుంచి జరగనున్న ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎఐటియుసి పట్టణ అధ్యక్షులు దేశం సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం సైదులు మాట్లాడుతూ ఆటో రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న సమ్మెకు అన్ని ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రతి ఆటో కార్మికునికి ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమ్మెను విజయవంతం చేసేందుకు ఆటో కార్మికులంతా ఐక్యంగా కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో కార్మికులు ఎస్.కె. అమీర్, రాజేష్, ఓర్సు బాలస్వామి, మహేష్, నాగరాజు, లక్ష్మీకాంత్ రెడ్డి, యాదగిరి, జనార్ధన్, పరుశురాం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి, విద్యా రంగాలపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** గద్వాల జిల్లాలో సమగ్ర ఓటరు జాబితా సవరణ, విద్యావ్యవస్థ బలోపేతం, వైద్య పోస్టుల భర్తీ, వ్యవసాయ అభివృద్ధి పై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం పలు సమీక్షలు, తనిఖీలు నిర్వహించారు. కీలక నిర్ణయాలు, ఆదేశాలుః ఓటరు జాబితా సవరణ ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సెప్టెంబర్ 16వ తేదీలోగా సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు సహకరించాలన్నారు. వైద్య కళాశాలల్లో పోస్టుల భర్తీః గద్వాల ప్రభుత్వ వైద్య కళాశాలలో 38, అసిస్టెంట్ ప్రొఫెసర్, 1 ట్యూటర్ పోస్టుల భర్తీకి ఆగస్టు 25న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా వెబ్‌సైట్ ను చూడవచ్చు. వ్యవసాయం, ఆయిల్ పామ్ః మల్దకల్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్, నేల సారవంతం కోసం రైతులు నానో యూరియా వాడేలా ప్రోత్సాహించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందవచ్చని, అమరవాయి, పెద్దొడ్డి గ్రామాల్లో పామ్ మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేనిదే సెలవు తీసుకోకూడదని, ఎంఈఓలు నిరంతరం పాఠశాలలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు సెప్టెంబర్ 5 లోగా యూనిఫాంలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. అలంపూర్ చౌరస్తాలో విద్యార్థులకు మెమోలు, టీసీలు నిలిపివేసిన ప్రైవేట్ పాఠశాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తక్షణమే విద్యార్థులకు మెమోలు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజా సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/వంగూర్ :** హెరిటేజ్ డైరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని హెరిటేజ్ డైరీ ఏరియా మేనేజర్ హిమాం పాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మిట్ట సద గోడు గ్రామంలో హెరిటేజ్ డైరీ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిమం పాషా మాట్లాడుతూ హెరిటేజ్ సంస్థ నుంచి రైతులకు అన్ని రకాల ఇన్సూరెన్సులు బోనసులతో పాటు అన్ని డైరీల కన్నా అధిక రేటు చెల్లిస్తామని వారు పేర్కొన్నారు. అన్నదాతలు వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తులను పెంచుకోని హెరిటేజ్ డైరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎం మేనేజర్ భానుచందర్, డైరీ ఏజెంట రామకృష్ణ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలంలోని తుర్కలపల్లి గ్రామంలో ఏటీఎంఏ కార్యక్రమం కింద రైతులకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర వ్యవసాయ పద్ధతులు, వివిధ పంటల్లో సమగ్ర చీడపీడల యాజమాన్య నిర్వహణ ఐపియంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల మార్పిడి, నేల ఆరోగ్య పరిరక్షణ, మిశ్రమ పంటల సాగు, ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగు వంటి అంశాలను వివరించారు. పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు వంగూరి లత, శేఖర్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మంజుల, మండల వ్యవసాయ అధికారి ఎస్.సురేష్, ఏఈఓ కృష్ణయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

- మార్చి 2027 నాటికి గుండుమల్ జూనియర్ కళాశాల భవనం పూర్తి చేయాలి
- నిర్మాణ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు నిరంతర పర్యవేక్షణ
- నాలుగు మండలాల్లో పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.456 కోట్లు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** గుండుమల్ మండలం లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మంగళవారం గుండుమల్ మండలంలో పర్యటించిన ఆమె పలు అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుండుమాల్‌లో రూ. 5.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మొదటి అంతస్తు స్లాబ్ పనులు పూర్తి కాగా, రెండో అంతస్తు స్లాబ్ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. మార్చి 2027 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, వ చ్చే విద్యా సంవత్సరం నుంచే నూతన భవనంలో కళాశాల నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాత ఎస్‌సి బాలుర వసతి గృహం వెనుక రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఎస్‌సి వసతి గృహాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. మొదటి అంతస్తు స్లాబ్ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. నిర్మాణ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పా టించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల కార్యాలయాల సముదాయం, ఎస్‌సి వసతి గృహం ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ ప్రాంతాల్లో పనులు జరుగుతున్న సమయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. నిర్మాణ పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా అవసరమైతే పనుల ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పను ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గుండుమా ల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రూ.8.80 కోట్లతో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సముదాయం పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే మంజూరైన నిధుల్లో రూ.8 కోట్లకు పైగా ఖర్చు కాగా, పనులు పూర్తి చేసేందుకు మరో రూ.2 కోట్లు అవసరమని అధికారులు వివరించారు.కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాల్లో పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణంపై కలెక్టర్ ఆరా తీశారు. నాలుగు మండలాల్లో పీఆర్ రోడ్ల నిర్మాణాలకు రూ.456 కోట్లు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. బ్రిడ్జిలు, కల్వర్టులతో కూడిన మల్టీ కనెక్టెడ్ రోడ్ల నిర్మాణానికి అదనంగా రూ.417 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. మొత్తం 97 పనుల్లో 48 పనులకు అదనపు అనుమతు లు కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఈఈ తెలిపారు. రో డ్లు, భవనాలు , ఇతర అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.

## మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడంతో పాటు వారికి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని జిల్లా కలెక్టర్ హేమంత్ పాటిల్ అన్నారు. కొల్లాపూర్ మండలం మాచినేనిపల్లి గ్రామ శివారులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ సంబంధించి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థల స్వరూపం, రహదారి సౌకర్యం విద్యుత్, ప్రసారానికి ఉన్న అవకాశాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ వనరు సమకూరే అవకాశం ఉందని, అందుకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాన్ని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. సంప్రదాయ ఇందన వనరులకు ప్రత్యామ్నయంగా సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కు కూడా దోహదపడుతుందని, ప్రతిపాదిత సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యాసాధ్యాలను అంచనా వేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ప్రసారం తదితర అంశాలపై పూర్తి వివరాలతో ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీవో, ఐకేపీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



## ధర్నా, రాస్తారోకోలు చేసే అర్హత బిఆర్‌ఎస్‌కు లేదు




**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్లెపాగ ప్రశాంత్ మాట్లాడుతూ నిన్నటి బిఆర్‌ఎస్ పార్టీ వాళ్లు చేసిన రాస్తారోకో, ధర్నాకు అర్థం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఒక న్యాయవాది షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి కి ఎలాంటి చట్టబద్ధత లేనది కోర్టులో పిటిషన్ వేయడం జరిగింది. దానికి బిఆర్‌ఎస్ వాళ్లు రాస్తారోకోలు ధర్నాలు చేస్తున్నారు. వారు గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు వారు షాదీ ముబారక్ , కళ్యాణ లక్ష్మి కి ఎలాంటి చట్టబద్ధత చేశారో తెలపాలని ఈ సందర్భంగా తెలియజేశారు. మీ రు చేస్తున్న చెల్లర రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారని ఈ సందర్భంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగారపు బీచ్చల్లి యాదవ్, కొత్తకోట పట్టణ అధ్యక్షులు దేశీ పెంటన్న యాదవ్, మాజీ కొత్తకోట పట్టణ అధ్యక్షుడు మేస్త్రి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరుణ యాగ పాదయాత్ర

**ప్రజాపక్షం/అలంపూర్ :** తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా అలంపూర్ నియోజకవర్గంలో అలంపూరు మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్, వరుణ యాగ పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్ర శాంతినగర్ రవీంద్ర హై స్కూల్ నుండి ప్రారంభమై జులేకల్ శివాలయం ఆర్‌డిఎస్ కాలు వరకు కొనసాగుతుంది. కావున అలంపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, జిల్లా నాయకులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పాదయాత్రను విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తెలిపారు.

## పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించొద్దు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని పెబ్బేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినుల భారీ ర్యాలీ, ధర్నా చేపట్టారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర విద్యా వ్యవస్థల్లో కలిపేందుకు ప్రయత్నిస్తోందని విద్యార్థినులు మండిపడ్డారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల స్వతంత్ర ఉనికిని కాపాడాలని, పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెబ్బేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఏబీవీపీ పెబ్బేరు టౌన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణం నుంచి పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చౌరస్తా వరకు ర్యాలీగా చేరుకున్న విద్యార్థినులు, అక్కడ ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్య అనేది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందించే ముఖ్యమైన వ్యవస్థ అని విద్యార్థినులు పేర్కొన్నారు. ఇలాంటి విద్యాసంస్థలను బలహీనపరిచి ప్రైవేటు శక్తుల చేతుల్లోకి నెట్టివేస్తే పేద విద్యార్థులకు ఉన్నత సాంకేతిక, విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నా సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను కాపాడటం అంటే వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే అని అన్నారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు.

## బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్వాయి పాపన్న గౌడ్

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** శ్రీరంగపూర్ మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గూడ్ 376 వ జయంతి వేడుకలు మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ లు అర్పించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. బహుజనుల ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు.



## కొడుకు హత్య కేసులో తండ్రి అరెస్ట్

ప్రజాపక్షం/చందంపేట : నల్గొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్ నాయక్ తండాలో ఆదివారం రాత్రి జరిగిన హత్య ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కుటుంబ కలహాల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు నిర్ధారించారు. కుటుంబంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో తండ్రి తన పెద్దకుమారుడు పై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయం అయిన కుమారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసును డిండి సిఐ బీసన్న, ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో విచారణ జరిపి హత్యకు కారణమైన నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

● మోటకొండూరు మండల సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం



ప్రజాపక్షం/మోటకొండూర్ : దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని మోటకొండూరు మండల సిపిఐ కార్యదర్శి గాదగాని మాణిక్యం అన్నారు. ఆయన మంగళవారం అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభ సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే మహాసభలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిస్తూ మోటకొండూరు మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గొల్లిపాముల సునీల్ కుమార్‌తో కలిసి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ భవిష్యత్తు తీర్చి దిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనది యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను మానవతత్వాన్ని నెల కొల్పడానికి ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను దేశభక్తి లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను కృషి చేస్తుందని అన్నారు. దేశ స్వాతంత్ర అనంతరం నెహ్రూ దోపిడీని అధ్యయనేందుకు 1959 మే 23న ఏఐవైఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మోటకొండూర్ మండల గౌరవ అధ్యక్షులు ఆలేటి బాలరాజు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు బీరకాయల మల్లేష్, ఎఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు బుగ్గ శ్రీకాంత్, నాయకులు బోలగాని అశోక్, రేగు పాండు, ఎండి అజ్మమున్సార్, జలీలకపల్లి ప్రవీణ్, ఎత్తరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


## మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 'నశాముక్త్ భారత్ అభియాన్' మరియు 'మిషన్ స్పందన్' కార్యక్రమంలో భాగంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. స్టూడెంట్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్‌లోని 'విజ్ఞాన్ కలాక్షేత్రం' వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని, మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులతో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి డాక్టర్ శ్రీలత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను వ్యసనాలకు దూరంగా ఉంచడంలో క్రీడలు, శారీరక వ్యాయామం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి బలమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. యువత తమ దృష్టిని విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై సారిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి 'వికసిత్ భారత్ 2047' స్వప్నాన్ని సాకారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, విజ్ఞాన్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అవినీతి నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తా...

● గుడిలో ప్రమాణానికి రావాలని కుసుకుంట్లకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సవాల్



ప్రజాపక్షం/చండూరు : నేను ఒక్క రూపాయి కూడా అవినీతి చేయలేదు.నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తా... నువ్వు రాజకీయాల నుండి తప్పుకుంటావా అని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి సవాల్ విసిరారు. మంగళవారం చండూరు మున్సిపల్ అతిథి గృహంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. సోమవారం ధర్నాలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సరిగా వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చండూరులో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బస్ డిపో సమస్యను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన తల్లి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా నిర్మిస్తుంటే, దానిపై అనవసర విమర్శలు చేస్తున్నారని అన్నారు. పండ్ల బండి వ్యాపారుల వద్ద 12 లక్షలు తీసుకున్నామని, వైన్స్, హాస్పిటల్స్, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద లక్షలు తీసుకున్నామని ఆరోపించడాన్ని ఖండించారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఆంజనేయ స్వామి గుడిలో నేను, పాలకవర్గం అందరం ఒక్క రూపాయి తీసుకోలేదని ప్రమాణం చేస్తాం. మీరు కూడా మేము డబ్బులు తీసుకున్నట్లు ప్రమాణం చేయాలి అని సవాల్ చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్, వైస్ చైర్మన్ బూతరాజు దశరథ్, కౌన్సిలర్లు సుష్మిపాక వాను, కోడి సుష్మ వెంకన్న, అజీజ్ సర్వంచ్ కోడిగిరి బాబు, కోఆప్షన్ సభ్యులు, యూత్ అధ్యక్షులు, చేనేత సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

# నెంబర్ వన్ కార్పొరేషన్‌గా నల్లగొండ



● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

● రూ.23.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/నల్లగొండ : పట్టణాన్ని అన్ని సదుపాయాలతో కూడిన సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలో 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు, 500 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్లు పనులు జరుగుతున్నాయని తెలిపారు. 83 కోట్లతో 24 గంటల తాగునీటి ప్లాంట్ పనులు నెల రోజుల్లో పూర్తవుతాయని, మరో 300 కోట్లు తాగునీటి కోసం తీసుకొచ్చినట్లు చెప్పారు. 125 కోట్లతో 12 వాటర్ ట్యాంకులు, శివారుల్లో 3 కోట్ల చొప్పున సబ్ స్టేషన్లు మంజూరు చేశామన్నారు. లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్లతో రోడ్లు, రోప్ వే, ఛాయా సోమేశ్వర ఆలయ అభివృద్ధికి 150 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. మహిళా సంఘాల కోసం 3 కోట్ల పెట్రోల్ బంక్, 2 కోట్ల సూపర్ మార్కెట్ నిర్మిస్తున్నామని, 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.ఎన్‌జి కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ఈ పున్నమోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఈ గణేష్, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, తహసీల్దార్ పరశురాం, కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి, కవిత, వేణు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను సుమోటోగా తీసుకున్న మహిళా కమిషన్

● నిందితులను అరెస్టు చేసి నివేదిక ఇవ్వాలని ఎస్‌పికి ఆదేశం



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి

ప్రజాపక్షం/నల్లగొండ: జిల్లాలోని కొండమల్లేపల్లి మండలం జేబీ కాలనీలో నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ కుల్లు రూపా రెడ్డి దారుణ హత్యకు గురైన ఘటనను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా నిందితులను ఇంకా గుర్తించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మీడియా కథనాలు, ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈ కేసుపై విచారణకు ఆదేశించింది. నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా ఎస్‌పికి ఆదేశాలు జారీ చేసింది. మహిళలపై జరిగే ఇటువంటి హింసాత్మక ఘటనలను అత్యంత ప్రాధాన్యతతో విచారించి, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిని రాష్ట్ర మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు.

## హెచ్‌పిసిఎల్ కంపెనీకి చెందిన నకిలీ ఆయిల్ టిన్నుల అమ్మకాలు

● సీజ్ చేసిన సిసిఎస్ పోలీసులు.. సూర్యాపేటకు తరలింపు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పట్టణంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ పేరుతో నకిలీ ఆయిల్ టిన్నులను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం సిసిఎస్ పోలీసులు కంపెనీ ప్రతినిధులు సంయుక్తంగా ఆటోమొబైల్ షాపులపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో ఉన్న సత్యసాయి ఆటో మొబైల్స్‌తో పాటు ఇతర ఆటో మొబైల్స్ షాపులలో తనిఖీలు చేపట్టగా అక్కడ నకిలీ హెచ్‌పిసిఎల్ హైడ్రాలిక్ ఆయిల్ టిన్ను విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయింది. నకిలీ హైడ్రాలిక్ ఆయిల్ రెండు షాపుల నుంచి 28 టిన్నులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌పిసిఎల్ కంపెని ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ అదేశాలతో సిసిఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ ఆయిల్ టిన్నులను సీజ్ చేసి టిన్నులను హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సదరు షాపు యజమానులను సిసిఎస్ పోలీసులు సూర్యాపేటకు తరలించారు.

## రూ.13.51 కోట్ల విలువైన సిఎంఆర్ ధాన్యంలో అవినీతి

● అధికారుల దాడులతో వెలుగుచూసిన కుంభకోణం

● 2022-2026 వరకు 4.736.480 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం



ప్రజాపక్షం/కోదాడ: కోదాడలోని ఓ మిల్లులో అడ్డా పెట్టుకుని కోట్ల రూపాయల సిఎంఆర్ బియ్యం ఒక గింజ కూడా ప్రభుత్వానికి అప్పజెప్పకుండా ఓ మిల్లర్ మింగిన సంఘటన, జిల్లా అధికారుల దాడులతో వెలుగుచూసిన సంఘటన. కోదాడ పట్టణ పరిధిలో బాలాజీనగర్ రోడ్డులోని విజయలక్ష్మి రైస్ కార్పోరేషన్ కెరాఫ్ శ్రీరంగనాయక మిల్లులో చోటు చేసుకుంది. 2022 నుంచి 2026 వరకు 4.736.480 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద నుండి దిగుమతి చేసుకుని ఒక బస్తా కూడా ప్రభుత్వానికి అప్పజెప్పకుండా బ్లాక్‌లో అమ్ముకుని కోట్ల రూపాయలు దండుకున్నాడు. జిల్లా అధికారుల లెక్కల ప్రకారం 2022–23 రబీ సీజన్‌లో 1.499.480మెట్రిక్ టన్నులు, 2024–26 రబీ, ఖరీఫ్ సీజన్‌లలో 3.237.236 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుకు రాగా వీటి విలువ 13.51 కోట్ల రూపాయలుగా తేల్చారు.

**జిల్లా అధికారుల దాడి.. బయటపడిన అవినీతి భాగోతం**

కోదాడ పట్టణ హుజూర్‌నగర్‌రోడ్డులోని విజయలక్ష్మి రైస్ కార్పోరేషన్ కెరాఫ్ శ్రీరంగ నాయక్ మిల్లుపై జిల్లా విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులు సోమవారం ముకుమ్మడిగా దాడులు చేశారు. ఈ దాడులలో భారీగా అవినీతి బయటపడింది. 2022–2026 వరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం 4.736.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుండి మిల్లుకు తరలించగా, సదరు ధాన్యాన్ని బియ్యం పట్టించి ప్రభుత్వానికి అప్పజెప్పాల్సింది ఉండగా తప్పుడు లెక్కలతో ప్రభుత్వానికి మోసం చేసి పక్కదారికి మళ్లించి సొమ్ము చేసుకున్నాడు.

**కొరవడిన అధికారుల పర్యవేక్షణ**

స్థానిక సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ లోపంతోనే మిల్లర్లు కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సరైన లెక్కలు చూపించకుండా కోట్ల రూపాయల విలువైన సిఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా అధికారుల సమాచారంతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి సదరు నిందితున్ని అరెస్టు చేసినట్లు సమాచారం. కోదాడ పరిసర ప్రాంతంలోని సిఎంఆర్ దాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లయితే మరిన్ని నిజాలు వెలుగుచూసే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి

● కలెక్టర్ బి.చంద్రశేఖర్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పిఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చే విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో సామర్థ్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎంశ్రీ పాఠశాలలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను అన్ని అంశాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు వారిలోని సృజనాత్మకతను బయటికి తీసేందుకు కృషి చేయాలని పిఎంశ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్లను ఆదేశించారు. చదువుతోపాటు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందేలా చూడాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ అంశాల్లో ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా విశ్లేషించి వారి అభివృద్ధికి, మెరుగైన విద్యను అందించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రత్యేకించి తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి చదువుతో పాటు ఇతర అంశాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. నామమాత్రపు క్షేత్రస్థాయి సందర్శన కాకుండా, ప్రతిరోజు మనతో ముడిపడి ఉండే అంశాలైన వ్యవసాయం, ఉద్యానం, విద్యుత్ ఉత్పత్తి, సేవా రంగాలు, బ్యాంకులు, ఇతర సంస్థల పనితీరు, పరిపాలన తదితర అంశాలను వారు స్వయంగా చూసి నేర్చుకునే విధంగా ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు.ఈ సమావేశానికి స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,డీఈఓ సుసింధర్ రావు, ఎంఈఓలు,పిఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.



## పెళ్ళి కోసం ఆర్థిక సహాయం

● రూ.లక్ష ఇచ్చి చేయూతనిచ్చిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పేద కుటుంబానికి చెందిన తండ్రి మరణంతో కష్టపడి కన్న కూతురును పెంచిన తల్లి ఆ కూతురుకు వివాహం చేయడానికి నిర్ణయించి నేడు వివాహం చేయనున్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తన వంతు సాయం అందించడానికి ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బర్కం యాదయ్య గత కొన్నేండ్ల క్రితం మరణించారు. అతని కుమార్తె పెళ్ళి నేడు జరగనుంది. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో ఎమ్మెల్యే దాతృత్వంతో రూ.లక్షను అతని కుటుంబానికి అందజేశారు.అదేవిధంగా యాదయ్య స్నేహితులు రూ.80వేల నగదును అతని భార్యకు అందజేశారు.

# ప్రజాభద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



● కమ్యూనిటీ సిసి కెమెరాలను ధ్వంసం చేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కౌన్సిలర్ సహా అనుచరులు అరెస్ట్

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : ప్రజాభద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమ్యూనిటి సిసి కెమెరాలను ధ్వంసం చేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు. సోమవారం రాత్రి చివ్వెంల మండల పరిధి బీబీగూడెం గ్రామం (సూర్యాపేట మున్సిపాలిటి 3వ వార్డు)లో ప్రజాభద్రత కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటి సిసి కెమెరాలను ధ్వంసం చేస్తున్నారని డయల్ 112 ద్వారా వచ్చిన సమాచారంపై చివ్వెంల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటనపై విచారణ జరిపినట్లు తెలిపారు. ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులు స్థానిక కౌన్సిలర్ పడిదల సైదులు, అతని సహచరులుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమయంలో కౌన్సిలర్ అతని వెంట ఉన్న వ్యక్తులు పోలీసు విధులకు ఆటంకం కలిగించారని చివ్వెంల పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. సంఘటనకు పాల్పడ్డ 3వ వార్డు కౌన్సిలర్ పడిదల సైదులు అతని సహచరులు పడిదల దుర్గాప్రసాద్, పడిదల కిరణ్, మత్స రాంబాబు, గోల్కొండ మురళి, పడిదల సతీష్ మొత్తం ఆరుగురు నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ప్రజాభద్రత కోసం ఏర్పాటు చేసిన రక్షణపరమైన వ్యవస్థను, సామాగ్రిని ధ్వంసం చేసినా, నష్టం కలిగించిన అలాంటి వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాభద్రతలో విధులు నిర్వర్తిస్తూ రక్షణగా ఉంటున్న పోలీసు వారిపట్ల అనుచితంగా ప్రవర్తించినా, పోలీసు విధులకు ఆటంకం కలిగించినా జైలుకు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో చివ్వెంల ఎస్ఐలు మహేష్, వెంకన్న, సిబ్బంది ఉన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ



ప్రజాపక్షం/అనంతగిరి: మండలంలోని వాయిల సింగవరం మత్స్య సహకార సంఘంలో రూ.26లక్షల నిధులు సంఘం అధ్యక్షులు కంటు నాగార్జున దుర్వినియోగం చేశారంటూ సంఘ సభ్యులు కంటు కృష్ణ, రేవూరి శ్రీను మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనితో మంగళవారం గ్రామంలో డిప్యూటీ డైరెక్టర్ సుజాత, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటు నాగార్జున ఈ విచారణకు గైర్హాజరయ్యాడు . కాగా సంఘం సభ్యులు మొత్తం 127 మంది ఉండగా 55 మంది హాజరయ్యారు. పాలకవర్గంలో 9 మంది సభ్యులు ఉండగా 6 సభ్యులు హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు సంఘంలో నిధుల దుర్వినియోగంపై సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆర్డర్ ప్రకారం వేసిన ఫోర్ మెన్ కమిటీ ఓపెన్ టెండర్ అమ్మకం ద్వారా చేపట్టిన చేపలకు రూ.26 లక్షల ఆదాయం సమకూరగా దీనిని సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి సూర్యాపేట ఐసిఐసిఐ బ్యాంకు నందు జమ చేసినట్లు తెలిపారు. అట్టి డబ్బులు అధ్యక్షులు కంటు నాగార్జున సంఘ కార్యకలాపాలకు తన జేబులో నుండి డబ్బులు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపగా అందుకు సభ్యులు నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించి ఆర్డర్‌తో 2.5.2016న రూ.9 లక్షలు డ్రా చేయగా రూ.16 లక్షల సూర్యాపేట మత్స్యశాఖ బ్యాంకు ఖాతాలో నిల్వ ఉందని వివరించారు. 11.10.2021న నూతనంగా కార్యవర్గం ఎన్నికయింది మొదటి సర్వ సభ్యుల సమావేశంలో సంఘ ఆర్థిక లావాదేవీలు మునగాల నాగార్జున గ్రామీణ బ్యాంక్ మార్చి నిల్వ ఉన్న రూ.16 లక్షలు అందులో జమ చేయడం జరిగినట్లు తెలిపారు. సభ్యుల ప్రమేయం లేకుండా దొంగ తీర్మానాలతో ఆ మొత్తాన్ని డ్రా చేసినట్లు అధికారులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఫిషరీస్ ఫీల్ ఆఫీసర్ జి ఉపేందర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక పాపన్న

● శాసనసభ్యులు లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/మిర్యాలగూడ: సామాజిక సమానత్వం, బహుజన రాజ్యాధికారం కోసం నిరంతరం శ్రమించిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కొనియాడారు. మంగళవారం తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భవనంలో జయంతిని వైభవంగా నిర్వహించగా ఈ వేడుకలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి అమరేందర్, గౌడ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షులు గుండు శ్రీరాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి జేరిపోతుల రాములు గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు పెద్ది శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాగాని వెంకన్న గౌడ్, నాయకులు అంబటి రాములు గౌడ్, బొడు పాండుగౌడ్, గాదగాని మాధవ్ గౌడ్, బంటు వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుండు నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ధార్ సర్వాయి పాపన్న జయంతి



ప్రజాపక్షం/చౌటుప్పల్ : బహుజన పోరాటయోధుడు సర్ధార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తంగడిపల్లి రోడ్డు చౌరస్తాలో ఉన్న పాపన్న విగ్రహనికి పూలమాలలు వేసి నివాలర్పించారు. మునిసిపల్ చైర్మన్ మొగుదాల పావనిరమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పబ్బు రాజుగౌడ్, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్, బత్తుల వాణీవిప్లవ్ కుమార్, నాయకులు బొబ్బిళ్ళ మురళి, బొడిగే బాలకృష్ణ, సందగల్ల సతీష్, ఉష్కాగుల నాగరాజు,వర్కాల రవి, దాసు, వెంకటేష్ పాల్గొన్నారు.

## నేర పరిశోధనలో ఫోరెన్సిక్ కీలకం

● ఎస్‌పి కె.నరసింహ

ప్రజాపక్షం/సూర్యాపేట : నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారం అత్యంత కీలకమని జిల్లా ఎస్‌పి కె.నరసింహ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు మరో అత్యాధునిక సాంకేతిక వాహనం అందుబాటులోకి వచ్చింది. మంగళవారం మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మొబైల్ ఫోరెన్సిక్ ఆధారాలను వేగంగా సేకరించవచ్చన్నారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చన్నారు. వారు చట్టం నుండి తప్పించుకోకుండా కఠిన శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, రాజశేఖర్, సాయిరాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య




ప్రజాపక్షం/రంగారెడ్డి: కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా, ఉద్యోగ, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర మంగళవారం రాజేంద్రనగర్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన రాజేంద్రనగర్ చౌరస్తా అంబేద్కర్ కూడలిలో జరిగిన సభలో జంగయ్య మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదనిన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షన్ల పెంపు, రైతుల సమస్యల పరిష్కారం, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళలకు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూసేకరణ, భూముల సమస్యలపై రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు జంగయ్య అభినందనలు తెలిపారు. సిపిఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ఐదు రోజుల బస్సు యాత్రలో భాగంగా ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జంగయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శివార్ల ప్రాంతాల నుంచి ప్రారంభమైన ఈ యాత్ర జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల మీదుగా కొనసాగుతుందని తెలిపారు. ఆగస్టు 21న అబ్దుల్లాపూర్‌మెట్ భూపోరాట కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, నాయకులు పానుగంటి పర్వతాలు, బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, ఎం.ఎ.రియాజ్, శ్రీదేవి, దత్తు నాయక్, విద్యార్థి నాయకులు గార క్రాంతి, ఎస్.వంశీవర్ధన్‌రెడ్డి, సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్ గౌడ్, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కన్యగారి లక్ష్మి, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె.విజయనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి




రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/కొందుర్గు: కాంగ్రెస్ శ్రేణుల భాగస్వామ్యం..సమన్వయంతో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో టిపిసిసి అధికార ప్రతినిధి జహీద్ అక్తర్, నాయకులు కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జితేందర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్ గౌడ్, అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, మల్లేష్ గౌడ్, మంగులాల్‌నాయక్, జాకారం శేఖర్, సత్యం రెడ్డి, బ్యాటరీ కృష్ణారెడ్డి, రాములు గౌడ్, సర్పంచులు అంజి, విక్రమ్‌రెడ్డి, రాజకుమార్, రమేష్, గోపాల్‌నాయక్, శ్రీకాంత్, యాదయ్య, నర్సింలు, జీబి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నగౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



ప్రజాపక్షం/రంగారెడ్డి: సామాజిక సమానత్వం, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి కేషరామ్, తెలంగాణ రాష్ట్ర బిసి ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, టిపిసి కార్యదర్శి కె.శివకుమార్, కాంగ్రెస్ నాయకులు మంగమ్మ, రంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి రవి గౌడ్, కసర మౌని కృష్ణ యాదవ్, శ్యామ శంకర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ సుధాకర్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోగుల పట్ల మర్యాద



ప్రజాపక్షం/రంగారెడ్డి: రాజేంద్ర నగర్ మండలం మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వైద్య కేంద్రంలోని వైద్య సేవలు, రోగుల నమోదు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, శుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అవసరమైన మందుల నిల్వ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ జిల్లాలోని అన్నిప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

# 22ఎ జాబితాలో నమోదైన పట్టా భూములు పరిశీలిస్తాం

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: 22ఎ జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22ఎ జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22ఎ జాబితాకు సంబంధించిన అంశాలు, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, భూ రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, అందుబాటులో ఉన్న పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహద్దులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# వ్యాధి పట్ల అవగాహన

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి



ప్రజాపక్షం/రంగారెడ్డి : హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి అన్నారు. మంగళవారం హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటెన్స్‌ఫైడ్ఐఇహెచ్ కాంపెయిన్ లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని స్వర్ణ కుమారి, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ పాప రావు, డిటిఒ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటెజీ ఫర్ హెచ్ఐవి,ఎయిడ్స్(దిశ) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీలో టిజిఎస్ఎసిఎస్ ఐసిటిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సెంటర్స్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఆరోగ్య శాఖ సిబ్బంది, యువత, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, నాకో ప్రతినిధులు తదితరులు ర్యాలీలో పాల్గొని హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక పాపన్నగౌడ్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





ప్రజాపక్షం/షాద్‌నగర్: బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక సర్థార్ సర్వాయి పాపన్నగౌడ్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో సర్థార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని గౌడ యువజన సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, నాయకులు శివశంకర్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, కట్టా వెంకటేష్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్, శ్రీశైలం గౌడ్, కుమార స్వామి గౌడ్, సుదర్శన్ గౌడ్, వన్నాడ ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** బహుజన రాజ్య స్థాపకుడు సర్థార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లో గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, జూపల్లి శంకర్, శివాచారి, గణేష్ పాల్గొన్నారు.

**కిషన్‌నగర్‌లో..** ఫరూక్‌నగర్ మండల పరిధిలోని కిషన్ నగర్ గ్రామంలో పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కట్టా వెంకటేష్ గౌడ్, బాల్‌రాజ్, గౌడ సంఘం అధ్యక్షుడు లోకిరేవి ఆంజనేయులు గౌడ్, ఉప సర్పంచ్ నల్ల చెన్నయ్య గౌడ్, కారోబార్ బోనగిరి కృష్ణయ్య, లక్ష్మయ్య, మల్లేష్, నర్సింలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చాకలి శ్రీశైలం పాల్గొన్నారు.

**కొందుర్గు:** పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు సుబ్బయ్య గౌడ్, శివశంకర్ గౌడ్, లక్ష్మీ నారాయణ గౌడ్, రఘువేందర్ గౌడ్ పాల్గొన్నారు.

**కేశంపేట:** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, రమేష్‌గౌడ్, పాండుగౌడ్, తిరుపతిగౌడ్, శివగౌడ్ మహేష్‌గౌడ్, రవిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శివాజీ, మురళీమోహన్, యుగంధర్ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి పోరాడిన మహనీయుడని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కొనియాడారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పెద్ద చెర్వు కట్టపై పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో ఇసి.శేఖర్‌గౌడ్, పి,రాములుగౌడ్, మహేష్ గౌడ్, యాదగిరిగౌడ్, మాణిక్యంగౌడ్, డి.జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** ప్రజల గుండెల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లేలుగూడ డివిజన్‌లోని చందన చెరువు కట్టపై నిర్వహించిన జయంతి వేడుకలలో చల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సిద్దాల దశరథ, చల్లా బాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, గంగమ్మ, పద్మ, ఎరుకల వెంకటేష్‌గౌడ్, కుంటల బిక్షపతి గౌడ్, సుర్వి మల్లేష్ గౌడ్, బొబ్బిలి కిరణ్‌గౌడ్, ఎరుకల మురులేష్ గౌడ్, కుంటల శేఖర్‌గౌడ్, కుంటల అనిల్‌గౌడ్, కుంటల కుంటాల బాలకృష్ణగౌడ్ సుర్వి శేఖర్‌గౌడ్, చేగురి ప్రసాద్‌గౌడ్, ఎరుకల మల్లేష్‌గౌడ్, ఎరుకల రవితేజ గౌడ్, కుంటల రాహుల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్ :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఎల్‌బినగర్ కూడలి వద్ద ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల విఠల్ రెడ్డి, లింగాల రాహుల్‌గౌడ్, అంబాల మల్లేష్ గౌడ్, పల్లె గణేష్ గౌడ్, జహంగీర్, బాబుగౌడ్ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హయతనగర్:** సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని హయత్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రగతి నగర్ నూతన గౌడ సంఘం బిల్డింగ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో నక్క దర్శన్‌గౌడ్, నక్క సునీల్ గౌడ్, నక్క ప్రభాకర్‌గౌడ్, చెన్నగొని రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రమేష్‌గౌడ్, చంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.









# జిఓ 97ను వెనక్కి తీసుకోవాలి

ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న జిఓ ఎంఎస్ నెం.97 నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను పిపిపి విధానంలో నడిచే యూనివర్సిటీ పరిధిలోకి తీసుకెళ్తే పేద, మధ్యతరగతి,గ్రామీణ విద్యార్థులపై భవిష్యత్‌లో అధిక ఫీజుల భారం పడే ప్రమాదం ఉందన్నారు.

# సర్ ప్రక్రియపై బిఎల్‌ఒలకు అవగాహన



ప్రజాపక్షం/కొందుర్గు: సర్ ప్రక్రియపై బిఎల్‌ఒకు అవగాహన నిర్వహించినట్లు తహసీల్దార్ అజం అలీ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేధికలో తహసీల్దార్ అజం ఆలీ ఆధ్వర్యంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నివేదితతోపాటు జీపివోలు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

# రహదారి నిబంధనలు పాటించండి

ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేయాలని ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఫ్యూచర్ సిటి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేష్, ఎఎస్ఐ ఆర్.రవీందర్ పాల్గొన్నారు

# ఉద్యమకారుల జాబితా ఏర్పాటు చేస్తాం



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఉద్యమకారుల సమగ్ర జాబితాను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి వివరించారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ ఉద్యమకారుల కార్యాలయంలో మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పి.లక్ష్మి నరసింహారెడ్డి, గాదె సుధాకర్, మేకల వెంకటేష్, రవిగౌడ్, అల్లాడ శేఖర్, గుండు అశోక్, పులిజాల నవీన్, వంశీకృష్ణ, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/యాచారం : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంథని గౌరెల్లి, కస్లితండా, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో టిజి ఐఐసి.హెచ్ఎండిఎ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థానలు ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధారాణి, తహసీల్దారు అయ్యప్ప, సర్పంచ్‌లు అరవిందనాయక్, రమేష్, మాజీ ఎంపిటిసి లక్ష్మి పతి గౌడ్, దెందిరాంరెడ్డి, రాజు, మస్కు అనిత శరణం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటె శ్రీశైలం, రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి శేఖర్‌రెడ్డి, పడకంటి శేఖర్‌గౌడ్, తిరుమలేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మస్కు నర్సింహ్మ, అక్బర్ పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు చేయూత



ప్రజాపక్షం/యాచారం : విద్యార్థులు కష్టపడి చదువుకోని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ లహరి నవిన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గున్‌గల్, గడ్డమల్లాయగూడ, చిన్నతూండ్ల, ధర్మన్న గూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి పనిచేస్తున్నాం



ప్రజాపక్షం/కొత్తూరు: రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని, ఇందుకు అధికారులు సహకరించాలని మేకగూడ సింగిల్ విండో చైర్మెన్ అంబటి ప్రభాకర్ కోరారు. మంగళవారం నందిగామ మండలం మేకగూడ సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ సహకార సంఘాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంతోపాటు దీర్ఘకాలిక రుణ బకాయిల వసూళ్లు చేయడంతోపాటు కొత్త రుణాలు మంజూరు అనే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సొసైటీని అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం సభ్యులు సహకరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ విఘ్నేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎం.శ్రీను, ఎం.ప్రవీణ్ రెడ్డి, పాముల శ్రీనివాస్, కేశమోని రమేష్, సభావత్ శంకర్, మల్లిఖార్జున్ రెడ్డి, చాకలి యాదయ్య, ఎమ్మె శ్రీశైలం, ఎల్లారం రవీందర్‌రెడ్డి, ఫరీదా భేగం, మామిళ్ళపల్లి మాణెమ్మతోపాటు అధికారులు పాల్గొన్నారు.

### మూడేళ్ళలో జెపిసి పరిశీలనకు

## ఏకంగా తొమ్మిది బిల్లులు

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు ఉభయసభల సంయుక్త కమిటీల (జెపిసి) పరిశీలన నిమిత్తం వెళ్ళిన బిల్లుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 2024లో మోదీ హయాంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 18వ లోక్‌సభలో ఇప్పటివకూ తొమ్మిది బిల్లులు జెపిసి పరిశీలనకు వెళ్ళాయి. మోదీ రెండు పర్యాయాలు ప్రధానిగా ఉండగా పార్లమెంటు జెపిసిల పరిశీలకు వెళ్ళిన బిల్లుల సంఖ్య నాలుగు వంతున మొత్తం బిల్లులు ఎనిమిది కాగా, మూడోప ర్యాయం మూడు సంవత్సరాల వ్యవధి లోనే తొమ్మిది బిల్లులు జెపిసి పరిశీలనకు వెళ్ళాయి. మొత్తం 17 బిల్లులకుగాను 14 బిల్లులు జెపిసి పరిశీలనకు వెళ్ళాయి. ఎందుకంటే కొన్ని బిల్లులను ఒకే కమిటీ కలిపి పరిశీలిస్తుంది. వీటిలో కొన్ని బిల్లు లను ఆమోదిస్తారు. కొన్ని బిల్లులు రద్దయి పోతాయి. 2014 నుండి ఐదేళ్ళకాలంలో అంటే 16వ లోక్‌సభ సమయంలో నాలుగు బిల్లులు,17వ లోక్‌సభ సమ యంలో నాలుగు బిల్లులు మాత్రమే జెపిసి పరిశీలనకు వెళ్ళాయి.

గడచిన మూడు సంవత్సరాలుగా 18వ లోక్‌సభలో ముఖ్యంగా వక్ఫ్ (సవరణ) బిల్లు, ఒకేదేశం, ఒకే ఎన్నిక బిల్లు, నిర్బం ధాలకు గురైన మంత్రులను పదవుల నుండి తొలగించేందుకు సంబంధించిన మూడు బిల్లులు,వికసిత్ భారత్ శిక్ష అధి ష్టాన్ బిల్లు,కార్పొరేట్ చట్టాల (సవరణ)బి ల్లులు ఇప్పటివరకూ జెపిసి పరిశీలనకు వెళ్ళగా, తాజాగా ఇప్పుడు విదేశీ విరా ళాల (నియంతరణ)బిల్లు జెపిసి పరిశీల నకు వెళ్ళింది. వివిధ బిల్లులను పరిశీలిం చడానికి లోక్‌సభ లేదా రాజ్యసభ ఈ ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేస్తాయి. ఆ ప్రయోజనం నెరవేరగానే సంబంధిత కమిటీ రద్దైపోతుంది.

# అందరి విజయం

- జార్ఖండ్ ప్రభుత్వం నిర్ణయంపై పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్య
- 16 రోజుల నిరాహారదీక్ష విరమించిన దేవేంద్రనాథ్ మహతో సహా మరో ఇద్దరు కొనసాగిస్తున్న మరో ముగ్గురు

**రాంచి :** జార్ఖండ్‌లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 2014 నుంచి నిర్వహించిన అన్ని రకాల నియామక పరీక్షలు రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం అందరి విజయం అని అభివర్ణిస్తూ, కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ వీడియో కాల్ ద్వారా మహోతోను అభినందించారు. 'ఈ విజయంలో ఎవరూ ఓడిపోరని అనిపిస్తోంది. మీరు గెలిచారు, ప్రభుత్వం కూడా గెలిచింది, ఎందుకంటే వారు కూడా మంచి చేయాలని భావిస్తున్నారు. కాబట్టి, ఇది అవతలి పక్షం ఓటమిని చవిచూడాల్సిన అవసరం లేని విజయం. ఇది అందరి విజయం భారతదేశానికి, ప్రజలకు, జార్ఖండ్‌కు లభించిన విజయం' అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సోరెన్ నిర్ణయంతో జార్ఖండ్‌లో ఉద్యోగ పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ నిరాహార దీక్ష చేస్తున్న ఆరుగురు నిరసనకారులలో, జెఎల్‌కెఎం నాయకుడు దేవేంద్ర మహతోతో సహా ముగ్గురు తమ దీక్షను విరమించారు. 16 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న మహతో, సోమవారం అర్ధరాత్రి సమయంలో తన దీక్షను విరమించారు. జులై 25 నుంచి జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న జెపిఎస్‌సి–జెఎస్‌ఎస్‌సి సంస్కరణల మంచ్ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ, ప్రేమ్ నాయక్, ఉమ్మే హబీబా అనే ఇద్దరు నిరసనకారులు కూడా తమ నిరాహార దీక్షను విరమించగా, రాహుల్ క్రాంతి, సబితా కుమారి, రూపేష్ పాల్ అనే మరో ముగ్గురు తమ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఔట్‌సోర్స్ ఏజెన్సీ టిఎస్‌ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ (టిడిపిఎల్) నిర్వహించే జెఎస్‌ఎస్‌సి–సిజిఎల్ పరీక్షతో సహా అన్ని నియామక పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో, మంగళవారం నాటికి 25వ రోజుకు చేరిన ఈ నిరసనలను ఉపసంహరించుకోవాలా వద్దా అనే దానిపై నిరసనకారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీక్ష విరమించిన తరువాత దేవేంద్రనాథ్ మహతో మాట్లాడుతూ జెపిఎస్‌సి–జెఎస్‌ఎస్‌సిలలో అవినీతి రహిత నియామకాల కోసం త్వరలో తన నిరసన రెండవ దశను ప్రారంభిస్తానని మంగళవారం ప్రకటించారు. భవిష్యత్తులో నియామక పరీక్షలలో పేపర్ లీక్ లేదా అవకతవకలు జరగవని ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు ఈ నిరసన కొనసాగుతుందని ఆయన అన్నారు. 'నేను నా నిరాహార దీక్షను విరమించాను, కానీ నిరసనను కాదు. నియామక పరీక్షలలో పేపర్ లీక్ లేదా అవకతవకలు జరగవని ప్రభుత్వం హామీ ఇచ్చే వరకు ఈ ఆందోళన కొనసాగుతుంది. జెపిఎస్‌సి–జెఎస్‌ఎస్‌సి పరీక్షలలో అవినీతి రహిత



నియామకాలు జరపాలని డిమాండ్ చేస్తూ, మేము త్వరలో మా నిరసన రెండవ దశను ప్రారంభిస్తాము' అని మహతో మీడియాతో అన్నారు. 'సంస్కరణల కోసం ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. కేవలం ఆర్థిక ఆడిట్ మాత్రమే కాకుండా, పూర్తిస్థాయి ఆడిట్‌ను కూడా కోరాము; ప్రతి దశలోనూ ఆడిట్ జరగాలి'అని మహతో అన్నారు. నియామక పరీక్షలలో పేపర్ లీక్‌లు, అవకతవకల వంటి పద్ధతులను నిరోధించడానికి అవసరమైతే చట్టం చేయాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, 'నిరసన చేస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (జెఎస్‌ఎస్‌సి–సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఔట్‌సోర్స్ ఏజెన్సీ టిఎస్‌ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టిడిపిఎల్) నిర్వహించిన అన్ని పరీక్షలను, అది ప్రచురించిన ఫలితాలను కూడా రద్దు చేయాలని మేము నిర్ణయించామని సిఎం సోరెన్ విలేకరులతో అన్నారు. ఈ ప్రకటన తర్వాత విద్యార్థులు సంబరాలు చేసుకుంటూ, త్రివర్ణ పతాకాన్ని ఊపుతూ కనిపించారు. అయితే, పరీక్షలలో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలన్న తమ కీలక డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదని ఆందోళనకారులు స్పష్టం చేయడంతో, సోమవారం రాత్రి ఈ నిర్ణయంతో నిరసన ముగియలేదు. సదర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరసనకారులలో ఒకరైన రాహుల్ క్రాంతి, సిబిఐ విచారణ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించే వరకు ఆందోళన కొనసాగుతుందని అన్నారు. 'ఉద్యమం మొదటి దశలో పోరాటం ద్వారా విజయం సాధించినందుకు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్ మంగళవారం విద్యార్థులను అభినందించారు.

# 2 వేలమందిలో గుబులు

- జార్ఖండ్ ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగం కోల్పోతామని తీవ్ర ఆందోళన
- తమను తాము సమర్థించుకోవడానికి సరైన అవకాశం ఇవ్వాలని డిమాండ్



**రాంచి :** జార్ఖండ్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. జెఎస్‌ఎస్‌సి– సిజిఎల్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించడంతో ఉద్యోగార్థులు, విద్యార్థులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. మరో వైపు పరీక్షలో ఉత్తీర్ణులై తాము సంపాదించుకున్న ఉద్యోగాలను కోల్పోతామనే భయంతో ఉన్న కనీసం 2,000 మంది భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. 'మా నేరం ఏమిటో చెప్పండి. మమ్మల్ని బయటకు గెంటెయ్యకండి' అని తమను తాము సమర్థించుకోవడానికి సరైన అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జార్ఖండ్ సచివాలయం వెలుపల ఉత్తీర్ణులైన అభ్యర్థులు పెద్ద ఎత్తున నినదించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న ఈ అభ్యర్థులు, పరీక్షలో అవకతవకలపై విచారణకు తాము వ్యతిరేకం కాదని, అయితే తమను తాము సమర్థించుకోవడానికి ఒక నిష్పక్షపాతమైన అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటే...నిరసన చేస్తున్న అభ్యర్థులు, జెఎస్‌ఎస్‌సి–సిజిఎల్ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇద్దరూ ఇప్పుడు సిబిఐ విచారణను కోరుతున్నారు. ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్, ఉత్తీర్ణులైన అభ్యర్థులు న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చనిన్నారు. జెఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే వారి ఆవేదనను అంగీకరిస్తూ, పార్టీ వారికి సానుభూతితో ఉందని చెప్పారు. అయితే, కొత్త ఖాళీలు అర్హులైన అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తామన్న హామీ, వయోపరిమితి దాటిన వారిలో నెలకొన్న అనిశ్చితిని తగ్గించలేకపోయింది. కొందరు నిరాహార దీక్ష, తదుపరి న్యాయపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించారు. జార్ఖండ్ సచివాలయం వెలుపల అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కౌశల్ కుమార్ తీవ్ర విజ్ఞప్తి చేస్తూ, 'కోర్టు ఉత్తర్వుల తర్వాతే మమ్మల్ని నియమించారు. మేము అన్ని పత్రాలతో వచ్చాము. పరీక్షను రద్దు చేయవద్దు. విచారణ జరపండి. సిబిఐ విచారణ గానీ లేదా మీకు సముచితమనిపించిన ఏ విచారణ అయినా చేయండి, కానీ దయచేసి మాకు అన్యాయం చేయవద్దు' అని అన్నారు. ఉద్యోగం చేస్తున్న మరో వ్యక్తి చందా కుమారి మాట్లాడుతూ అభ్యర్థులకు తమను తాము సమర్థించుకోవడానికి సరైన అవకాశం ఇచ్చారా అని ప్రశ్నించారు. నిర్ణయం తీసుకునే ముందు, విజయం సాధించిన అభ్యర్థులకు తమ వాదనను వినిపించడానికి తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపిస్తూ, 'ప్రజాస్వామ్యం అంటే వంద మంది దోషులను వదిలిపెట్టవచ్చు, కానీ ఏ ఒక్క అమాయకుడినీ శిక్షించకూడదు' అని ఆమె అన్నారు. తాను పేద కుటుంబానినని, కష్టపడి 14వ జెపిఎస్‌సి పరీక్షలోనూ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించానని కుమారి చెప్పారు. నియామకాలు పొందిన వారందరూ ఈ అవకతవకల వల్ల సామూహికంగా లబ్ధి పొందారన్న ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. తాము ఉద్యోగాలన్నింటినీ కొనలేము అని ఆమె అన్నారు. తమపై ఎలాంటి తప్పు రుజువు కాకముందే తమను శిక్షిస్తున్నారని కుమారి ఆరోపించారు. నియామక ప్రక్రియపై విచారణ, కోర్టు పరిశీలన జరిగిందని, ఇప్పటికే ఉన్న సిట్ దర్యాప్తు సరిపోతుందని పేర్కొంటూ, సిబిఐ విచారణ జరపాలన్న డిమాండ్‌ను హైకోర్టు తన డిసెంబర్ తీర్పులో తిరస్కరించిందని వారు అంటున్నారు. ఇదిలా ఉండగా, జెఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే మాట్లాడుతూ, తమ పార్టీ నిరంకుశ ప్రభుత్వాన్ని నడపడం లేదని, విజయం సాధించిన అభ్యర్థులు బాధపడటంలో తప్పులేదని అంగీకరించారు.

# మోదీ యూటర్న్ ఉస్తాద్

- కులగణనను అడ్డుకోవాలని బిజెపి ప్రభుత్వం భావిస్తోంది
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శ



**న్యూఢిల్లీ :** కుల గణనను అడ్డుకోవాలని నరేంద్రమోదీ ప్రభుత్వం భావిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. సెప్టెంబర్ 2021లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కులాలను ఎంచుకోవడానికి 'డ్రాప్‌డౌన్ మెనూ' ఉండాలని కేంద్రం స్వయంగా సిఫార్సు చేసినప్పటికీ, 2027 జనాభా గణనలో ఆ విధానాన్ని ఎందుకు చేర్చలేదని ప్రశ్నించింది. ఏప్రిల్ 30, 2025న కుల గణనను ప్రకటించడం ద్వారా ప్రధాని తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారని, ఇప్పుడు మళ్లీ ఆ నిర్ణయం నుంచే వెనక్కి తగ్గి మరో 'యూటర్న్' తీసుకున్నారని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. సెప్టెంబర్ 21, 2021న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో మోదీ ప్రభుత్వం కుల గణన అభ్యర్థనను స్పష్టంగా తిరస్కరించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం ఎక్స్‌లో గుర్తుచేశారు. 'అయితే, ఆ అఫిడవిట్‌లోని 12 (డి) పేరాలో ఇలా ఉంది: '2011 జనాభా గణన నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ తయారు చేయబడలేదు. కులాల ఎంపిక కోసం డ్రాప్‌డౌన్ మెనూను అందుబాటులో ఉంచి ఉంటే అది కులాల రిజిస్ట్రీకి ఎంతో ఉపయోగకరంగా ఉండేది; తద్వారా నమ్మదగిన, స్థిరమైన సమాచారం లభించేది' అని రమేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సెప్టెంబర్ 2021లో సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో మోదీ ప్రభుత్వం సిఫార్సు చేసిన ఆ డ్రాప్‌డౌన్ మెనూను 2027 జనాభా గణనలో ఎందుకు చేర్చలేదని రమేష్ ప్రశ్నించారు. బిహార్, తెలంగాణలో కుల సర్వేలు నిర్వహించడానికి ముందు అటువంటి మెనూను రూపొందించారని ఆయన గుర్తుచేశారు. మే 5, 2025న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీకి రాసిన లేఖలో కూడా ఈ సూచన ప్రస్తావించబడిందని రమేష్ తెలిపారు. 'మోదీ ప్రభుత్వం కుల గణనను కేవలం అడ్డుకోవాలని చూస్తోంది. ఏప్రిల్ 30, 2025న ప్రధాని తన వైఖరిని పూర్తిగా మార్చుకుని, అంతకు ముందు 'అర్బన్ నక్సల్' ఆలోచనగా విమర్శించిన కుల గణనను చేపడతామని ప్రకటించారు. 'ఇప్పుడు ఆయన తన మునుపటి నిర్ణయం నుంచే మళ్లీ వెనక్కి తగ్గి, ఆ విషయాన్ని బయటకు చెప్పకుండానే కుల గణన ఆలోచనను పక్కన పెట్టేశారు. ఆయన ఒక 'యూటర్న్ ఉస్తాద్' (యూటర్న్ తీసుకోవడంలో దిట్ట)' అని రమేష్ వ్యాఖ్యానించారు.

## విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు : సిజెపి

**న్యూఢిల్లీ :** విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన కేసులో విషయంలో ఢిల్లీ ప్రభుత్వం జాప్యం చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) డిమాండ్ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేయాలని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కొట్టివేయాల్సిన ఎఫ్‌ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం వెంటనే సమర్పించాలని సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు. కోర్టు ఎఫ్‌ఐఆర్‌ల వివరాలను కోరుతున్నప్పుడు ప్రభుత్వం వాటిని సమర్పించడంలో ఎందుకు వెనుకాడుతోందని దాస్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని మరింత ఆలస్యం చేసే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమేనని అన్నారు. ప్రభుత్వం ఇతర నేర కేసులపై చర్యలు తీసుకోవాలనుకుంటే అది వేరే అంశమని పేర్కొన్నారు. సుమారు 2,800 మంది తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోందని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవడాన్ని విద్యార్థుల కేసులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులోనూ చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకుండా చూడాలని సిజెపి కోరుతోంది. కేసులను కేవలం క్లోజ్ చేసినట్లు చూపడం కాకుండా, విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

### మీ పిల్లలను ఒక్కరోజైనా

# గ్రామ పాఠశాలకు పంపండి

- అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూస్తారు
- మంతులు, రాజకీయ నేతలకు సిజెపి కన్వీనర్ దీప్కే డిమాండ్



**హింగోలి :** మంత్రులు, రాజకీయ నేతలకు 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సవాల్ విసిరారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు అనేక కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి విద్యనభ్యస్తున్నారని, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకోవడానికి తమ తమ పిల్లలను ఒక్క రోజైనా గ్రామాల్లోని పాఠశాలలకు పంపాలని డిమాండ్ చేశారు. పాఠశాల సంబంధిత సమస్యలపై హింగోలిలో మంగళవారం జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో దీప్కే మాట్లాడుతూ గ్రామీణ పాఠశాల విద్యార్థులకు కనీస రవాణా సౌకర్యం కల్పించడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ర్యాలీల కోసం నాయకులు బస్సులు, రైళ్లు ఏర్పాటు చేయగలరని, కానీ పేద విద్యార్థులకు ఒక్క బస్సు కూడా అందించలేకపోయారని మండిపడ్డారు. గత వారం హింగోలి జిల్లాలోని తన స్వగ్రామం నుండి 'స్కూల్ థిక్ కరో' (పాఠశాలను బాగు చేసుకోండి) ప్రచారాన్ని ప్రారంభించిన దీప్కే, గత దశాబ్ద కాలంగా రాజకీయ చర్చలు కుల, మత ప్రాతిపదికన ప్రజలను విభజించాయని, అయితే విద్య, ఉపాధి వంటి ప్రధాన సమస్యలు మాత్రం పరిష్కారం కాకుండానే మిగిలిపోయాయని ఆరోపించారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా, నీటితో నిండిపోయినప్పుడు, మారుమూల ప్రాంతాల్లోని పిల్లలు పాఠశాలలకు చేరుకోవడానికి తరచుగా 7 నుండి 10 కిలోమీటర్లు నడవవలసి వస్తుందని సిజెపి కన్వీనర్ పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రులు తమ సొంత పిల్లలను గ్రామ పిల్లల్లా నడిచి బడికి పంపుతారా? అని దీప్కే ప్రశ్నించారు. 'మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు తమ పిల్లలను ఒక్క రోజు గ్రామ పాఠశాలలకు పంపి, గ్రామ పిల్లల్లా నడిచి బడికి వెళ్లేలా చేయాలి. అప్పుడు ఆ పిల్లలు ఎలాంటి కష్టాలను ఎదుర్కొంటున్నారో వారికి అర్థమవుతుంది' అని ఆయన అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని దీప్కే అన్నారు. గిరిజన, పేద పిల్లల కోసం తన పోరాటాన్ని కొనసాగిస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఒక గిరిజన బిడ్డ ప్రాణానికి, ఒక మంత్రి బిడ్డ ప్రాణానికి ఉన్నంత విలువ ఉండాలని, ఆ బిడ్డ ప్రాణం ఏమాత్రం తక్కువ విలువైనది కాదన్నారు. గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇటీవల జరిగిన విద్యార్థుల మరణాలను ప్రస్తావిస్తూ, అమరావతిలోని మేల్‌ఘాట్‌లో ఒక విద్యార్థి, గడ్చిరోలిలో మరికొందరు మరణించారని ఆయన పేర్కొన్నారు. చిన్నప్పుడు తన తోబుట్టువులు బడికి నడిచి వెళ్లడాన్ని తాను స్వయంగా చూశానని, అందుకే హింగోలిలో ఈ నిరసన చేపట్టాలని నిర్ణయించుకున్నానని దీప్కే తెలిపారు. '15 ఏళ్లు గడిచినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇది సిగ్గుచేటు. ఎన్నికల ర్యాలీల కోసం బస్సులు, రైళ్లను ఏర్పాటు చేయగల రాజకీయ నాయకులు, పాఠశాలకు వెళ్లే పేద పిల్లల కోసం కనీసం ఒక్క బస్సును కూడా సమకూర్చలేకపోతున్నారని అని ఆయన విమర్శించారు. తన పోరాటం గ్రామ సర్పంచులు లేదా స్థానిక ప్రజలకు వ్యతిరేకం కాదని, పాఠశాలల అభివృద్ధిలో వారు కూడా భాగస్వాములు కావాలని డిప్కే అన్నారు. గత దశాబ్ద కాలంగా సాగిన రాజకీయ చర్చలు ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజించాయని, అదే సమయంలో విద్య, ఉపాధి వంటి ప్రాథమిక సమస్యలు మాత్రం పరిష్కారం లేకుండానే ఉండిపోయాయని ఆయన ఆరోపించారు.

# ఉరిశిక్ష రద్దు పిటిషన్...'సుప్రీం' కొట్టివేత

**న్యూఢిల్లీ :** మరణశిక్ష ఖైదీలకు ఉరిశిక్ష అమలు చేసే ప్రస్తుత పద్ధతిని రద్దుచేసి, దాని స్థానంలో సిరల ద్వారా ఇచ్చే ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి తక్కువ బాధాకరమైన పద్ధతులను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. మరణశిక్ష విధించబడిన ఖైదీ గౌరవాన్ని కాపాడుతూ అనవసరమైన బాధను తగ్గించడమనే రాజ్యాంగ లక్ష్యానికి ఏదైనా ప్రత్యామ్నాయ మరణశిక్షా విధానం మెరుగ్గా ఉపయోగపడుతుందేమో పరిశీలించేందుకు, ఒక నిపుణుల సంఘం ద్వారా ప్రస్తుత మరణశిక్షా విధానంపై సమగ్ర సమీక్ష చేపట్టకుండా తమ తీర్పు కేంద్రాన్ని నిరోధించదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. మరణశిక్ష విధించే ఉరిశిక్ష విధానాన్ని ప్రస్తుత చట్టం నుంచి తొలగించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం తన తీర్పును వెలువరించింది. మరణశిక్ష ఖైదీలను ఉరితీయడం అనే పద్ధతిని రద్దుచేసి, సిరల ద్వారా ఇచ్చే ప్రాణాంతక ఇంజెక్షన్, ఈ రెండింటిలో దేనిని అమలు చేయాలో ఎంచుకునే అవకాశం కనీసం ఇవ్వాలని మల్హోత్రా ధర్మాసనాన్ని కోరారు. 2023 మార్చిలో మరణశిక్ష ఖైదీకి ఉరిశిక్ష అమలు చేయడం సమంజసంగా, తక్కువ బాధాకరంగా ఉందో లేదో పరిశీలించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. అలాగే మరణశిక్ష అమలు విధానానికి సంబంధించిన అంశాలపై కేంద్రం నుంచి మెరుగైన సమాచారం కోరింది. అయితే, మరణశిక్ష పడిన దోషులకు ఒక నిర్దిష్ట పద్ధతిలో శిక్ష విధించాలని శాసనసభను ఆదేశించే అధికారం తమకు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 2018లో మరణశిక్ష ఖైదీలకు ఉరిశిక్ష మాత్రమే విధించాలనే చట్టపరమైన నిబంధనను కేంద్రం గట్టిగా సమర్థించింది. ప్రాణాంతక ఇంజెక్షన్లు, కాల్చివేత వంటి మరణశిక్షా పద్ధతులు తక్కువ బాధాకరమైనవని ధర్మాసనానికి తెలిపింది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ ఉరిశిక్ష అనేది త్వరితమైనది, సరళమైనది అని, ఖైదీ వేదనను అనవసరంగా తీవ్రతరం చేసే ఏ అంశం కూడా అందులో ఉండదని పేర్కొంది. ప్రస్తుత అమలు విధానాన్ని తొలగించాలని వాదిస్తున్న లా కమిషన్ 187వ నివేదికను ప్రస్తావించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)కు ప్రతిస్పందనగా ఈ అఫిడవిట్ దాఖలు చేయబడింది.

# ఎంపిలో ఘోర రోడ్డు ప్రమాదం

- డాంపర్ ట్రక్కును ఢీకొన్న పికప్ వ్యాన్
- ఎనిమిది మంది కార్మికులు మృతి
- మరో 32 మందికి గాయాలు



**భింద్ /లఖింపూర్ ఖేరీ :** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భింద్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున కూలీలు ప్రయాణిస్తున్న పికప్ వాహనం డంపర్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించగా, మరో 32 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. భింద్–గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి 1 గంట ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. గ్వాలియర్‌లో వరి నాట్లు వేసే పని పూర్తి చేసుకుని, ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో ఉన్న తమ గ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ కూలీలు ప్రమాదానికి గురయ్యారు. హైవేపై కూర్చుని ఉన్న పశువులను తప్పించే ప్రయత్నంలో కూలీల వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని గోహద్ చౌరాహా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ రామ్‌నరేష్ యాదవ్ తెలిపారు. వాహనం దిశను మార్చుకుని ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును బలంగా ఢీకొట్టిందని ఆయన చెప్పారు. దీంతో వాహనం నుజ్జునుజ్జు అయిందని, శిథిలాల్లో పలువురు కూలీలు చిక్కుకుపోయారని ఆయన పేర్కొన్నారు. 'ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలు మరణించారు. వీరిలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు. మరో 32 మంది గాయపడ్డారని' ఆ అధికారి తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో వాహనంలో చిక్కుకున్న కూలీలను రక్షించారు. గాయపడిన వారందరినీ గోహద్‌లోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం గ్వాలియర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఖేరీ ఎస్‌పి ఖ్యాతి గార్గ్ ఎనిమిది మంది మరణాన్ని ధృవీకరించారు. ఈ ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారిలో ఆరుగురిని గుర్తించినట్లు ఆమె పిటిఐకి తెలిపారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు మరియు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు.

# చట్టాలను ఉల్లంఘిస్తే రక్షణ ఉండదు


### 'మెటా'కు కేంద్రం మరోసారి హెచ్చరిక




**న్యూఢిల్లీ :** ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల్లో చిన్నారులపై లైంగిక వేధింపుల మెటీరియల్ (సిఎస్ఎఎం)కు సంబంధించిన ఉల్లంఘనల విషయంలో సోషల్ మీడియా వేదికలు, వ్యక్తులు చట్టపరమైన రక్షణ కోల్పోతారని మెటాను కేంద్రం హెచ్చరించింది. అశ్లీల కంటెంట్‌ను అనుమతించడం చట్ట ఉల్లంఘన అని కేంద్రం తెలిపింది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరికీ ఎలాంటి చట్టపరమైన మినహాయింపు ఉండబోదని తేల్చిచెప్పింది. అయితే, సెన్సార్‌షిప్ విధించడం లేదా కంటెంట్‌ను పరిమితం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేసింది. భారతీయ చట్టాలు, నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడటమేనని తమ ఉద్దేశమని వివరించింది. ఈ క్రమంలో బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఏ పోస్ట్‌ను సహించబోమని సంస్థకు తేల్చిచెప్పినట్లు కేంద్రం వెల్లడించింది. అంతే కాకుండా కంటెంట్ రూపొందించే విషయంలో దేశంలోని విభిన్న భాషలు, సాంస్కృతిక సున్నితత్వాలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పింది. చర్చల సందర్భంగా తమ అల్గారిథమ్‌లు, సిస్టమ్‌లు ఎలా పనిచేస్తాయో మెటా ప్రతినిధులు ప్రభుత్వానికి వివరించినట్లు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. దీనిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, ఇందులో కొన్ని కీలక నిర్ణయాలు, మార్పులు ఉండొచ్చని పేర్కొన్నాయి. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై ఆందోళన కేవలం భారత్‌కే పరిమితం కాలేదని, ఆస్ట్రేలియా, యుకె, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇదే ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయని కేంద్రం అభిప్రాయపడింది. ప్లాట్‌ఫామ్ నియమాలను అమలు చేసేటప్పుడు మోడరేషన్ వ్యవస్థలు వివిధ దేశాల సంస్కృతుల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. వాక్ స్వాతంత్ర్యం ముఖ్యమైనదే అయినప్పటికీ, సాంస్కృతిక, సామాజిక పరిస్థితులు దేశాన్ని బట్టి మారుతుంటాయని చెప్పింది. అభ్యంతకర కంటెంట్‌ను అరికట్టి, సమతుల్యత తీసుకురావాల్సిన బాధ్యత ఆయా ప్లాట్‌ఫామ్‌లదేనని స్పష్టం చేసింది. ఎఐతో సృష్టించిన కంటెంట్‌ను తప్పనిసరిగా లేబుల్ చేయాలని కేంద్ర ఐటీశాఖ అధికారి ఒకరు తెలిపారు. 'సిఎస్ఎఎం సంబంధిత ఉల్లంఘనలలో పాల్గొన్న వ్యక్తులకు లేదా సంస్థలకు సేఫ్ హార్బర్ అందుబాటులో ఉండదు. కేంద్రం చర్యలు ఇప్పటికే ఉన్న చట్టపరమైన, శాసనపరమైన చట్రంలోనే ఉన్నాయి. ఆ చట్రం వెలుపల ఎటువంటి చర్య తీసుకోలేదు' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. చట్టవిరుద్ధమైన కంటెంట్, వినియోగదారుల భద్రత, ప్లాట్‌ఫారమ్ జవాబుదారీతనంపై ఆందోళనల నేపథ్యంలో మెటా ప్లాట్‌ఫారమ్‌లపై ప్రభుత్వం నిఘా పెంచిన తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

# భారత్ 'ఓటరు కార్డు' బాటలో నడుద్దాం: ట్రంప్

● సిఇసి జ్ఞానేశ్ వ్యాఖ్యలు ప్రస్తావించి ప్రశంసలు ● 'సేవ్ అమెరికా యాక్ట్' తక్షణ ఆమోదానికి పిలుపు



**వాషింగ్టన్:**భారతదేశంలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు,ఓటరు కార్డులు ఉన్నాయని అదే తరహాలో ''సేవ్ అమెరికా చట్టం'' తీసుకురావడం ద్వారా భారత్ బాటలో ప్రయాణం చేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పిలుపు ఇచ్చారు. ఈ చట్టం ద్వారా ఎన్నికల మోసాలను అరికట్టగలుగుతామన్నారు. సోషల్ మీడియాలో ట్రంప్ ఈ మేరకు సంచలనాత్మకమైన పోస్టింగ్ పెడుతూ భారత ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ వ్యాఖ్యలను ప్రస్తావించి ఆయనపై ప్రశంసలు కురిపించారు. సేవ్ అమెరికా చట్టాన్ని ఆమోదింపజేసుకోవడానికి మద్దతు కూడగట్టేందుకు ఈ ప్రస్తావన చేశారు.''చెల్లుబాటయ్యే ఫొటో గుర్తింపు కార్డులు లేకుండా అమెరికాలో మీరు ఏ విధంగా ఎన్నికలు నిర్వహిస్తారని జ్ఞానేశ్ కుమార్ ఈనెలారంభంలో మా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు'' అని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో రాశారు.ఓటర్లు తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి,గుర్తింపు కార్డు పొందడానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది.ఐతే అమెరికాలో మహిళల క్రీడలలో పురుషులు పోటీపడటాన్ని, ట్రాన్స్‌జెండర్లను తయారు చేయడానికి వీలుగా జననాంగాల విచ్ఛేధనకు శస్త్రచికిత్సలను కూడా శాశ్వతంగా నిషేధించేందుకు ఈ బిల్లులో ట్రంప్ ప్రతిపాదనలు చేశారు.అమెరికాలో ఓటింగ్ విధానం,పౌరసత్వ ధృవీకరణ నిబంధనలను మరింత కఠినంగా తీర్చిదిద్దేందుకు అధికారంలోకి వచ్చినప్పటినుండీ ట్రంప్ తెగ కష్టపడుతున్నారు. ముఖ్యంగా వలస ప్రజలను,అక్రమంగా దేశంలోకి ప్రవేశించేవారిని బయటకు గెంటేసి, దేశీయ అమెరికన్లకు అధిక ప్రాధాన్యత తేవడమే ఆయన లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. భారతదేశంలో గత ఎన్నికలలో 64.60 కోట్లమంది ఓటర్లు గుర్తింపు కార్డులు చూపించి ప్రత్యక్ష ఓటింగ్‌లో పాల్గొన్నారని, కేవలం ఒకటికంటే తక్కువశాతంమంది ఆన్‌లైన్, పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో పాల్గొన్నారని,ఈ దిశగా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సేవ్ అమెరికా చట్టాన్ని కాంగ్రెస్ ఉభయసభలూ తక్షణం ఆమోదించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఓటర్ల డేటాను ఆన్‌లైన్ డేటాతో అనుసంధానం చేశారు. కానీ అమెరికాలో మాత్రం ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలి.

# ఇజ్రాయెల్ ఎన్నికలకు దూరంగా ఉంటా: ట్రంప్

**వాషింగ్టన్:**ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఎవరిపక్షాన ఉండబోనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు.ఇజ్రాయెల్ ఎన్నికలకు దూరంగా ఉండటమే సముచితంగా ఉంటుందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత తాను ఈ విషయంపై ఆలోచిస్తానన్నారు. ఎన్నికల్లో ఎవ్వరికీ మద్దతు ఇవ్వబోనని, ఆ తర్వాతే ఒక నిర్ణయం తీసుకుంటానని ఫాక్స్ న్యూస్ రిపోర్టర్‌కు చెప్పారు. అక్టోబరు 27వ తేదీ నాటికి ఇజ్రాయెల్ పార్లమెంటు ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. దాదాపుగా నెతన్యాహూను లికుడ్ పార్టీ తిరిగి అభ్యర్థిగా ఎన్నుకునేందుకు సిద్ధమైంది. ఐతే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.నెతన్యాహూతో ట్రంప్‌కు అత్యంత సాన్నిహిత్యం ఉంది.ఆయనతో అనేక సార్లు ట్రంప్ గొడవపడ్డారు. విభేదించారు. విమర్శించారు. నెతన్యాహూను తీవ్రస్థాయిలో దూషించారు. గేలిచేశారు. ఐనాగానీ నెతన్యాహూను ఆయన సన్నిహితుడుగానే భావిస్తారు. అవినీతికేసులో నెతన్యాహూకు క్షమాభిక్ష ప్రసాదించాలని పదే పదే ట్రంప్ ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్‌ను కూడా ట్రంప్ గతంలో ప్రశంసించారు.ఇదిలా ఉండగా, మరోవైపు ఐసెన్ కోట్,యైర్,గోలన్,లిబర్‌మాన్,అరబ్ పార్టీల కూటమి అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ అధికార లికుడ్‌పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది.

**వెస్ట్‌బ్యాంక్‌లో కొనసాగుతున్న సెటిలర్స్ ఆరాచకాలు**

ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో పాలస్తినా కుటుంబాలపై ఇజ్రాయెల్ సెటిలర్స్ తమ అరాచకాలను కొనసాగిస్తున్నారు.మధ్యవెస్ట్‌బ్యాంక్‌లోని తుర్మస్ అయ్యాగ్రామ శివారు ప్రాంతంలో పాలస్తీనియన్ల పంట పొలాలకు ఇజ్రాయెలీ సెటిలర్స్ నిప్పుపెట్టి దగ్ధం చేశారు.మరోవైపు ఖుస్రా గ్రామంలో పాలస్తినా కుటుంబాల దిగ్బంధనం కొనసాగుతోంది. రెండు వారాలుగా పాలస్తినా కుటుంబాలను ఇళ్ళలోంచి బయటకు రానీయకుండా, వారిని బయట తిరగకుండా ఇజ్రాయెలీ సెటిలర్స్ దిగ్బంధనం అమలు చేస్తున్నారు. వారికి ఇజ్రాయెలీ ఐడిఎఫ్ దళాలు కూడా అండదండలు ఇస్తున్నాయి. తుర్మస్ అయ్యా గ్రామంలో దగ్ధమవుతున్న పంటపొలాలను ఆర్పేందుకు ఒక వ్యక్తితో పాటు సహాయబృందాలు వెళ్ళేందుకు ప్రయత్నం చేయగా, ఇజ్రాయెల్ రక్షణ దళాలు వెళ్ళనీయకుండా వారిని అడ్డుకున్నాయి.

# జాంబియా ఎన్నికల్లో మరోసారి హిచిలేమా 'విన్'



**లుసాకా:**దక్షిణ–మధ్య ఆఫ్రికాదేశం జాంబియా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో హకైండో హిచిలేమా (64) రెండోసారి విజయం సాధించారు. ఆయన మరో ఐదేళ్ళు అధ్యక్ష పదవిలో కొనసాగుతారు. 60శాతం ఓట్లు సంపాదించి ప్రధాన ప్రత్యర్థి బ్రయాన్ ముండుబిలే (55) ఒలుపొందారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ముండుబిలేకు 38 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. మొదటినుండీ హిచిలేమా గెలుపు ఖాయమని అందరూ అనుకుంటూ వచ్చారు.ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన మరో 12 మంది అభ్యర్థులు ఎటూకాకుండా పోయారు. ఆయన ప్రధాన ప్రత్యర్థి ముండుబిలే తానే విజయం సాధించానని పోలింగ్‌కు ముందుగానే ప్రకటించుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎన్నికల్లో తీవ్రస్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రకటించిన ఫలితాలకు, అంతిమంగా అధికారులు ప్రకటించిన ఫలితాలకు చాలా తేడా ఉందని, పోలింగ్ కేంద్రాలలో సైన్యం జోక్యం చేసుకుందని ఆరోపించారు. అంతకుముందు అంటే గడచిన శుక్రవారంనాడు దేశంలో ఉన్న ప్రధాన ప్రతిపక్ష నాయకులను కుట్రకు పాల్పడ్డారంటూ అధికారులు అరెస్టులు చేశారు. ఈ ఆరోపణలను ముండుబిలే కొట్టిపారేశారు. తన విజయంపై హిచిలేమా ఒక ప్రకటన చేస్తూ, జాంబియాదేశం శాంతికి, చట్టబద్ధపాలనకు ప్రతీకగా నిలిచిందని, ఎన్ని సమస్యలు ఉన్నా వాటన్నింటినీ బ్యాలెట్ ద్వారా మాత్రమే పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. జాంబియా ఒక ప్రజాస్వామ్యబద్ధమైన దేశమన్నారు.తన ప్రత్యర్థులను కూడా ఎంతో గౌరవిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.యునైటెడ్ పార్టీ ఫర్ నేషనల్ డవలప్‌మెంట్ తరపున ఆయన ఎన్నికల్లో పోటీ చేశారు.

# ఉక్రేన్‌కు నూరుశాతం మద్దతు ఇస్తాం

**రష్యాకు బ్రిటన్ ప్రధాని బర్న్‌హామ్ ప్రతిహెచ్చరిక**



**లండన్:**ఆపదలో ఉన్న ఉక్రేన్‌యు యుద్ధంలో నూటికి నూరుశాతం మద్దతు ఇస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ రష్యాకు ప్రతి హెచ్చరిక చేశారు. ఆయన పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ,ఉక్రేన్ ఆత్మరక్షణ చర్యలకు తాము సహకరిస్తున్నామన్నారు. గత ప్రధానమంత్రులు కూడా ఉక్రేన్ ఆత్మరక్షణకు అండగా నిలబడ్డారని,తన హయాంలో కూడా ఇప్పటికీ అదే విధానం కొనసాగుతుందని చెప్పారు. ఉక్రేన్‌కు డ్రోన్లు,ఇతర కీలక ఆయుధాల సరఫరా నిలిపివేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని బ్రిటన్‌కు రష్యా హెచ్చరిక చేసింది. ఇటీవల ఉక్రేన్ ఎక్కడో సుదూరంగా 1200–1300 కి.మీ దూరంలో ఉన్న రష్యా భూభాగాలను లక్ష్యంగా చేసుకుని తీవ్రనష్టం కలిగిస్తోంది. గడచి రెండు నెలలుగా రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీ వైల్డ్ బెరీస్ గిడ్డంగులు, లాజిస్టిక్ కేంద్రాలను ఉక్రేన్ డ్రోన్లు ధ్వంసం చేస్తున్నాయి. నల్లసముద్రంలో రష్యా కార్గో నౌకలను కూడా ధ్వంసం చేస్తున్నాయి. ఈ డ్రోన్లు అన్నీ బ్రిటన్‌లో తయారైనట్లు ధృవీకరించుకున్న తర్వాత ''ఈ విషయంలో బ్రిటన్ ప్రమేయం ఎంత ఎక్కువగా ఉంటే అంత భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది, ఇది అనివార్య చర్యలకు దారితీస్తాయి, ఈ విషయంలో బ్రిటన్ సమాధానం చెప్పాలి'' అని చేసిన హెచ్చరికపై బర్న్‌హామ్ స్పందించారు. మేం కేవలం సుఖంగా, సంతోషంగా ఉన్న సమయాలలో మాత్రమే మిత్రులం కాదని, ఆపద సమయాలలో ఉక్రేన్‌కు నూటికి నూరుశాతం అండగా ఉంటామని ప్రకటించారు. ఉక్రేన్ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసేందుకు బ్రిటన్ ప్రయత్నం చేస్తోందని లండన్‌లో రష్యా రాయబారి విమర్శలకు బర్న్‌హామ్ సమాధానమిచ్చారు. డ్రోన్ టెక్నాలజీతో పాటు, స్మార్ట్ షాడో క్షిపణులు అందించడంలో కూడా బ్రిటన్ పాత్రపై రష్యా గ తంలోనూ హెచ్చరిక చేసింది.

# ఇండోనేసియాలో మళ్ళీ భూకంపం

**మరో మూడువారాలు భూకంప భయం**

**జకర్తా:** భూకంపాలతో తల్లడిల్లుతున్న ఇండోనేసియాలో మంగళవారం మరోసారి భూకంపం సంభవించింది. ఈసారి తూర్పు సుమత్రా దీవులలో 6.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఐతే ప్రాణ నష్టం,ఆస్తినష్టం జరిగినట్లు వెంటనే సమాచారం లభ్యంకాలేదు. దక్షిణ ని యాస్ రీజెన్సీకి ఆగ్నేయంగా 147 కి.మీ దూరంలో 29 కి.మీ లోతున భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉన్నట్లు నిపుణులు చెప్పారు. ఆగస్టు 15వ తేదీన నుసా తెంగారా ప్రాంతంలో రిచ్‌టర్‌స్కేలుపై 7.7 తీవ్రతతో నమోదైన పె ను భూకంపంలో 70 మంది మరణించారు. అప్పటినుండీ మూడు రోజులుగా 2,200 సార్లు ఇండోనేసియాలో భూ ప్రకంపనలు సంభవించడం తో ప్రజలు అరచేతిల్లో ప్రాణాలు బిగబట్టుకుని జీవి తం గడుపుతున్నారు. ఈ భూ ప్రకంపనలు మరో మూ డు వారాలపాటు కొనసాగవచ్చునని ఇండోనేసియా వా తావరణ, విరిగి పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

# 30 రోజుల్లో హమాస్ నిరాయుధీకరణ

**హమాస్ సొరంగాలు సమాధి చేస్తాం: జారెడ్ కుష్నెర్**



**జెరూసలెం:**గాజాలో హమాస్ ఉగ్రవాదుల నిరాయుధీకరణ ప్రక్రియ రాబోయే 30 రోజుల్లో ప్రారంభం కాగలదని, ఈ విషయంలో మంచి పురోగతి సాధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మాకు ఇరు పక్షాల నుండీ (ఇజ్రాయెల ప్రభుత్వం–హమాస్) సహకారం అవసరమని అన్నారు. జెరూసలెంలో ఆయన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూతో సమావేశమైన సందర్భంగా పైవిధంగా స్పందించారు.ఈ సమావేశంలో గాజా శాంతిమండలి రాయబారులు నికోలే మ్లాడెనోవ్,బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ కూడా పాల్గొన్నారు. రాబోయే 60 నుండి 90 రోజుల్లో హమాస్ ఆయుధాలను వదిలిపెట్టేందుకు స్వచ్ఛంధంగా స్పందించవచ్చునని, లేదా తాము ఆ ప్రక్రియ పూర్తిచేసేందుకు సహకరిస్తామని చెప్పారు. హమాస్ చెప్పాల్సినదంతా తమకు చెప్పిందని, వారు చెప్పినమాటలను ఆచరణలో పెట్టేందుకు వారికి తగిన సమయం ఇస్తున్నామని అన్నారు. హమాస్ నిరాయుధీకరణ,గాజాలో శాంతి ప్రక్రియకు నెలరోజుల్లో పురోగతి కనిపించే అవకాశం ఉందని అన్నారు. అదేవిధంగా హమాస్ నిర్మించిన సొరంగాలను సమాధి చేసే ప్రక్రియ కూడా జరుగుతుందన్నారు. హమాస్‌వద్ద అత్యంత శక్తిమంతమైన,విలువైన ఆయుధాలు ఉన్నాయి. వాటిని హమాస్ స్వాధీనంచేసే విషయంపై ఇజ్రాయెల్ సందేహాలు వ్యక్తం చేస్తోంది. గాజాలో సైనికుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యేవరకూ తాము పునర్నిర్మాణానికి అనుమతించబోమన్నారు. హమాస్ నిరాయుధీకరణకు అంగీకరించినప్పటికీ ఇజ్రాయెల ప్రధానమంత్రి మాత్రం హమాస్ చిత్తశుద్ధిని శంకిస్తూనే ఉన్నారు. హమాస్‌ను తోసిపుచ్చారు.హమాస్ పూర్తిగా నిరాయుధులైతేతప్ప గాజా నుండి వైదొలగే ప్రసక్తేలేదని,హమాస్ మరోసారి తిరిగి ఆయుధాలు సమకూర్చుకోదన్న హామీ,భరోసా తమకు లేదని నెతన్యాహూ అనేక సందేహాలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ట్రంప్ నాయకత్వంలోని గాజా శాంతి మండలి ద్వారా ప్రతిపాదించిన 15 సూత్రాల ప్రణాళికకు కట్టుబడి ఉన్నట్లు హమాస్ ప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ మాత్రం హమాస్‌పై సందేహాలు వ్యక్తం చేస్తోంది.

## పిపిపితోనే ఇంధన విప్లవం (మొదటి పేజీ తరువాయి)

చేయనున్న ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తి పరిశ్రమలను తెలంగాణలో ఏర్పాటు చేసే సంస్థలకు మూలధన సాయం, ఎస్‌జిఎస్‌టి రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు టిజిఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు అందిస్తున్నామని వివరించారు. అనంతరం సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసారి నో ఖేల్ రత్నా

**(మొదటి పేజీ తరువాయి)**

కీలక పాత్ర పోషించారు. అలాగే, మహిళల విభాగంలో ఫిడే ప్రపంచ కప్‌లో అదరగొట్టిన దివ్య జితేంద్ర దేశ్‌ముఖ్ సైతం అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. ఇక, మహిళల డబుల్స్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో అంచలంచెలుగా ఎదుగుతున్న పుల్లెల గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడికి సంయుక్తంగా ఈ గౌరవం దక్కింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కుమార్తె అయిన గాయత్రి, ట్రీసాతో కలిసి ప్రపంచ వేదికలపై కనబరిచిన ప్రతిభకు ఈ అవార్డు తగిన గుర్తింపుగా నిలిచింది. మరోవైపు, డెకాథ్లాన్, హైజంప్ విభాగంలో దేశానికి ఎన్నో పతకాలు తెచ్చిన తేజస్విన్ శంకర్‌కు ఈ అవార్డు లభించింది. అలాగే రేస్ వాకింగ్‌లో దేశ కీర్తిని పెంచిన ప్రియాంక గోస్వామి, ట్రాక్ అండ్ ఫీల్డ్ దూసుకుపోతున్న మహమ్మద్ అజ్మల్ కూడా ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో అవకాశం లభించింది. వీరితో పాటు నరేందర్ (బాక్సింగ్), లాల్‌రెమ్సియామి (హాకీ), రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుర్జీత్ (కబడ్డీ), పూజ (కబడ్డీ), రుద్రాంశ్ ఖండేల్‌వాల్ (పారాషూటింగ్), ఏక్తా భయన్ (పారాషూటింగ్), ధనుశ్ శ్రీకాంత్ (పారాషూటింగ్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెరాన్ (షూటింగ్) అవార్డులను అందుకోనున్నారు. కాగా, అర్జున అవార్డుకు ఎంపికైన క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బహుమతులను అందజేస్తుంది. పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా విజేతలకు రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. దేశంలో క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు, అలాగే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏటా కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా పురస్కారాలను అందజేస్తుంది. ఒలింపిక్స్, ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో భారత్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన వారికి ఈ పురస్కారాలు వరిస్తాయి. ఈ ఏడాది అవార్డుల ఎంపికలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, షూటింగ్, హాకీ, కబడ్డీ వంటి వివిధ క్రీడలకు సమాన ప్రాధాన్యం లభించింది. యువ క్రీడాకారులతో పాటు సీనియర్లకు కూడా ఈ జాబితాలో చోటు దక్కింది. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, రిటైర్డ్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన ఎంపిక కమిటీ సిఫార్సుల ఆధారంగా పేర్లను ఎంపిక చేస్తారు. అయితే, వివిధ విభాగాల కింద క్రీడాకారులు, కోచ్‌లు సంస్థలకు పురస్కారాలు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రిత్వ శాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది.





## సర్వాయి పాపన్న (మొదటి పేజీ తరువాయి)

నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని సిఎం రేవంత్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందుకు గౌడ సామాజికవర్గం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ ప్రభుత్వం తనది కాదని, సామాజిక న్యాయం, సంక్షేమం కోసం పనిచేస్తున్న అందరి ప్రభుత్వమన్నారు.

**గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన వీరుడు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఇచ్చే ప్రాధాన్యతే తెలంగాణలో బహుజనులు సర్వాయి పాపన్న విగ్రహానికి ఇస్తారని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో నెక్లెస్ రోడ్డును పరిశీలించి, ట్యాంక్‌బండ్‌పై ఉన్న పర్యాటక కార్యాలయాన్ని కూల్చివేసి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తానే సూచించినట్టు వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న విగ్రహానికి ఉంటుందని, విగ్రహం వద్ద మంచి వెలుగుల ఏర్పాట్లతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**గీత, నేత కార్మికులకు హామీలు**

గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని సిఎం స్పష్టం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ప్రమాదవశాత్తు గీత కార్మికులు మృతి చెందితే రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నట్టు, ఇప్పటికే యాభై వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ పొలాల్లో, కాలువ గట్లపై ఈత, తాటి చెట్లు నాటించి కల్తీ లేని కల్లు అందుబాటులోకి తెచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

**విద్యే పరిష్కారం : సిఎం పిలుపు**

గత ప్రభుత్వాలు బిసి వర్గాలను కులవృత్తులకే పరిమితం చేశాయని, చదువుకుంటే తప్ప తలరాత మారదని సిఎం అన్నారు. చదువు వల్లే మధు యాష్కీ గౌడ్ అమెరికా వెళ్లి, తిరిగొచ్చి ఎంపిగా ఎన్నికయ్యారని ఉదాహరణగా చెప్పారు. కులవృత్తిని కొనసాగించండి, గౌరవించండి, కానీ పిల్లలను మాత్రం చదివించండి అని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం, నాణ్యమైన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నట్టు తెలిపారు. ఐటిఐల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం ఇస్తున్నట్టు తెలిపారు.

**కెసిఆర్‌ది కుటుంబ న్యాయం.. నాది సామాజిక న్యాయం..**

పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ నేతలు అక్రమ సంపాదనతో మీడియా, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిఎం విమర్శించారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు కుటుంబ సభ్యులకే పదవులు దక్కాయని, తన హయాంలో మాత్రం సామాజిక న్యాయం ప్రాతిపదికన వివిధ వర్గాలకు అవకాశాలు కల్పించామని పలు ఉదాహరణలతో వివరించారు. కెటిఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేసుకుంటే, తాను మహేశ్ కుమార్ గౌడ్‌ను టిపిసిసి అధ్యక్షుడిని చేశానని, వీరనారి చాకలి ఐలమ్మ మనవరాలిని, అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను కమిషన్ సభ్యులుగా నియమించానని చెప్పారు. కెసిఆర్‌ది కుటుంబ న్యాయమని, తనది సామాజిక న్యాయమని, అది దొరల న్యాయమని విమర్శించారు. ఎనిమిది లక్షల పదకొండు వేల కోట్ల రూపాయల అప్పు తెలంగాణకు పెద్ద ముప్పుగా మారిందని, ఏటా రూ.75 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు, ధాన్యం కొనుగోలుకు రూ.95 వేల కోట్లు, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.60 వేల కోట్లు అందించినట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమగ్ర పాఠశాలలు, క్రీడా విశ్వవిద్యాలయం, క్రీడా అకాడమీని ప్రారంభించినట్టు వివరించారు. ప్రత్యర్థులు తమపై దుష్ప్రచారం చేసేందుకు కర్ణాటక, తమిళనాడు వెళ్లి చేతబడి పూజలు చేయించారని సిఎం తీవ్రంగా విమర్శలు గుప్పించారు. కరువు రావాలని, రైతులు నష్టపోవాలని కోరుకోవడం అధికార దాహానికి పరాకాష్ట అని విమర్శించారు.

**బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక : డిప్యూటీ సిఎం భట్టి**

అంతకుముందు మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ మట్టి బానిసత్వాన్ని, అణచివేతను భరించదని అన్నారు. 17వ శతాబ్దంలోనే అణచివేతపై తిరుగుబాటు చేసి బహుజనులను ఏకం చేసిన సర్వాయి పాపన్న బాటలోనే నేటి ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పేద, బలహీన వర్గాలు ఎవరి దగ్గరా చేయి చాచకుండా ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ జీవిత బీమా వంటి పథకాలు అమలు చేస్తున్నట్టు వివరించారు.

**గీతా కార్మికులకు మోపెడ్‌లు ఇవ్వాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ బహుజనులు చాలా సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మన ఆకాంక్ష ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత ప్రారంభించుకున్నామన్నారు. మంగలి షాపులు బ్యూటీ పార్లర్ సెలూన్‌లుగా మారుతున్నాయి, దోభిఘాట్‌లు డ్రైక్లినింగ్ సెంటర్లుగా మారుతున్నట్టు కల్లు బార్లు కూడా పెద్ద పెద్ద స్టార్ హోటల్స్‌లో దొరికే విధంగా ప్రకృతి పరంగా ఉండే కల్లు గీతా కార్పొరేషన్ మరింత పటిష్టవంతం చేస్తామన్నారు. గీతా కార్పొరేషన్‌కు గతంలో మోపెడ్‌లు ఇచ్చారని, శ్రీధర్ బాబు నేతృత్వంలో ఉన్న మేనిఫెస్టో లో మోపెడ్‌లు పెట్టడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు మోపెడ్‌లు ఇవ్వాలని కోరారు.

**ముఖ్యమంత్రికి గీత పనివారల సంఘం వినతిపత్రం**

గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సభలో వేదికపై ముఖ్యమంత్రిని కలిసి అందజేశారు. పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలను పరిష్కరించాలని, అర్హులందరికీ చెట్లు ఎక్కే కిట్‌లను, మోపెడ్‌లను పంపిణీ చేయాలని కోరారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. పెండింగ్ ఎక్స్‌గ్రేషియా బకాయిలను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలియజేశారు.

***కల్లు దుకాణాలకు స్థలంకై విజ్ఞప్తి***

సహకార సంఘాల ఆధ్వర్యంలో కల్లు దుకాణాల ఏర్పాటుకు గ్రామాలలో వెయ్యి గజాలు, పట్టణ ప్రాంతాలలో 2వేల గజాల స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అందజేసిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. అలాగే జిఒ 560 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సొసైటీలకు వన పెంపకానికి పది ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. సిఎంకు అందజేసిన వినతిపత్రంపై తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బి.నాగభూషణం, ఉపాధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్ గౌడ్‌లు సంతకాలు చేశారు.

## కల్తీ నెయ్యి

**(మొదటి పేజీ తరువాయి)**

పామ్ ఆయిల్ – 1,200 లీటర్లు, వనస్పతి డాల్డా – 600 లీటర్లు,కృత్రిమ నెయ్యి ఫ్లేవర్లు – 6 బాటిళ్లు,స్టార్చ్ – 30 కిలోలు ఉన్నాయి.ఫుడ్ సేఫ్టీ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత ఫుడ్ సేఫ్టీ అథారిటీకి అప్పగించారు. కల్తీ నెయ్యిని ఎలాంటి ప్రమాణాలు లేని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి '100 శాతం ప్యూర్ నెయ్యి', 'ప్రీమియమ్ నెయ్యి', 'ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి', 'నేచురల్ నెయ్యి' పేర్లతో మార్కెట్‌లోకి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్యాకెట్లపై ఎలాంటి లైసెన్స్ నంబర్, బ్యాచ్ నంబర్, తయారీ, గడువు తేదీల వంటి తప్పనిసరి వివరాలు కూడా లేకపోవడం గమనార్హం. ఈ కల్తీ నెయ్యిని పూజలు, దీపాల కోసం ఉపయోగించే నెయ్యిగా మాత్రమే కాకుండా రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ షాపులు, డెయిరీ షాపులు, కేటరింగ్ సంస్థలు, స్టార్ హోటళ్లు, ఆయుర్వేద మందుల దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నెయ్యిలో సుమారు 10 నుంచి 40 శాతం వరకు కల్తీ చేసి, నాణ్యతను బట్టి వేర్వేరు పేర్లతో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది.

**ఆరు రాష్ట్రాల నుంచి ముడి సరుకు**

కల్తీకి ఉపయోగించే మిల్క్ క్రీమ్‌ను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నట్లు విచారణలో తేలింది. తక్కువ ధరకు నాసిరకం పదార్థాలతో నెయ్యిని తయారు చేసి, అసలు నెయ్యి ధరలకే విక్రయిస్తూ భారీగా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సిపి సజ్జనార్ :**

కల్తీ ఆహారంపై పోరాటంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని హైదరాబాద్ నగర సీపీ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ తెలిపారు. వినియోగదారులు గుర్తింపు పొందిన బ్రాండ్లకు చెందిన సీల్డ్ ప్యాకెట్లనే కొనుగోలు చేయాలని, ప్యాకెట్‌పై లైసెన్స్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. తక్కువ ధరకు లభించే బ్రాండ్ లేని లేదా విడిగా విక్రయించే నెయ్యి, పాల ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై సమాచారం ఉంటే 112 లేదా హెల్ప్‌లైన్ 8712661212కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ ప్రత్యేక దాడులను టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ వైభవ్ రఘునాథ్, ఐపీఎస్ నాయకత్వంలో హెచ్ ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. రంజిత్ కుమార్ గౌడ్ ఎం. అంజయ్య, ఎస్‌ఐలు రమ్య, అభిలాష్, శంకర్, కృష్ణ, అఖిల్ తదితరులు నిర్వహించారు.

## రక్షణతో ముందుకు

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న నీరే ప్రామాణికంగా, నమ్మదగిన ప్రవాహాలే ఆధారంగా శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టిఎంసిల సామర్థ్యానికి గాను 746.12 టిఎంసిలు, 76.63 శాతం నిల్వలు, గోదావరి బేసిన్‌లో 306.20 టిఎంసిల సామర్థ్యానికి 208.38 టిఎంసిలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉన్నందున వీటి ఆధారంగానే నీటి విడుదలను ప్రణాళిక బద్ధంగ ఉండాలని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టిఎంసిల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించగా ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. వైరా రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని విడుదల చేయాలన్నారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్‌టిఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు.శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిపై మంత్రి సమీక్షించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం, భారత వాతావరణ విభాగం తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గాలే టెస్ట్..విజయానికి చేరువలో భారత్



టెస్టులో ఆధిపత్యం చెలాయిస్తున్న భారత జట్టు విజయానికి చేరువైంది. నాలుగో రోజు రిషభ్ పంత్(66) అర్ధ శతకంతో కోలుకున్న టీమిండియా.. ఆపై శ్రీలంక పని పట్టింది. 372 పరుగుల లక్ష్య ఛేదనలో లంక బ్యాటర్లను మానవ్ సుతార్(2–30) బెంబేలెత్తించాడు. అరంగేట్రంలోనే ఆకట్టుకున్న ఈ స్పిన్నర్ రెండు వికెట్లతో మెరవగా.. ఆతిథ్య జట్టు ఓటమి అంచున నిలిచింది. ఐదో రోజు మరో ఆరు వికెట్లు తీస్తే చాలు బోణీ టీమిండియాదే. తొలి రోజు నుంచి గాలే టెస్టుపై పట్టుబిగించిన భారత జట్టు గెలుపు వాకిట నిలిచింది. రెండో ఇన్నింగ్స్లో పెద్ద స్కోర్ చేయకున్నా సరే మ్యాచ్ను తమ గుప్పిట్లోకి తీసుకుంది శుభ్మన్ గిల్ సేన. దాంతో.. నాలుగోరోజు చకచకా వికెట్లు తీసి.. టీమిండియాను 193 పరుగులకే ఆలౌట్ చేసిన సంతోషం శ్రీలంకకు ఎంతో సేపు నిలవలేదు.

**సిరాజ్ మొదలెట్టగా...** టీ బ్రేక్ అనంతరం 372 పరుగుల ఛేదనలో లంకను ఆదిలోనే దెబ్బతీశాడు సిరాజ్. ఓపెనర్ నిషాన్ మధుష్క(6)ను అతడు ఔట్ చేసి బ్రేకివ్వగా, ఆపై మానవ్ సుతార్(230) తిప్పేశాడు. క్రీజులో కుదురుకోవాలనుకున్న లహిరు ఉదార(16)ను, దినేశ్ చండీమాల్ స్థానంలో ఆడుతున్న పసిందు సూర్యబండార(0)లను వెనక్కి పంపి లంకను మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. ప్రసిధ్ కృష్ణ ఓవర్లో కమిందు మెండిస్(2) సైతం వెనుదిరగగా ఆతిథ్య జట్టు కష్టాల్లో పడింది. ఆఖర్లో వికెట్ కాపాడుకుంటూ కెప్టెన్ ధనంజయ డిసిల్వా(31 నాటౌట్), సొనాల్ దినుశా(25 నాటౌట్)లు పట్టుదలగా ఆడారు. దాంతో, నాలుగో రోజు ఆట ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది లంక. సిరీస్లో బోణీ కొట్టేందుకు ఐదోరోజు ఆ జట్టుకు 288 రన్స్ అవసరమవ్వగా.. టీమిండియాకు 6 వికెట్లు కావాలంతే.

**పంత్ ఫటాఫట్...** తొలి మూడు రోజులు గాలే స్టేడియంలో అదరగొట్టిన భారత జట్టు నాలుగో రోజు తడబడింది. తొలి సెషన్ నుంచి శ్రీలంక పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో శుభారంభం దక్కలేదు. ఓపెనర్ యశస్వీ(0)ని అసితా ఫెర్నాండో డకౌట్ చేయగా, కేఎల్ రాహుల్(35)ను ప్రభాత జయసూర్యలు ఔట్ చేసి లంకకు బ్రేకిచ్చారు. కెప్టెన్ శుభ్మన్ గిల్ (8) సైతం నిరాశపరచగా.. 81వద్దే మూడు వికెట్లు పడ్డాయి. అయితే.. తొలి ఇన్నింగ్స్ శతక వీరుడు దేవ్దత్ పడిక్కల్(44) 'నేనున్నాగా' అంటూ టీమిండియాను ఆదుకున్నాడు. ధ్రువ్ జురెల్(7) సైతం విఫలమైనా.. రిషభ్ పంత్(66) తన స్టయిల్లో విజృంభించాడు. ఎడాపెడా బౌండరీలు బాది.. మెరుపు అర్ధ శతకంతో లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. టెస్టుల్లో 21వ హాఫ్ సెంచరీ, వంద సిక్సర్లతో అలరించిన పంత్ను లహిరు కుమార వెనక్కి పంపాడు. అంతే.. అక్కడితో టెయిలెండర్లను లంక బౌలర్లు చకచకా చుట్టేశారు. దాంతో.. పంత్ ఔటైన 19 పరుగులకే టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది. తొలి ఇన్నింగ్స్లో భారీ స్కోర్ చేసిన భారత్& ఈసారి మాత్రం 193కే ఆటౌటైంది. అయినా కూడా.. ఆతిథ్య జట్టుకు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## వరల్డ్‌కప్ విజేతకు పాండ్యా ప్రత్యేక కానుక



భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ క్రాంతి గౌడ్ ప్రత్యేక కానుక అందుకుంది. అది కూడా తన ఫేవరెట్ ఆటగాడైన హార్దిక్ పాండ్యా చేతుల మీదు గా. మంగళవారం ఈ పేసర్ పుట్టినరోజును పురస్కరించుకొని బెంగళూరులో తన 33వ నంబర్ జెర్సీని బహూకరించాడు పాండ్యా. తాను స్ఫూర్తిగా భావించే ఆటగాళ్లలో ఒకడైన హార్దిక్ నుంచి బర్త్ డే నాడు జెర్సీ అందుకోవడంతో తెగ సంబురపడిపోయిందీ వరల్ కప్ విజేత. ఇటీవల ఇంగ్లం సంచలన ప్రదర్శనతో లారడ్స్ హానర్స్ బోర్డులో పేరు సంపాదించిన క్రాంతి గౌడ్.. వసంతంలో అడుగుపెట్టింది. మంగళవారం ఆమె పుట్టిన రోజు కావడంతో భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆమెకు ప్రత్యేక కానుక ఇచ్చాడు. పాండ్యా తనకు జెర్సీ అందించిన ఫొటోను సోషల్ మీడియాలో వెల్లడించిందీ పేసర్. 'హార్దిక్ పాండ్యా నా ఐడల్. నేను అతడిలా గొప్ప క్రికెటర్ అవ్వాలనుకుంటున్నా' అని ఈ ఏడాది వీడియోలో పేర్కొన్న క్రాంతి.. తాను కలగన్నట్టే పాండ్యాను కలిసి మురిసిపోయింది.

## ఇంగ్లండ్ చేతిలో భారత్ ఓటమి

హాకీ ప్రపంచకప్ 2026లో భారత్‌కు బిగ్ షాక్ తగిలింది. పూల్‌డీలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 4–2 తేడాతో భారత్‌ను ఓడించింది. గత మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన భారత్.. ఈ మ్యాచ్‌లో తేలిపోయింది. తొలి అర్ధ భాగంలో 2–1తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. సెకండాఫ్లో మూడు గోల్స్ సమర్పించుకొని ఓటమి చవిచూసింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (16వ నిమిషం), దిల్‌ప్రీత్ సింగ్ (24వ నిమిషం)చెరో గోల్ చేయగా.. ఇంగ్లండ్ తరఫున నికోలస్(13వ, 54వ నిమిషం), స్టువర్ట్ రష్మీర్(38వ నిమిషం), హెన్రీ క్రాఫ్ట్(42వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. మ్యాచ్ ఆరంభంలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. అయితే 13వ నిమిషంలో నికోలస్ గోల్తో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. రెండో క్వార్టర్ మొదలుకాగానే హర్మన్‌ప్రీత్ సింగ్(16వ నిమిషం) గోల్ చేయడంతో స్కోర్ 1–1తో సమమైంది. 24వ నిమిషంలో దిల్‌ప్రీత్ సింగ్ గోల్ చేయడంతో భారత్ 2–1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో మూడో క్వార్టర్లో స్టువర్ట్ రష్మీర్(38వ నిమిషం), హెన్రీ క్రాఫ్ట్(42వ నిమిషం) గోల్స్ చేయడంతో ఇంగ్లండ్ 3–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. 54వ నిమిషంలో నికోలస్ మరో గోల్తో ఆ జట్టు విజయం సాధించింది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ రెండో రౌండ్‌కు అర్హత సాధించగా.. భారత్ ముందంజ వేయాలనే బుధవారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మహిళ

## విద్య బోధనకు 'ఓపెన్ ఎయిర్ స్కూల్స్'





మన దేశంలో, 1900ల ప్రారంభంలో కనిపించిన ఓపెన్‌ఎయిర్ పాఠశాలలు విద్యా చరిత్రలో ప్రత్యేకమైన అధ్యాయాన్ని సూచిస్తాయి. ఇవి పాఠశాల భవనాలు లేకపోవడంతో ఏర్పడిన తాత్కాలిక ఏర్పాట్లు మాత్రమే కాదు. ఆ కాలంలోని గ్రామీణ పేదరికం, పరిమిత మౌలిక వసతులు, విద్యా విస్తరణ అవసరం, ఆరోగ్యంపై పెరిగిన అవగాహన వంటి అనేక అంశాలు కలిసి ఈ విధానానికి రూపమిచ్చాయి. ఈ పాఠశాలల్లో తరగతులు సాధారణంగా చెట్ల నీడలో, బహిరంగ ప్రదేశాల్లో లేదా గాలి, వెలుతురు సులభంగా వచ్చే సరళమైన షెడ్లలో జరిగేవి. విద్యార్థులు నేలపై లేదా సాధారణ బెంచీలపై కూర్చుని పాఠాలు వినేవారు. గోడలు, తలుపులు, కిటికీలతో కూడిన సంప్రదాయ తరగతిగది ఇక్కడ కనిపించేది కాదు. ప్రకృతి మధ్యలోనే ఉపాధ్యాయులు బోధించేవారు. అందువల్ల విద్యార్థులకు కొంత స్వేచ్ఛాయుతమైన, సహజమైన వాతావరణం ఏర్పడేది. గ్రామీణ భారతదేశంలో శాశ్వత పాఠశాల భవనాల కొరత ఈ విధానం విస్తరించడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. ప్రభుత్వ పెట్టుబడులు పరిమితంగా ఉండటం, గ్రామాల్లో ఆర్థిక వనరులు లేకపోవడం, విద్యకు తగిన ప్రాధాన్యం లభించకపోవడం వంటి సమస్యలు శాశ్వత భవనాల నిర్మాణాన్ని కష్టతరం చేశాయి. ఈనేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి విద్య అందించేందుకు బహిరంగ ప్రదేశా లు ఉపయోగపడ్డాయి. అయితే, ఓపెన్‌ఎయిర్ పాఠశాలలకు ఆరోగ్యపరమైన ఉద్దేశం కూడా ఉంది. 20వశతాబ్దపు తొలి దశల్లో యూరప్, అమెరికాల్లో తాజా గాలి, సూర్యకాంతి ఆరోగ్యానికి మేలు చేస్తాయనే వైద్య భావన బలపడింది. ముఖ్యంగా క్షయవ్యాధి వంటి వ్యాధుల నేపథ్యంలో గాలి ప్రసరణకు ప్రాధాన్యం పెరిగింది. ఆ ఆలోచనలు భారతదేశంలోని కొన్ని విద్యా ప్రయత్నాలపై కూడా ప్రభావం చూపాయి. అయితే ప్రతి ఓపెన్‌ఎయిర్ పాఠశాల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఏర్పడిందని చెప్పడం సరైంది కాదు. అనేక సందర్భాల్లో మౌలిక వసతుల కొరత, ఆరోగ్య భావనలు రెండూ కలిసి పనిచేసి ఉండవచ్చు. ఈపాఠశాలలు గ్రామీణ బాలికలకు విద్య అందించే అవకాశాలను కొంత విస్తరించాయి. కొన్నిచోట్ల బాలురు, బాలికలు కలిసి చదివే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ, ఆ కాలపు సామాజిక ఆచారాలు బాలికల విద్యకు పెద్ద అడ్డంకిగానే కొనసాగాయి. కాబట్టి వీటిని లింగ సమానత్వానికి సంపూర్ణ ఉదాహరణగా చూడలేం. 1920ల నాటి కొన్ని ఫోటోలు చెట్ల కింద ఉపాధ్యాయులు బోధిస్తున్న, వరుసల్లో విద్యార్థులు కూర్చున్న దృశ్యాలను చూపిస్తాయి. అవి ఆ కాలపు విద్యా వ్యవస్థలోని అవకాశాలతో పాటు పరిమితులను ప్రతిబింబిస్తాయి. ఇవన్నీ ఆధునిక ఓపెన్‌స్కూలింగ్‌తో మాత్రం గందరగోళ పరచకూడదు. నేటి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఐఓఎస్) వంటి వ్యవస్థలు దూరవిద్య, సౌకర్యవంతమైన సమయాలు, సాంకేతికత ఆధారంగా పనిచేస్తాయి.పాత ఓపెన్‌ఎయిర్ పాఠశాలలు మాత్రం విద్యార్థులను ఒకే ప్రదేశంలో ప్రకృతి మధ్యకు తీసుకువచ్చేవి. ఒకటి మౌలిక వసతుల పరిమితి నుంచి పుట్టింది, మరొకటి విద్యను మరింత విస్తృతంగా అందించాలనే ఆధునిక ఆలోచన నుంచి అభివృద్ధి చెందింది. అందువల్ల, భారతదేశంలోని ప్రారంభ ఓపెన్‌ఎయిర్ పాఠశాలలను ఆదర్శ విద్యా నమూనాగా కాకుండా, సామాజిక అవసరాలు, ఆర్థిక పరిమితులు, ఆరోగ్య భావనలు కలిసి సృష్టించిన ఒక చారిత్రక ప్రయోగంగా చూడాలి.

## 'కోత'లతో అఫ్గాన్ మహిళలు




యుఎన్ విమెన్ తాజా నివేదిక ప్రకారం, అఫ్గానిస్థాన్‌లో విదేశీ సాయంలో కోతలు, మహిళలపై విధించిన ఉపాధి నిషేధాలు కలిసి మహిళలు, బాలికల జీవన పరిస్థితులను మరింత తీవ్రం గా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ సంక్షోభం సమయంలో కీలకమైన సేవలను అందిస్తున్నప్పటికీ, నిధుల కొరతతో వాటి విస్తరణ, స్థాయి తగ్గుతున్నది. 2021లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు విద్య, ఉద్యోగాలు, ప్రజాజీవితం వంటి రంగాల్లో తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కొంటున్నారు. తాజా యుఎన్ విమెన్ సమాచారం ప్రకారం, అఫ్గాన్ మహిళల్లో సగం మంది నెలలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే ఇంటి నుంచి బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రయాణ పరిమితులు, ఉద్యోగ నిషేధాలు, సామాజిక ఆంక్షలు ప్రధాన కారణాలుగా ఉన్నా యి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో మహిళల ఆర్థిక స్వావలంబన దెబ్బతింటోంది. అదే సమయంలో అంతర్జాతీయ సహాయ నిధులు తగ్గ దంతో ఆహారం, ఆరోగ్యం, విద్య, భద్రత వంటి ప్రాథమిక అవసరాలకు మహిళలు, బాలికలకు అందే సహాయం కూడా తగ్గుతోంది. మహిళలు నిర్వహించే సంస్థలు స్థానిక సమాజాలకు చేరువగా ఉండటంతో, వాటి నిధుల కొరత మొత్తం మానవతా సహాయ వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. యుఎన్ విమెన్ ఈ పరిస్థితిని మహిళల హక్కుల సంక్షోభంగా మాత్రమే కాకుండా, అఫ్గాన్ సమాజం భవిష్యత్తును ప్రభావితం చేసే మానవతా సంక్షోభంగా కూడా చూస్తోంది. మహిళలపై ఆంక్షలు కొనసాగుతూ, సహాయ నిధులు తగ్గితే పేదరికం, ఆహార భద్రత సమస్యలు, విద్యా లోటు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

# జిఓ నెంబర్ 97ను రద్దు చేయాలి

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనాన్ని ఉపసంహరించుకోవాలి**

**శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ధర్నాలు**



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జిఒ నెం. 97ను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గానీ విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందన్నారు. విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో చేరితే, నేడు ప్రభుత్వం తీసుకవచ్చిన నిర్ణయాన్ని చూసి వారు భయాందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకులు భర్తీ, ల్యాబ్‌ల ఆధునీకరణ వర్క్‌షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ, ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ ఆలోచన చేయటం సరికాదని, తక్షణమే ఆ ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, నాయకులు అజేష్, రాంచరణ్, నీరజ్, నాగేష్, శివపవన్, కిషోర్, భాను, విష్ణు, మహేందర్ పాల్గొన్నారు.

**కోరుట్ల :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జిఒ నెంబర్ 97ను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి వరక అజిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని మంగళవారం కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ కోరుట్ల అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి విష్ణు తేజ, ఘని, అక్రమ్ మాలిక్, ముజీబ్, జయదీప్,అస్లాం, మహేందర్, హర్ష, లోకేష్, భాస్కర్, అభిషేక్, రాజేష్, గ్రీష్మ, సౌమ్య, అక్షయ, తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జిఒ నెంబర్ 97ను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి రైల్వే స్టేషన్ రోడ్ ట్రినిటీ పాఠశాల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఆజాద్, రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో పాలిటెక్నికల్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, ప్రైవేటీకరణ దిశగా ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తడిగొప్పుల అను సాయి, ఆర్నకొండ ఆదిత్య, వెంకటేశ్వర్లు, జశ్వంత్, రోహిత్, ప్రణయ్ పాల్గొన్నారు.





**ప్రజాసమస్యల పరిష్కారానికి**

# నిరంతర పోరాటాలు




**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**సిపిఐ(ఎం) నుంచి సిపిఐలోకి భారీగా చేరికలు**

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిరంతరం పోరాటాలు చేస్తున్నదని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ జిల్లా సిపిఎం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సిపిఐలో చేరారు. మంగళవారం సిపిఐ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సమక్షంలో దాదాపు 100 కుటుంబాలు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐలో చేరిన వారికి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల హక్కులు, సమస్యల సాధన కోసం సిపిఐ నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ పోరాటాల పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి సిపిఐలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని ప్రాంతాల్లో బలోపేతం చేయడానికి అందరూ కలసికట్టుగా కృషి చేయాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ సిపిఐ సిద్ధాంతాలు, ప్రజల పట్ల పార్టీకున్న కట్టుబాటు నచ్చి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పార్టీలో చేరిన నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, నాయకులు అలకుంట యకయ్య, కంచర్ల కుమారస్వామి, నోముల కిషోర్, అలకుంట మల్లయ్య, ఎన్నాం వెంకటేశ్వర్లు, పల్లకొండ శ్రీకాంత్, కావ్య శ్రీ, దుర్గ, ప్రేమలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ డిమాండ్**




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్పోరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండు చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరై బాల నరసింహ మాట్లాడుతూ సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి కార్మికులు, కార్మిక శ్రేయోభిలాషులు, అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా అనేక సమ్మెలు, పోరాటాలు నిర్వహించినా కేంద్రం స్పందించడం లేదన్నారు. కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం లో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శులు మాదుగుల నరసింహ, బండి లక్ష్మీ పతి, ఉప ప్రధానకార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపాగ శ్రీనివాసులు, శేఖర్, మధు, ఆటో, హమాలీ యూనియన్ నాయకులు దేశమోని సైదులు, ఆర్.యాదయ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

**ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధరేంద్ర**




**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్నాయని, వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వాలు ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి ఉద్యోగావకాశాలను చూపించాలని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కళ్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. మంగళావారం హుస్నాబాద్ పట్టణంలోని ఆనభేరి సింగిరెడ్డి అమరుల భవనంలో ఎఐవైఎఫ్ జిల్లా 3 మహాసభ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సభకు ముందు ఎఐవైఎఫ్ జెండాను ఎగురవేశారు. సభకు ముఖ్య అతిథిగా ధర్మేంద్ర హాజరై మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ యువత పెరిగిపోతుందని, వారికి ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన జాబ్ కాలండర్ ప్రకటించి ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, గిగ్ రంగాల్లో పనిచేస్తున్న యువతకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విద్యార్థుల ఫీజుల నియంత్రణ, పేపరు లీకులు కాకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తేవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, వారికి రావలసిన ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు యువతను కేవలం ఎన్నికల సమయంలో వాడుకుని వదిలివేస్తున్నారని ఆరోపించారు. యువత భవిశ్వత్తును కాలరాస్తే దేశ భవిశ్యత్తు నాశనం ఆవుతుందని హెచ్చరించారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభలో సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జాగీరు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కనుకుట్ల శంకర్, జేరిపోతుల జనార్ధన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, నాయకులు ఆందె ఆశోక్, బొనగిరి రూషేశ్, బి.శ్రీనివాస్, శ్రావన్, మహేశ్, సుదాకర్, నరేష్, శ్రీనివాష్‌తో పాటు యువజన నాయకులు పాల్గొన్నారు.

# 20 నుంచి సిఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

ఇంగ్లాండ్, అమెరికాలో 10 రోజుల పర్యటన

ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, ఎంఐటి తదితర ప్రముఖ వర్సిటీల సందర్శన

పెట్టుబడులు, విద్యా రంగంపై కీలక భేటీలకు అవకాశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, విద్యా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఇంగ్లాండ్, అమెరికా దేశాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, హార్వర్డ్, ఎంఐటితో పాటు లండన్ బిజినెస్ స్కూల్ తదితర విద్యా సంస్థలను సందర్శించనున్నారు. విద్య, పాలన, సాంకేతికత, పెట్టుబడుల అంశాలపై వివిధ సంస్థల ప్రతినిధులతో సిఎం చర్చలు జరపనున్నారు. ఆగస్టు 20న రాత్రి 12.30 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో న్యూఢిల్లీ నుంచి లండన్‌కు సిఎం బయలుదేరుతారు. ఆగస్టు 21న ఉదయం 7 గంటలకు ఇంగ్లాండ్ స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకుంటారు. ఆగస్టు 21న ఉదయం 10.30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సిఎం సందర్శిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించి ఈపిఎల్ ఫుట్‌బాల్ ప్రదర్శనను వీక్షించనున్నారు. ఆగస్టు 22న ఉదయం 10.30 గంటలకు కేంబ్రిడ్జ్ విద్యా సంస్థ ప్రతినిధుల బృందంతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 11.30 గంటలకు లండన్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సెనేట్ హౌస్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శిస్తారు. ఆగస్టు 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు సిఎం రేవంత్‌రెడ్డి వెళతారు. ఆగస్టు 24న ఉదయం 10.30 గంటలకు హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) క్యాంపస్‌ను సందర్శించనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బోస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరుతారు.

ఆగస్టు 25న ఉదయం 10.30 గంటలకు నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌ను సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. ఆగస్టు 26న న్యూయార్క్‌లో సాయంత్రం 7 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (యూఎస్‌ఎ) సమావేశంలో సిఎం పాల్గొంటారు. ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి బయలుదేరి 30వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## రైతుల అవసరాలకు అనుగుణంగా

# ఉద్యాన పరిశోధనలు జరగాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతుల అవసరాలకు అనుగుణంగా ఉద్యాన పరిశోధనలు జరగాలని, వాటి ఫలితాలు నేరుగా రైతుల చెంతకు చేరేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో హార్టికల్చరల్ రీసెర్చ్ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యాన రంగానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక ఘట్టంగా ఈ పరిశోధనా సముదాయం నిలుస్తుందని అన్నారు.ఇప్పటివరకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలల్లో ఎన్నో విలువైన పరిశోధనలు జరిగినప్పటికీ వాటి ఫలితాలు రైతులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదని మంత్రి అన్నారు. గతంలో పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేయడానికి రేడియో, టెలివిజన్ వంటి పరిమిత మార్గాలు ఉండేవని, ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి శక్తివంతమైన మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పరిశోధనల ఫలితాలను వీడియోలు, షార్ట్ ఫిల్మ్‌లు, సోషల్ మీడియా ద్వారా రైతులకు చేరేలా శాస్త్రవేత్తలు,విశ్వవిద్యాలయాలు, ఉద్యాన శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ భూమిలో ఉద్యాన పంటలు సుమారు 6 శాతం మాత్రమే ఉన్నప్పటికీ వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా సుమారు రూ.30,346 కోట్లు (26 శాతం)గా ఉందన్నారు.

**70 శాతం కూరగాయలు దిగుమతి :** రాష్ట్రానికి అవసరమైన కూరగాయలను సుమారు 70 శాతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం ఆందోళకరమైన అంశమన్నారు. ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో డెమాన్‌స్ట్రేషన్ ప్లాట్లు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూపించాలని సూచించారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతుల్లో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని, రెండు, మూడు ఎకరాల రైతులకు అందుబాటులో ఉండేలా తక్కువ ఖర్చుతో కూడిన యంత్రాలు, సాంకేతికత, సాగు పద్ధతులపై పరిశోధనలు జరగాలని సూచించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును రానున్న మూడు, నాలుగేళ్లలో 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

# ఇదే సరైన మార్గం

- జార్ఖండ్ ప్రభుత్వంతో విద్యార్థుల ఒప్పందంపై రాహుల్‌గాంధీ ప్రశంస
- దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలో మార్పుతెస్తామని ప్రతిజ్ఞ



**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో ప్రభుత్వ నియామకాల పరీక్షల సంస్కరణపై నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు, యువకులతో ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్చలద్వారా చేసుకున్న ఒప్పందాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చర్చల మార్గం ఎంచుకున్నప్పుడు నిరసన ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు ఎంతో సహనంపాటించి తమ డిమాండ్లను ప్రభుత్వం సమ్మతించేట్టు చేసుకున్నారంటూ ''ఇదే సరైన మార్గం'' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులను వెనక్కులాగే బదులుగా ప్రగతిశీలమార్గంలో ముందుకు నడిపించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఒక నిబంధనల చట్రాన్ని అమలు చేసేందుకు విద్యారంగవ్యవస్థలో మార్పులు తీసుకువస్తామని రాహుల్‌గాంధీ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హిందీలో ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. ''జార్ఖండ్ విద్యార్థులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒక ఒప్పందం కుదిరింది, విద్యార్థులు తమ నిరాహార దీక్ష విరమించారు,ఈ వార్త మనసుకు ఎంతో సంతోషం కలిగించింది, హృదయానికి హత్తుకునేలా ఉంది'' అని రాహుల్ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ''ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌జీ,జార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గం ఎన్నుకుని ఒక పరిష్కారాన్ని సాధించారు, విద్యార్థులు ఎంతో సహనం పాటించారు,తమ డిమాండ్లను ఆమోదింపజేసుకున్నారు'' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. ఇదే సరైన మార్గం, విద్యార్థులు ప్రశ్నలు సంధించినప్పుడు వారికి సమాధానాలు ఇవ్వాలి అని రాశారు. ''దేశంలో ప్రతి విద్యార్థికీ మేం మద్దతు ఇస్తాం, వారి పక్షాన నిలబడతాం,తప్పుల తడకలతో ఉన్న వ్యవస్థను పునాదులతో తొలగించి పరివర్తన వ్యవస్థను పునరుద్ధరిస్తాం,ఆ విధంగా ప్రతి విద్యార్థికీ న్యాయం జరుగుతుంది, ప్రతి విద్యార్థి కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది,వారి న్యాయబద్ధమైన పోటీ హక్కుకు ఫలితం లభిస్తుంది'' అని పేర్కొన్నారు.

# బిసిల గురించి మాట్లాడే నైతిక అర్హత బిజెపికి లేదు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిల గురించి మాట్లాడే నైతిక అర్హత బిజెపికి లేదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. బిజెపి జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. బిసిల గురించి మాట్లాడుతున్న బిజెపి నాయకులు ముందుగా తమ పార్టీలో సామాజిక న్యాయం అమలు చేస్తున్నారో లేదో చూసుకోవాలని సూచించారు. బిసిలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఐలయ్య అన్నారు. ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్ష పదవి నుంచి డాక్టర్ లక్ష్మణ్‌ను ఎందుకు తొలగించారో బిజెపి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను తొలగించి కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించిన విషయాన్ని ఆ పార్టీ నేతలు మరిచిపోయారా అని ప్రశ్నించారు. రెడ్డి బిడ్డ అయినప్పటికీ సిఎం రేవంత్‌రెడ్డి బిసిల సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం కృషి చేస్తున్నారని అయిలయ్య అన్నారు. 1931 తర్వాత తెలంగాణలో బిసి కులగణన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపామని తెలిపారు. బిసి అని చెప్పుకునే ప్రధాని మోదీ తెలంగాణ బిసిలకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్రం బిసి రిజర్వేషన్ బిల్లును ఆమోదించి ఉంటే తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సిఎం బిసిలకు రాజకీయంగా 50 శాతం అవకాశం కల్పించారని చెప్పారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడలేని బిజెపి నాయకులు ధైర్యం లేని వారుగా మిగిలిపోయారని ఐలయ్య వ్యాఖ్యానించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయడంతో పాటు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను నెక్లెస్‌రోడ్డులో ఆవిష్కరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఈ చర్యలన్నీ బిసిలపై సిఎం రేవంత్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలని బీర్ల ఆయన హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు రూ.230కే సిమెంట్ బస్తా

పేదల ఇళ్ల నిర్మాణానికి పరిశ్రమల చేయూత

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు సిమెంట్ తక్కువ ధరకే అందించేందుకు సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు వచ్చాయి. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సిమెంట్ కంపెనీల యాజమాన్యాలతో సమావేశమై, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై చర్చించారు. మంత్రి విజ్ఞప్తి మేరకు యాజమాన్యాలు ఒక్కో బస్తాను రూ.230కే ఇచ్చేందుకు అంగీకరించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, ఆత్మగౌరవాన్ని కల్పించే బృహత్తర యజ్ఞమని అభివర్ణించారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయినట్లు తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు, అలాగే 16 నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్స్‌కు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. 100 శాతం సబ్సిడితో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి అన్నారు.

ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దవచ్చని ఆకాంక్షించారు. సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్‌తో పాటు సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

# ఏజెన్సీ గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏజెన్సీ ప్రాంతాలను దేశానికే ఆదర్శంగా నిలిచే గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వం వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళా సర్పంచుల కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ శిక్షణలో పీసా చట్టం, గ్రామసభల ప్రాధాన్యత, సర్పంచుల విధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాధారణ పంచాయతీలకు, షెడ్యూల్డ్ ఏరియా పంచాయతీలకు మధ్య చాలా తేడా ఉంటుందని, ఏజెన్సీ ప్రాంతాల ప్రజల జీవన విధానం, సంస్కృతిని దృష్టిలో పెట్టుకొని పాలన సాగించాలని సూచించారు.

పీసా చట్టం ద్వారా గ్రామసభలకు కల్పించిన ప్రత్యేక అధికారాలను సర్పంచులు అర్థం చేసుకొని ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని కోరారు. 'మీరు కేవలం సర్పంచులుగా కాకుండా మీ గ్రామాల మార్గదర్శకులుగా నిలవాలి' అని ఆమె అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజల ఆదాయం, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత కూడా అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకాలను స్థానిక అవసరాలకు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై వేధింపుల నిరోధం, పిల్లల విద్య వంటి అంశాలపై గ్రామసభల్లో చర్చించి సామూహిక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఇప్పపువ్వు లడ్డూ, మిల్లెట్స్ బిస్కెట్‌ల వంటి సంప్రదాయ ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మహిళలకు ఆదాయ మార్గాలు కల్పించవచ్చని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని మంత్రి సూచించారు.

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంసిహెచ్‌ఆర్‌డి డిజి శాంతికుమారి, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, కోఆర్డినేటర్ సీతారాములు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ చర్యలు అమలు చేయాలి : సిడిఎంఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో (యుఎల్‌బిలు) పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన సంక్షేమ సదుపాయాలను తప్పనిసరిగా అమలు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సిడిఎంఎ) అన్ని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ చేసిన విజ్ఞప్తి, అలాగే గతంలో జారీ చేసిన సర్క్యులర్‌ను ప్రస్తావిస్తూ ఈ ఆదేశాలు వెలువడ్డాయి. గతంలో ఇచ్చిన సూచనలు కొన్ని పట్టణ స్థానిక సంస్థల్లో సక్రమంగా అమలు కావడం లేదని గుర్తించినందున వాటిని మరోసారి పునరుద్ఘాటించినట్లు సర్క్యులర్‌లో పేర్కొన్నారు. సర్క్యులర్ ప్రకారం, కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెల ఈపిఎఫ్, ఈఎస్‌ఐ ఉద్యోగి, యజమాని వాటాలను సకాలంలో జమ చేయడంతో పాటు, ఈపిఎఫ్ వెబ్‌సైట్‌లో వివరాలను నవీకరించాలి. అలాగే పిఎఫ్ చెల్లింపు స్లిప్‌లను కార్మికులకు అందజేయాలని సూచించారు. డిఏ బకాయిల నుంచి మినహాయించిన మొత్తాన్ని కూడా సంబంధిత పిఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, ఆయిల్, సబ్బులు, చెప్పులు వంటి రక్షణ సామగ్రి, సంక్షేమ వస్తువులను క్రమం తప్పకుండా అందజేయాలని స్పష్టం చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంవత్సరానికి 15 రోజుల సాధారణ సెలవులు (క్యాజువల్ లీవ్) వేతన కోత లేకుండా మంజూరు చేయాలని పేర్కొన్నారు. వారానికి ఒక రోజు వారాంతపు సెలవుతో పాటు, సంవత్సరానికి ఎనిమిది జాతీయ, పండుగ సెలవులను కూడా కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) నిబంధనల ప్రకారం రొటేషన్ విధానంలో కల్పించాలని ఆదేశించారు. ఈ సంక్షేమ చర్యలను అన్ని పట్టణ స్థానిక సంస్థలు తప్పనిసరిగా అమలు చేసి, అర్హులైన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చట్టబద్ధమైన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సిడిఎంఎ సూచించారు.

# ఆర్‌టిసి లైసెన్స్‌డ్ పోర్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి బస్టాండ్లలో ఏళ్ల తరబడి ప్రయాణికులకు సేవలందిస్తున్న లైసెన్స్‌డ్ పోర్టర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారికి తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆర్‌టిసి లైసెన్స్‌డ్ పోర్టర్స్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.నరసింహ మాట్లాడుతూ ఎండనక, వాననక నిరంతరం శ్రమిస్తున్న పోర్టర్ల సంక్షేమాన్ని ప్రభుత్వం,ఆర్‌టిసి యాజమాన్యం విస్మరించడం సరికాదన్నారు. లైసెన్స్‌డ్ పోర్టర్లందరికీ పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు కూలీ రేట్లను పెంచాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పోర్టర్ల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు హెల్త్ ఇన్సూరెన్స్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్లలో పోర్టర్లు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా రెస్ట్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని నర్సింహా డిమాండ్ చేశారు.

**రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ:** ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో నిర్వహించనున్న ఎఐటియుసి 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ జి. దాస్, యూనియన్ ముఖ్య నాయకులు సీతయ్య, శ్రీను, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు

# మంత్రుల మాటలన్నీ అబద్ధాలే..

ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపైన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మాటలు అంతా అబద్దాలేనని, చట్టాలకు, జీవోలకు వారికి తేడా తెలిదని బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి తరహా మంత్రులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వంలో ఏం జరుగుతుందో చెప్పాలని, తద్వారా ప్రజలు 'మిమ్మల్ని' కాపాడుకుంటారని సూచించారు. మంత్రులు సిఎం రేవంత్ రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నించొద్దన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుంచి భారతదేశంలో 90 శాతం పథకాలు జీవోల ఆధారంగా అమలవుతున్నాయన్నారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి ,మూసీ రివర్ డెవలప్‌మెంట్, పథకాలు జీవోల ద్వారానే అమలవుతున్నాయన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు సుమిత్రానంద్ ,చారులత ,కాల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్ ,రాంచంద్రనాయక్ ,తుంగబాలు ,మమత తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపుల కేసు కొట్టేయండి

హైకోర్టులో దానం లాయర్ వాదన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ సభ్యత్వం కొనసాగుతోం దానం నాగేందర్ తరపు న్యాయవాది ఇప్పటివరకు రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా ఆయన తీసుకోలేదని ఆయన తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. కేవలం ఫొటోలు, మీడియా కథనాల ఆధారంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించి అనర్హత విధించడం సాధ్యం కాదని వాదించారు. దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాశ్‌గౌడ్, ఎ. గాంధీ, తెల్లం వెంకటరావు, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఆ నిర్ణయాలను సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభాపక్ష నేత దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. దానం తరపున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదిస్తూ.. 2024 మార్చి 15న ముఖ్యమంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులను దానం కలిశారని, కాంగ్రెస్ కండువా ధరించారని పేర్కొంటూ కొన్ని పత్రికా కథనాలను సమర్పించారని తెలిపారు. అయితే కాంగ్రెస్‌లో చేరినట్లు దానం స్వచ్ఛందంగా ఎక్కడా ప్రకటించలేదన్నారు. వార్తా కథనాలు మాత్రమే పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారించేందుకు సరిపోవని పేర్కొన్నారు. అనర్హత పిటిషన్‌లో లేని ఆరోపణలను అదనపు అఫిడవిట్ ద్వారా చేర్చడంలోని చట్టబద్ధతను కూడా పరిశీలించాల్సి ఉందన్నారు. దానం బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేయలేదని, పార్టీ నుంచి బహిష్కరణ లేదా సస్పెన్షన్‌కు సంబంధించిన సమాచారం కూడా లేదన్నారు. శాసనసభ బులెటిన్‌లో ఇప్పటికీ ఆయనను బీఆర్ఎస్ సభ్యుడిగానే చూపిస్తున్నారని తెలిపారు. దానం పార్టీ ఫిరాయించారని చెబుతున్న బీఆర్‌ఎస్ నుంచి స్పీకర్‌కు ఎలాంటి ఫిర్యాదు లేదా చర్య తీసుకోవాలన్న అభ్యర్థన రాలేదని న్యాయవాది పేర్కొన్నారు. పార్టీ తరపున అనర్హత పిటిషన్ దాఖలు చేసేందుకు పిటిషనర్లకు అధికారిక అనుమతి కూడా లేదన్నారు. అసెంబ్లీ వెలుపల వ్యక్తిగతంగా రాజకీయ నాయకులను కలవడం, ఇతర కార్యకలాపాలు నిర్వహించడం వంటివి అసెంబ్లీ కార్యకలాపాల పరిధిలోకి రావని వాదించారు. అనర్హతకు సంబంధించిన ప్రధాన అంశం మార్చి 15న పార్టీ ఫిరాయింపు జరిగిందా లేదా అన్నదేనని తెలిపారు. బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష సభ్యత్వ రుసుమును పార్టీ స్వీకరించిందని, లోక్‌సభ ఎన్నికల్లో మరో పార్టీ నుంచి పోటీ చేయడంపై రాజ్యాంగంలో స్పష్టమైన అనర్హత నిబంధన లేదన్నారు. ఊహాజనిత అంశాల ఆధారంగా ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించలేరని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం పైశాచికత్వం: కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి తన పైశాచికత్వాన్ని నిరూపించుకుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టుగా పోలీసులు నడుచుకోవద్దని, చట్టాన్ని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని కెటిఆర్ హెచ్చరించారు.

# సొసైటీ ఎన్నికలకు మార్గం సుగమం

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియను కొనసాగించేందుకు హైకోర్టు అనుమతించింది. మార్చి 18న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీని ఆదేశించింది. గతంలో ఎక్కడైతే ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందో అక్కడి నుంచే తిరిగి ప్రారంభించి ఎనిమిది వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో మార్చి 18న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌పై ఏప్రిల్‌లో సింగిల్ జడ్జి స్టే విధించారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ సొసైటీ దాఖలు చేసిన అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ సి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం మంగళవారం తీర్పు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఆదేశాలను రద్దు చేసింది. 2024లో సభ్యత్వం పొందిన 270 మందికి ప్రత్యేకంగా పోలింగ్ నిర్వహించాలని ధర్మాసనం ఆదేశించింది. వారి ఓట్లను ప్రత్యేకంగా బ్యాలెట్ బాక్సుల్లో భద్రపరచాలని, తుది ఓటర్ల జాబితాలోని మిగిలిన సభ్యుల ఓట్లను కూడా విడిగా భద్రపరచాలని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫలితాలను చట్టప్రకారం ప్రకటించాలని స్పష్టం చేసింది. ఎన్నికల ఫలితాలపై అభ్యంతరాలు ఉన్నవారు ఫలితాల ప్రకటన అనంతరం ఎన్నికల పిటిషన్ ద్వారా సవాలు చేసుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. ప్రత్యేకంగా పోలింగ్ నిర్వహించిన 270 మంది నూతన సభ్యుల ఓట్లు ఫలితాలను ప్రభావితం చేస్తే ఆ అంశాన్ని కూడా ఎన్నికల పిటిషన్‌లోనే తేల్చుకోవాలని తెలిపింది. అదేవిధంగా 887 మంది సభ్యుల అనర్హతకు సంబంధించి అభ్యంతరాలుంటే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని పేర్కొంది. నూతన సభ్యత్వాలపై అభ్యంతరాలను కూడా సంబంధిత చట్టబద్ధ అధికారి ముందు సవాలు చేసుకునే అవకాశం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో 'టిమ్స్' మరింత ఆలస్యం

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన తొమ్మిదనరేళ్ల కాలంలో రెండేళ్లు కరోనా సమయమేపోయిందని, మిగిలిన ఏడున్నరేళ్ల కాలంలో కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి తెలిపారు. టిమ్స్‌ఆ స్పత్రి ఏర్పాటు ఆలోచన, స్థలాల గుర్తింపు, భూసేకరణ బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పూర్తి చేశామని, సమస్యలను పరిష్కరించామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత టిమ్స్ పనుల విషయంలో ఆలస్యం జరిగిందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ అన్నీ సిద్ధం చేసిన, చేపట్టిన పనులను పూర్తిచేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్ల పాటు పట్టిందని ఎద్దేవా చేశారు. ఏడాదికాలంలోనే పూర్తి కావాల్సిన సనత్‌నగర్ టిమ్స్ ప్రాంభోత్సవానికి రెండేళ్ల కాలం పట్టిందని అన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో 2వేల పడకల విస్తరణ ప్రణాళిక కేసీఆర్ పాలనలో మొదలైందన్నారు. సమావేశంలో బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్ రెడ్డి,గాదరి కిషోర్ కుమార్, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్,వాల్యానాయక్ , బిఆర్ఎస్ నాయకులు గోసుల శ్రీనివాస్ యాదవ్ ,అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.



## విద్యార్థులకు క్రమశిక్షణ, సహాయక వ్యవస్థలపై వివరణ : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** నూతన విద్యార్థులకు విద్యా విధానం, ప్రాంగణం నైపుణ్యాభివృద్ధి ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఆగస్టు 16,17 తేదీల్లో రెండు రోజుల బీటెక్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. 2,500 మందికి పైగా విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ కృత్రిమ మేధ సైబర్ భద్రత సమాచార సాంకేతికత, విద్యుత్ ఎలక్ట్రానిక్స్ పౌర యాంత్రిక ఇంజినీరింగ్ విభాగాల విద్యార్థులకు విద్యా విధానం, పరీక్షలు, క్రమశిక్షణ, ప్రాజెక్టులు ఉద్యోగ అవకాశాలను వివరించారు. ప్రాంగణంలోని విద్యార్థి సంఘాలు, ప్రాజెక్టులు ఆవిష్కరణలను సందర్శించారు. డీన్ డా. వి.విజయ కుమార్, ప్రొఫెసర్ ఎం ముత్తారెడ్డి, ప్రొఫెసర్ కె సుధీర్ రెడ్డి, డా.సిద్ధార్థ ఘోష్, అనురాగ్ పల్లా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి, ప్రసంగించారు.ఉపకులపతి డా.అర్చనా మంత్రీ, కులపతి ప్రొఫెసర్ యుబి దేశాయ్,చైర్మన్ డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి,ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.నీలిమ విద్యార్థులకు దిశానిర్దేశం నిర్వహించి విద్యార్థుల విద్యా ప్రయాణం, క్రమశిక్షణ సహాయక వ్యవస్థలపై వివరించారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డా.మహీపతి శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

## నిషేధిత భూ అర్జీలను పరిష్కరించాలి

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** 22 ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన ప్రయివేట్ భూముల ఆస్తుల క్లియరెన్స్ సంబంధించిన 335 జిఓలను ఆన్‌లైన్‌లో పొందుపరచామని,వీటి ఆధారంగా నిషేదిత భూముల ధరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం ఆల్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 22 ఏలో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను పరిశీలించారు. లింక్ డాక్యుమెంట్లతో సరి చూసుకొని యూఎల్‌సి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యుఎల్‌సిలో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను త్వరితగతంగా తొలగించేందుకు ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ధరఖాస్తులు వచ్చాయి,ఎన్నింటిని పరిష్కారించారు, మరెన్ని మిగిలి పోయాయని అధికారులను అడిగి తెల్సుకొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, ఆల్వాల్ తహసీల్దార్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి అక్షరాస్యత లక్ష్యాన్ని చేరుకోవాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లాలో పూర్తిస్థాయి అక్షరాస్యత సాధించేందుకు ఆయా మున్సిపాలిటీ అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. జిల్లాలో 27305 మందిని అక్షరాస్యులు చేయాలన్న లక్ష్యం ముందుందని, ఒక్కో మున్సిపాలిటీకి 1111 మంది లక్ష్యం అని చెప్పారు. కలెక్టరేట్‌లో



జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలని, యుఎల్‌ఎల్‌ఏఎస్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలని, అభ్యాసకులకు ఓరియంటేషన్ సమావేశాలు నిర్వహించాలన్నారు. వయోజన విద్య డిప్యూటి డైరెక్టర్ మాట్లాడుతూ అందరికి విద్య అందించటమనేది అందరి బాధ్యత అని, మన సమీప ప్రాంతాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న వారిని అక్షరాస్యులుగా చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ శంభశివరావు, మైనారిటీస్ సంక్షేమ శాఖాధికారి కాంతమ్మ, డిఈఓ రేణుక,లు పాల్గొన్నారు.



## నిషేధిత భూ బాధితులకు బిఆర్ఎస్ అండ

### మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజలకు క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉండేలా 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించాలంటూ మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు డిమాండ్ చేసారు. రాత్రికి రాత్రే కాలనీల్లో నివసించే ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేరిస్తే అక్కడ నివసించే ప్రజలు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. ఈ సమస్య పరిష్కారానికిగాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు పనిచేయటం లేదని, అయితే తమ బిఆర్ఎస్ పార్టీ మాత్రం నిషేధిత భూములను తిరిగి ఇప్పించే వరకు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. దీనికి బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరిలో నిషేదిత భూముల బాధితులతో నిర్వహించిన భారీ సమావేశానికి అంబర్‌పేట, ఉప్పల్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి, ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్‌లతో కల్సి హరీష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగించేందుకు ధరఖాస్తుల పేరిట కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో దాదాపు 30 వేల కుటుంబాలకు చెందిన భూములు నిషేదిత జాబితాలో చేరాయన్నారు. సంవత్సరాల తరబడి కష్టార్జితంతో కొనుగోలు చేసిన తమ భూములు నిషేదిత జాబితాలో చేరాయన్న విషయం తెల్సుకొని లబోదిబో అంటున్నారన్నారు. పిల్లల వివాహాలు, ఉన్నత విద్య, వైద్యం లాంటి అవసరాల కోసం తమ ఆస్తులను విక్రయించేందుకు రిజిస్ట్రేషన్లు జరుగక పోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తక్షణమే రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్, సబితా అనిల్ కిషోర్‌గౌడ్, మేకల సునిత, జగదీష్ గౌడ్, శిరిష జితేందర్‌రెడ్డిలతో పాటు బిఆర్ఎస్ శ్రేణులు బద్దం పరశురారెడ్డి, జికె హన్మంతరావు, నిషేదిత భూ బాధితులు హాజరయ్యారు.

# ఫైర్ ఎన్‌ఒసి ప్రక్రియలో సాంకేతికతకు పెద్దపీట

సరళీకృత ప్రొవిజనల్ ఎన్‌ఒసిలతో వేగవంతమైన అనుమతులు

ఇఎస్‌సిఐలో వర్క్‌షాప్.. 800 మంది హాజరు







**ప్రజాపక్షం/హైదరాబాద్:** అగ్నిమాపక భద్రతా అనుమతుల జారీ ప్రక్రియను మరింత సరళంగా, పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు తెలంగాణ ఫైర్ సర్వీసెస్ శాఖ సాంకేతికత ఆధారిత విధానాలపై దృష్టి సారించింది. ప్రొవిజనల్ ఫైర్ ఎన్‌ఒసిల జారీని సులభతరం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే దిశగా గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సరళీకృత ప్రొవిజనల్ ఎన్‌ఒసిలు, నూతన సాంకేతికతల స్వీకరణ అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, అదనపు డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు క్రెడాయ్, నరెడ్కో, ఎఫ్ఎస్ఎఐ ప్రతినిధులు, నిర్మాణ, ఫైర్ సేఫ్టీ, అనుబంధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రొవిజనల్ ఫైర్ ఎన్‌ఒసి పొందే విధానం, నూతన సాంకేతికతల వినియోగంపై అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. అనుమతుల ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించడం, పారదర్శకతను పెంచడం, ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై చర్చించారు. ఫైర్ సర్వీసెస్ శాఖ, డెవలపర్లు, కన్సల్టెంట్లు, ఫైర్ సేఫ్టీ నిపుణులు, ఇతర భాగస్వాముల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని వివరించారు. ఫైర్ ప్రొటెక్షన్ సర్వీస్ ప్రొవైడర్లు, ఇతర భాగస్వాములతో పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, విధానపరమైన సందేహాలు, అనుమతుల ప్రక్రియలో ఉన్న ఇబ్బందులపై చర్చించారు. ఫైర్ సేఫ్టీ అనుమతుల వ్యవస్థను మరింత సరళీకరించేందుకు పలువురు తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. వర్క్‌షాప్‌కు సుమారు 800మంది హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన జిల్లా ఫైర్ అధికారులు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారులు కూడా పాల్గొన్నారు. దీంతో ఫైర్ సేఫ్టీ రంగంలో జ్ఞానాన్ని పంచుకోవడం, అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం, ఉత్తమ విధానాలను అమలు చేయడానికి ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. ప్రొవిజనల్ ఫైర్ ఎన్‌ఒసి ప్రక్రియలను సరళీకరించడం, నూతన సాంకేతికతలను వినియోగించడం, పారదర్శకతను పెంచడం, భాగస్వాముల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంతో అగ్నిప్రమాదాల నివారణ చర్యలను పటిష్టవంతం చేయవచ్చని వర్క్‌షాప్‌లో స్పష్టం చేశారు. సాంకేతికత ఆధారిత, భాగస్వాములకు అనుకూలమైన విధానాలతో ఫైర్ ఎన్‌ఒసి వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, వేగంగా స్పందించే విధంగా తీర్చిదిద్దడంపై కార్యక్రమం ముగింపు సందర్భంగా అధికారులు దృష్టి సారించారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 'చలో ఢిల్లీ'

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలో పేదరికం తీవ్రమై, సామాన్య ప్రజలు అపార కష్టాల్లోకి నెట్టబడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, పాలనలో మార్పు తీసుకురావాలనే నినాదంతో ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాప్రా మండల కౌన్సిల్ సమావేశం గిరిప్రసాద్ భవన్‌లో మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమా మహేష్ మాట్లాడుతూ, బడా వ్యాపార వర్గాల నుండి బిజెపి కోట్ల రూపాయల చందాలు స్వీకరిస్తూ వారికి మాత్రమే ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరగబోయే "చలో ఢిల్లీ" ప్రదర్శనను జయప్రదం చేయడానికి జవహర్ నగర్ ప్రజలు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

**రోడ్డు పనులు పూర్తి కాకపోతే ఉద్యమం**

జవహర్ నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డ్ కాలుష్యంతో నరకయాతన అనుభవిస్తున్న ప్రజలకు, రోడ్డు దుమ్ము తోడై తీవ్ర ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలు కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వెంకటాచారి, సహాయ కార్యదర్శులు రాజేశ్వరి, లక్ష్మి నారాయణ, ఎఐటియుసి నాయకులు ఎలన్న, నర్సింహా, గిరిజన సమాఖ్య అధ్యక్షురాలు లత, యువజన సంఘం నాయకులు లక్ష్మణ్, నానిలతో పాటు సీనియర్ నాయకులు అనసూయ, మాధవి, కవిత, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అరాచకాలను ప్రభుత్వం అరికట్టాలి

### మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి జె లక్ష్మి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలపై జరుగుతున్న అరచాకాలు, హింస, వివక్షతను రూపుమాపడానికి ప్రభుత్వం నూతన కఠినమైన చట్టాలను తీసుకరావాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి జె లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శామీర్‌పేటలోని మినిస్టేడియంలో పుట్టా మనేమ్మ అధ్యక్షతన భారత జాతీయ మహిళా సమాఖ్య శామీర్‌పేట మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మాణాలు చేశారు. మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలి.

మహిళలకు ఉచిత లైదా నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీ రుణాలు, ఉపాధి మరియు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మహిళలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలను తీర్మానించారు. అలాగే నూతన కమిటిని ఎన్నుకున్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) మండల నాయకురాలు, గౌరవ అధ్యక్షులుగా డిజి నాగరాణి గౌడ్, అధ్యక్షురాలిగా పుట్ట మనేమ్మ, సహాయ కార్యదర్శి గా సలేంద్ర నాగరాణి, సుదాగాని మమత, మండల కార్యదర్శి కొట్నాల నిర్మల, కోశాధికారి గాయత్రి, దూలకంటి లావణ్య, నాగరాణిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ఎఐకెఎస్ కార్య నిర్వాహణ కార్యదర్శి డిజి నరేందర్ ప్రసాద్, మహిళా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటింగ్‌పై అధ్యాపకులకు శిక్షణ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కృత్రిమ మేధస్సు అధిక సామర్థ్య కంప్యూటింగ్ మేధో వ్యవస్థలు వంటి ఆధునిక సాంకేతికతలపై అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆరురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి శిక్షణ అభ్యసన అకాడమీ సహకారంతో ఆగస్టు 17 నుంచి 22 వరకు కార్యక్రమం కొనసాగనుంది. జెఎన్‌టియు హెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సుల్తాన్‌పూర్ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ డా.ఎస్ విశ్వనాథరాజు, ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేపీఆర్ఈఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా.సి.డి నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సు ధీర్ ప్రేమ్ కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్ శ్రీనాథ్ క్యప్, ఉపప్రిన్సిపాల్ వై విశ్వశ్రీ, సమన్వయకర్త డా.పులిమే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు చీరల పంపిణీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** బోనాల పర్వదిన సందర్భంగా మౌలాలి డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీమతి పోతుల ఉమా మహేశ్వరి వినోద్ యాదవ్ జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ చేసారు. ప్రజల ఆరోగ్యం పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు





**ప్రజాపక్షం/చర్లపల్లి:** బహురాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడ సంఘం నాయకులు అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని చిన్నచర్లపల్లి కల్లు కంపౌండ్ వద్ద,పెద్ద చర్లపల్లి చౌరస్తాలో సర్దార్



సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి గౌడ సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాలు, సేవలు నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందంటూ పాపన్న గౌడ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వారన్నారు.

ఈ కార్యక్రమంలో రుద్రగోని రాంచందర్ గౌడ్, బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్, నిమ్మల అశోక్‌గౌడ్, కాసులు శశికాంత్‌గౌడ్, రాగీరు బాబుగౌడ్, రాగీరు నాథంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**జవహర్ నగర్‌లో :** భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడని మాజీ మేయర్ మేకల కావ్య కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని జవహర్ నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ లో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండల్ ముదిరాజ్, జిట్టా శ్రీనివాస్ రెడ్డి, సంగీతారాజశేఖర్, రవి, వెంకటేష్ గౌడ్, బాల్‌రాజ్, సిద్ధులు యాదవ్, ప్రసాద్ గౌడ్, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

**బొంరాస్పేట్‌లో :** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్పేట్ మండల పరిధిలోని తుంకిమెట్ల చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ బొంరాస్‌పేట్



మండల బిసి సెల్ ప్రెసిడెంట్ రవిగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోట్ల యాదగిరి, మాజీవైస్ యంపిపినారాయణరెడ్డి, మహేందర్ రెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్‌లో:** సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్‌తివారి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన సామాజిక సమానత్వం, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్, తదితరులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో:** మూడుచింతలపల్లి మున్సిపల్‌లో స్థానిక కౌన్సిలర్ నీరజ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు స్థానిక మున్సిపల్ చైర్మన్ జాం రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర



మంలో మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, నాయకులు వెంకట నర్సింహారెడ్డి, దత్తుగౌడ్, భూమేష్‌గౌడ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## నాగారంలో ఎంఎంసి కమిషనర్ పర్యటన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లిలో పర్యటించి పారిశుద్ధ్య, అభివృద్ధి నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎస్ఏటి వాహనాల పనితీరు, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ అప్‌డేషన్ వివరాలు సమీక్షించారు. రాంపల్లిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు చేపడుతున్న రోడ్ వైడ్‌నింగ్ పనులు, గుంతలు, ప్యాచ్‌వర్క్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిడి వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల వెంట ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్సులను పరిశీలించి మొక్కలు లేకుండా ఖాళీగా ఉన్న బాక్సులను తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపునకు చేపడుతున్న పనులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిసి వాణిరెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ సమస్యల పరిష్కార లక్ష్యంగా పని చేయాలి

### జోనల్ కమిషనర్ రాధికా గుప్తా

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఉప్పల్ జోన్ పరిధిలో గుంతలను తక్షణమే గుర్తించి మరమ్మత్తులు చేయటం, వర్షపు నీరు ఎక్కడా నిలబడకుండా చూడటం, అవసరమైన ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌లను ఏర్పాటు చేయటంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా సూచించారు. మంగళవారం ట్రాఫిక్, ఇంజనీరింగ్, జాతీయ రహదార్ల విభాగం, జలమండలి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు తమ వంతుగా రహదార్లపై కనపడే గుంతల విషయాన్ని ఎంఎంసికి తెలియచేయాలని సూచించారు. షెల్‌మాక్ వినియోగిస్తూ వెంటవెంటనే గుంతల పూడ్చివేత,ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో పాటు ఫుట్‌పాత్‌లపై ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న దురాక్రమణలను తొలగించే విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు.




## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సిడిపిఒ

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నారెగూడ గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో చిన్నారులు,బాలింతలు,గర్భిణులకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం నవాబుపేట మండలం నారెగూడ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా నవాబుపేట్, అంగన్ వాడీ సూపర్ వేజర్ మణిమాల, షాలినితో కలిసి సీడీపీవో శ్రీలత పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దీపికదశరథ్, గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రానికి సంబంధించి సమస్యను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పి.ఎల్లమ్మ సుమారు రెండు నెలల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో కూడా టీచర్ పాల్గొనలేదని అన్నారు. అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా కొనసాగడం లేదని పేర్కొన్నారు. దీంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం, బాలామృతం తదితరాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త టీచర్‌ను నియమించి, నిలిచిపోయిన సేవలను వెంటనే పునరుద్ధరించాలని సర్పంచ్ దీపికదశరథ్, గ్రామస్తులు సీడీపీవో శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్, గ్రామస్తులు అందించిన నివేదికను పై స్థాయి అధికారులకు అందజేసి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని సిడిపిఓ శ్రీలత తెలిపారు.

## సింగయ్యపల్లిలో వివాహిత అదృశ్యం

### కేసు నమోదు చేసిన జవహర్ నగర్ పోలీసులు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** హకింపేట సింగయ్యపల్లి గ్రామానికి చెందిన షేక్ నజియా (30) అనే వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... నజియాకు కొన్నేళ్ల క్రితం సుభాని అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో సుభాని పిల్లలను తీసుకుని తన స్వగ్రామానికి వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 13న నజియా సింగయ్యపల్లిలోని తన తండ్రి ఖాజావల్లి ఇంటికి వచ్చింది. అనంతరం ఆగస్టు 14వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో బయటకు వెళ్ళి వస్తాను అని తండ్రికి చెప్పి వెళ్లిన నజియా తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలి తండ్రి జవహర్ నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అదృశ్యమైన మహిళ గురించిన సమాచారం తెలిసిన వారు స్థానిక జవహర్ నగర్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



## మానసిక వికలాంగురాలు అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఓ మానసిక వికలాంగురాలు అదృశ్యమైన ఘటన జవహర్ నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ వేముల అనూష, భర్త, పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఆమె కుమార్తె వేముల సాయి ప్రియ అలియాస్ గంగా(14) మానసికంగా బాధపడుతూ, ఇంటివద్దనే ఉంటుంది. ఈ నెల 17న తల్లి అనూష పనికోసమని బయటకు వెళ్లిన ఇంటికి వచ్చేలోపు సాయి ప్రియ కనిపించలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు తల్లి అనూష జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
19-08-2026
www.prajapaksham.in

బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది.

# రీల్




ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందిన కుకింగ్ ఫార్మాట్‌కు తమిళ నేటివిటీతో సరికొత్త రూపం.. సోనీ విజా, సోనీ లివ్‌లో ఆహారం, రుచులు, భావోద్వేగాలు, అనుబంధాలను సెలబ్రేట్ చేయడానికి తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులను ఒక్కచోటికి తీసుకొస్తున్న సమంత రూత్ ప్రభు సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తాజాగా 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'ను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ కుకింగ్ ఫార్మాట్‌ను తమిళ ప్రేక్షకుల కోసం సోనీ విజా, సోనీ లివ్‌లో స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు హోస్ట్ చేస్తుండటం విశేషం. సెలబ్రిటీలు, ఫుడ్ కాంపిటీషన్.. ఈ మూడు ప్రపంచాలను ఒకే దగ్గరకి తీసుకొస్తూ 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రూపొందుతోంది. తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు తొలిసారి సెట్స్ నుంచి కిచెన్‌లోకి అడుగుపెట్టి.. కఠినమైన వంటలకు సంబంధించిన సవాళ్లు, ఊహించని ట్విస్టులు, ఒత్తిడిని ఎదుర్కోబోతున్నారు. ప్రేక్షకులను మెప్పించడంతో పాటు.. ప్రతి ఛాలెంజ్‌లో విజయం సాధించేలా రుచికరమైన వంటకాలను తయారు చేస్తూ తమ టాలెంట్‌ను నిరూపించుకోబోతున్నారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ సమంత రూత్ ప్రభు హోస్ట్‌గా వ్యవహరిస్తూ..తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు కిచెన్‌లోకి అడుగుపెట్టనున్న 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్'.. సెలబ్రిటీ కుకింగ్‌కు సరికొత్త వినోదాన్ని తీసుకురానుంది అన్నారు .

## నా వర్క్ చూసి పవన్ కళ్యాణ్ నాతో మాట్లాడారు

### సంగీత దర్శకుడు అజయ్ అరసాడ



ఆయ్', 'సేవ్ ది టైగర్స్', 'వికటకవి', 'గుర్తుకొస్తున్నాయి' వంటి అద్భుతమైన ప్రాజెక్ట్‌లతో సంగీత దర్శకుడిగా అజయ్ అరసాడ తెలుగు ప్రేక్షకుల్లో ఓ ముద్ర వేశారు. వరస ఆఫర్‌లతో మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతోన్న అజయ్ అరసాడ తన సినీ జర్నీని పంచుకున్నారు. మా ఫ్యామిలీ, నా రక్తంలోనే ఆర్ట్, మ్యూజిక్ ఉంది. మాది వైజాగ్. టిసిఎస్‌లో ఉద్యోగం కూడా చేశాను. ఏడేళ్లు జాబ్ చేశాను. అలా జాబ్ చేస్తుండగానే రెండు సినిమాలకు పని చేశాను. నాకు దేవీ శ్రీ ప్రసాద్ స్ఫూర్తి. మా అమ్మ, భార్య సపోర్ట్ వల్లే నేను ఈ ఇండస్ట్రీలోకి రాగలిగాను. వైజాగ్‌లోనే శ్రీ చరణ్ నాకు మంచి ఫ్రెండ్ 'గూఢచారి'కి నన్ను కీబోర్డ్ ప్రోగ్రామర్‌గా తీసుకున్నాడు. చిన్న చిత్రాలకు పని చేయడం వల్ల నాకు ఎక్కడా ఇబ్బంది కలగలేదు. మంచి ప్రొడక్షన్స్ కావడం వల్ల ఎప్పుడూ కూడా పేమెంట్స్ విషయంలో తేడా రాలేదు. మొన్న మోదీ గారిని ఆయన కలిసినప్పుడు ఓ స్కోర్ చేశాను. నా వర్క్ చూసి ఆయన పిలిపించారు. ఆయనతో నాతో పర్సనల్‌గా మాట్లాడారు. పొలిటికల్‌గా అయినా సరే పీకే క్రియేటివ్స్ బ్యానర్ కోసమైనా సరే పని చేద్దామని ఆయన అన్నారు.



## నిధి అగర్వాల్ కొత్త సినిమా ప్రారంభం

నిధి అగర్వాల్ హీరోయిన్‌గా వరాహ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కనున్న కొత్త చిత్రాన్ని లాంచ్ చేశారు. మైథాలజీ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న చిత్రానికి సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పి. అశోక్, పి. రేణుక కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హుర్మత్ సర్నా క్లాప్ ఇచ్చారు. హీరోయిన్ నిధి అగర్వాల్ తోపాటు చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. పోస్టర్‌లో నిధి అగర్వాల్ లుక్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఇప్పటివరకు ఆమె కనిపించని కొత్త అవతార్‌ను పరిచయం చేసేలా ఉంది. హీరోయిన్ ఓరియంటెడ్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం దర్శకుడు పవర్‌ఫుల్ కథని సిద్ధం చేశారు.ఈ సినిమా టైటిల్‌తో పాటు మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు: శ్రీనివాస్ గోపిశెట్టి, నిర్మాత: సునీత్ పడోల్కర్.

## 'ది మేజ్' రివర్స్ టీజర్ వచ్చేసింది




తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యుఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. 'ది మేజ్' సినిమా రివర్స్ టీజర్ ఎలా ఉందో చూస్తే 'కన్ను మూసి తెరిచే సరికి ఈ ప్రపంచం అతన్ని గతాన్ని మాయం చేసింది..; అతను మాత్రమే నమ్మే నిజాన్ని కలగా మార్చేసింది...' అని చెబుతూ ఆసక్తికరంగా టీజర్ ప్రారంభమవుతుంది. నిద్రలో నుంచి ఉలిక్కి పడి లేచిన హీరో మదిలో అనేక సంఘటనలు మెదులుతుంటాయి. ఎవరూ నమ్మని, తను మాత్రమే నమ్మే కొన్ని నిజాలు, వాటి రుజువుల కోసం అతను అన్వేషణ సాగిస్తుంటాడు. కొంత మంది వ్యక్తులను వెంబడిస్తుంటాడు. హీరో భ్రమపడుతున్నాడని ఇతరులు అనుకున్నవి నిజంగా భ్రమలేనా ?, లేక హీరో బలంగా నమ్మినట్లు వాస్తవాలా ? ఈ సందిగ్ధ పరిస్థితులకు కారణం ఎవరు?, ఈ ప్రయాణంలో హీరోను నమ్మి వెనక అండగా ఎవరు నిలబడ్డారు? అతను ఎలా గాయపడ్డాడు? హత్యలను ఆపే హోమిసైడ్ ఇంటర్వెన్షన్ టీమ్ ఎవరి కోసం ఇన్వెస్టిగేషన్ చేస్తోంది? వంటి అంశాలు టీజర్‌లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి.

## 'సర్దార్ సర్వాయి పాపన్న' ప్రీ రిలీజ్ ఈవెంట్



బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈరోజు 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ను పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 21న ఆంధ్ర, తెలంగాణలో పెద్ద ఎత్తున ఈ చిత్రాన్ని మా ఆర్‌కె ఫిలింమ్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నాం. పన్నుల దోపిడీ నుంచి పేద ప్రజలను కాపాడిన వీరుడు సర్దార్ పాపన్న. బడుగు, వెనకబడిన కులాల వారిని ఒక్కటి చేసి పోరాడం సాగించాడు, 30 కోటలను జయించాడు. గోల్కొండ కోటపై కూడా తిరుగుబాటు చేశాడు. అలాంటి ధీరుడిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాల అన్నారు.దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడారు. హీరోయిన్ పాయల్ ముఖర్జీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగర్ ఏపూరి సోమన్న ప్రముఖ రచయిత, పాత్రికేయుడు పొన్న రవిచంద్ర మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్ తెలంగాణ శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్ పాల్గొన్నారు.

## 'చిరంజీవి' ట్రైలర్ విడుదల



కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా 'చిరంజీవి'. ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. 'చిరంజీవి' సినిమా ఈ నెల 28న గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మేకర్స్ ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. 'చిరంజీవి' సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే పుట్టిన వారు మరణించకతప్పదు, మరణించిన వారు జన్మించక తప్పదు అనే భగవద్గీత శ్లోకంతో ఆసక్తికరంగా ఈ ట్రైలర్ మొదలవుతుంది. కుడివైపు గుండె ఉండే ప్రాణాంతక వ్యాధి ఉన్నా హీరో చావు నుంచి అనేక సార్లు తప్పించుకుంటూ ఉంటాడు. అతని కోసం కొన్ని గ్యాంగ్స్ వెంటాడుతుంటాయి. స్పైడర్ మ్యాన్ గెటప్‌లో ఒక వ్యక్తి విలన్స్‌ను వేటాడుతుంటాడు. 'వేటాడేది పులినైతే వేస్ట్ చేసే ప్రతి బుల్లెట్‌కు ఒక వ్యాల్యూ ఉంటుంది..', వాడు చిరంజీవి చంపినా చావడు, చచ్చినా చావడు..' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి. చిరంజీవి అయిన హీరోను ఒక మహిళ తుపాకీతో కాలుస్తుంది. ఆమె ఎవరు? ప్రాణాలు తీయాలని చూసే విలన్స్ ఒకవైపు, ప్రాణాలు కాపాడాలని తపించే తల్లి, ప్రియురాలు మరోవైపు, ఈ సంఘర్షణలో ప్రాణాంతక వ్యాధి ఉన్న హీరో ఎలా విజయం సాధించాడు అనేది ట్రైలర్‌లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. హీరో కికు యనమల తన ఓవరాల్ పర్ ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు

# కేంద్ర ఉద్యోగుల పిల్లలకూ స్థానిక కోటా

**•ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల్లో కల్పించాలని హైకోర్టు స్పష్టీకరణ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు కూడా స్థానిక కోటా ప్రయోజనం కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, తెలంగాణ కేడర్ అఖిల భారత సర్వీసు అధికారుల పిల్లలకు రాష్ట్రం వెలుపల చదివినా స్థానిక కోటా వర్తింపజేస్తున్నప్పుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ఆ అవకాశం నుంచి మినహాయించడం హేతుబద్ధమైన వర్గీకరణ కాదని పేర్కొంది.
జీవో 150లోని నిబంధనలను వీలైనంత త్వరగా సవరించి కేంద్ర ఉద్యోగుల పిల్లలకు కూడా స్థానిక హోదా కల్పించాలని ఆదేశించింది.
హైదరాబాద్‌లో జన్మించిన కె. సంహిత తండ్రి ఈఎస్ఐ కార్పొరేషన్‌లో పనిచేస్తూ తిరుపతికి బదిలీ కావడం, అనంతరం హైదరాబాద్‌కు తిరిగి రావడంతో ఆమెకు స్థానిక కోటా వర్తించలేదు. దీనిని సవాలు చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది.
ప్రస్తుత నిబంధనల ప్రకారం తెలంగాణ వెలుపల చదివిన అభ్యర్థులకు కొన్ని మినహాయింపులు ఉన్నాయని ధర్మాసనం గుర్తుచేసింది. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, తెలంగాణ కేడర్ అఖిల భారత సర్వీసు అధికారులు, రక్షణ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల పిల్లలకు అలాంటి వెసులుబాటు ఉందని తెలిపింది. అదే ప్రయోజనాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు నిరాకరించడం సమంజసం కాదని పేర్కొంది. అడ్మిషన్ నిబంధనల్లోని రూల్ 3(ఎ)(3)ను సవరించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను కూడా స్థానిక కోటాలోకి తీసుకువస్తామని అడ్వొకేట్ జనరల్ హామీ ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఈ సవరణ పూర్తయ్యే వరకు సంహిత వంటి అభ్యర్థులు నష్టపోకుండా ప్రస్తుత ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపింది. 2026–27 విద్యా సంవత్సరంలో ఎంబిబిఎస్/బిడిఎస్ ప్రవేశాలకు సంహితను స్థానిక కోటా అభ్యర్థిగా పరిగణించి కౌన్సెలింగ్‌కు అనుమతించాలని కాళోజీ యూనివర్సిటీని ఆదేశించింది.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవన నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసిన జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. భవన అనుమతి ఫైల్‌ను ప్రాసెస్ చేసి, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేసేందుకు రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు ఆమెను పట్టుకున్నారు. ఎసిబి వెల్లడించిన వివరాల ప్రకారం.. చార్మినార్ జోన్, సంతోష్‌నగర్ సర్కిల్25లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ప్రభావతి భవన నిర్మాణ అనుమతికి సంబంధించిన అధికారిక పని చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎసిబి అధికారులు మంగళవారం వల పన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఆమె వద్ద నుంచి ఫిర్యాదుదారుడు ఇచ్చిన రూ.20 వేల లంచం మొత్తాన్ని ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు లంచం స్వీకరించినట్లు ఎసిబి పేర్కొంది.అనంతరం నిందితురాలిని నాంపల్లి స్పెషల్ ఎసిబి కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

### లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుడి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఉన్నత స్థాయి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఢిల్లీ, ఇతర ప్రాంతాలలో జరిగిన నిరసన ప్రదర్శనల సమయంలో లక్ష్యంగా చేసుకోబడ్డారని ఆరోపించిన మహిళా నిరసనకారుల ఫిర్యాదులు సహా ఆరోపణలను ఈ కమిటీ పరిశీలించనుంది. విద్యార్థి నిరసనకారులను ఇరికించే ఎఫ్‌ఐఆర్‌ల వివరాలను అందించాలని ధర్మాసనం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద కోర్టు తన సంపూర్ణ అధికారాలను వినియోగించుకోవచ్చని సూచిస్తూ, ఆ ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయనున్నట్లు తెలిపింది. 'విద్యార్థుల జీవితాలు ప్రమాదంలో ఉన్నాయి. మనం దీనిని పరిష్కరించాలి. వారికి ముందు ఒక భవిష్యత్తు ఉంది. ఆర్టికల్ 19 ప్రకారం నిరసన తెలిపే హక్కు వారికి ఉంది' అని క్షమాపణ చెప్పకుండానే విద్యార్థి నిరసనకారులపై ఉన్న కేసులను కొట్టివేయడాన్ని వ్యతిరేకించిన ఒక న్యాయవాదికి ధర్మాసనం ఈ విధంగా స్పష్టతనిచ్చింది. జులై 20నాటి నిరసనల సందర్భంగా జరిగిన హింసకు గతంలో ఘోరమైన నేరాలకు పాల్పడిన '2,800 మందికి పైగా సంఘ వ్యతిరేక శక్తులు కారణం' అని పోలీసులు గుర్తించినట్లు తుషార్ మెహతా చెప్పారు. ఆగస్టు 3న, విద్యార్థి నిరసనకారుల విడుదలపై తన ఉత్తర్వులో 'నేర చరిత్ర' అనే పదం కేవలం తీవ్రమైన, హేయమైన నేరాలకు పాల్పడిన వారిని మాత్రమే సూచిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే, మిగిలిన విద్యార్థులపై చట్టప్రకారం రాష్ట్రాలు ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవచ్చని తెలిపింది. కేంద్రం సమర్పించిన తర్వాత ఈ వివరణ వచ్చింది. ఢిల్లీలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సహా, నీట్ పరీక్ష లీక్ నిరసనలలో పాల్గొన్న విద్యార్థులకు నేర చరిత్ర లేనట్లయితే, వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయకూడదనే విషయంలో తీవ్రంగా ఉన్నారు. కేవలం ఆందోళన జరుగుతుందన్న కారణంతో పోలీసుల దురాగతాలను లేదా లాఠీఛార్జ్‌ను సమర్థించలేమని, శాంతియుత నిరసన తెలిపే హక్కుకు సంపూర్ణ హామీ ఉందని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. జులై 20న కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన మార్చ్‌లో నిరసనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన గుంపులను చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది లాఠీలు, భాష్పవాయుగోళాలను ప్రయోగించారు.

## జెన్–ఆల్ఫా నిరసన

(మొదటి పేజీ తరువాయి)

పరిమితమైన ఒక పనిని, అక్కడి పాఠశాల విద్యార్థులు వారి భుజస్కంధాలపై వేసుకుని ప్రారంభించారు. తమ సమస్యలను వీధుల్లోకి తీసుకువచ్చారు. ఇటీవలి వారాల్లో, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో స్కూల్ విద్యార్థులు పాఠశాలల తరలింపు, రవాణా ఖర్చుల వంటి పలు సమస్యలపై నిరసన గళాన్ని ఎలుగెత్తారు.ఈ నిరసన ప్రదర్శనలు భారతదేశ వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులు చేపడుతోన్న విస్తృత నిరసనల పరంపరలో ఒక భాగం అనవచ్చు. దీనిని స్థూలంగా చెప్పాలంటే, 2010 సంవత్సరం నుంచి జన్మించిన పిల్లలైన జనరేషన్ ఆల్ఫా మొట్టమొదటి స్పష్టమైన, బహుళ–రాష్ట్ర సమీకరణగా వారిని పలువురు అభివర్ణిస్తున్నారు. వివరాలలోకి వెళితే...మధ్యప్రదేశ్ రాష్ట్రం సెంట్రల్ విదిశా జిల్లాలోని సిరోంజ్ ప్రాంతంలో ఇటీవల నిరసనలు చేపట్టిన పాఠశాల విద్యార్థుల గురించి వార్తా కథనం తెలియజేస్తోంది. రాయితీతో కూడిన పాఠశాల బస్సు ఛార్జీలు పెంచాలన్న ప్రతిపాదనే ఈ నిరసనలకు తక్షణ కారణంగా నిలిచింది. ప్రైవేట్ ఆపరేటర్లు ఛార్జీని 10 నుంచి 20 రూపాయలకు పెంచమని కోరడం, ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బృందం నిరసలకు దారితీసింది. ఈ నిరసన సిరోంజ్ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక పాఠశాలలో ప్రజ్వరిల్లింది. పరిపాలనా యంత్రాంగం జోక్యం అనంతరం ఛార్జీల పెంపును రూ.10కు తగ్గించడం విద్యార్థుల పోరాట విజయకేతనమైంది.ఈ సంఘటన కేవలం దాని ఫలితంగానే కాకుండా, విద్యార్థులు తమ సమస్య నుండి సామూహిక కార్యాచరణకు ఎంత శరవేగంగా మారారనేది వారి పోరాటం రుజువు చేసింది. ఇంతకుముందు, తల్లిదండ్రులు, పాఠశాల అధికారులు, లేదా స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా పరిష్కరించబడాల్సిన విషయం, దానికి బదులుగా విద్యార్థులలోనే పోరాట చైతన్యం పెల్లుబికి ప్రజా నిరసనగా మారడం విశేషం. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ సొంత జిల్లా అయిన ఉజ్జయిన్‌లో ఈ మరో సమస్య, విద్యఅ అందుబాటుతో ప్రత్యక్షంగా ముడిపడి ఉంది.దావూద్‌ఖేడి ఏరియాలోని అనేక చిన్న ప్రభుత్వ పాఠశాలలను ఒక పెద్ద ప్రభుత్వ పాఠశాలతో విలీనం చేయడానికి లేదా తరలించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికలకు వ్యతిరేకంగా వందలాది మంది బాలికలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వెలుపల నిరసన తెలపడం చర్చనీయాంశమైంది.

## ఎంఓయు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చెలరేగినప్పుడే ట్రంప్ చెప్పారు.ఐతే ఎంఓయుపై సంతకాలు జరిగిన తర్వాత బహుముఖ చర్చల ద్వారా వివిధ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఉద్దేశించిన 60 రోజుల గడువు సమయం మొన్నటితో ముగిసిపోయింది. ఎలాంటి పొడిగింపూ లేకుండా ఈ గడువు ముగిసిపోయిన తర్వాత ట్రంప్ ప్రకటన చేస్తూ ఎంఓయు రద్దు చేశామని,ఇరాన్ పాలకులు యుద్ధం ముగించేందుకు చర్చల ద్వారా లొంగిపోవాలని, తెల్లజెండాలు ఎగురవేయాలని పిలుపు ఇచ్చారు. దీంతో ఇరాన్ పాలకులు తీవ్రస్థాయిలో స్పందించారు. ''ఇస్లామాబాద్ ఒప్పందం'' అమలు చేయకపోతే తాజా దాడులు చేస్తామని హెచ్చరిక చేశారు. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో నౌకలపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్స్ దాడులు చేశాయి. ఈ దాడులలో నావికాదళ సిబ్బంది పలువురు గాయపడ్డారు. ఈ ఉద్రిక్తతలమధ్య చమురు ధర మళ్ళీ భారీగా పెరిగింది. బంగారం ధర కూడా పైకి ఎగబాకింది.
''ఇస్లామాబాద్ ఎంఓయు''పై జూన్ 17–18 తేదీలలో మధ్యవర్తిదేశం పాకిస్థాన్ సహా అమెరికా,ఇరాన్ నాయకులు సంతకాలు చేశారు. తర్వాత జెనీవాలో చర్చలు మొదలయ్యాయి. కానీ హోర్ముజ్ జలసంధిలో కొత్త మార్గాల ఏర్పాటు చేయడంతో ఘర్షణ మళ్ళీ మొదటికి వచ్చిన తర్వాత ఎంఓయును అమెరికా పక్కకునెట్టి మళ్ళీ ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం అమలు చేయడం ప్రారంభించింది. ఈ దిగ్బంధనం ఈనాటికీ కొనసాగుతోంది. జులై ఏడోతేదీనే ఈ ఎంఓయుకు కాలం చెల్లిందని ట్రంప్ ఫాక్స్‌న్యూస్‌కు చెప్పారు.

## షరతులు నెరవేరిస్తేనే జలసంధి తెరుస్తాం: ఘాలిబాఫ్

తాము చెప్పిన ఆరు షరతులను నెరవేరిస్తేనే హోర్ముజ్ జలసంధి నౌకల రాకపోకలకు తెరుచుకుంటుందని ఇరాన్ మరోసారి స్పష్టం చేసింది. మంగళవారం దృశ్యమాధ్యమ పద్ధతిలో జరిగిన ఇరాన్ పార్లమెంటు సమావేశంలో స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ ప్రసంగిస్తూ ట్రంప్ చేసిన హెచ్చరికలను తిప్పికొట్టారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని తొలగించాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని అప్పటివరకూ ఈ వ్యూహాత్మక లసంధిని తెరిచే అవకాశమేలేదని ఘాలిబాఫ్ ఉద్ఘాటించారు. యుద్ధ నష్టపరిహారం ఇరాన్‌కు చెల్లించాలని, ఇరాన్‌కు ఇకముందు ఎప్పుడూ బెదిరింపులు చేయకూడదన్నారు.డోనాల్డ్ ట్రంప్ స్వయంగా సంతకం చేసిన ఎంఓయు ఒప్పందాన్ని అమలు చేయాలని, పశ్చిమాసియా నుండి అమెరికా సైన్యాలు వెళ్ళిపోవాలని డిమాండ్ చేశారు. ఇరాన్ విప్లవ నాయకుడు ఆయొతొల్లా అలీ ఖమేనీ 48 ఏళ్ళ పరిపాలనాస్ఫూర్తిని కాపాడుకుంటామన్నారు.అమెరికా,ఇజ్రాయెల్ ప్రారంభించిన దురాక్రమణ చర్యలను ప్రతిఘటించేందుకు ఖమేనీ ఇచ్చిన మార్గనిర్దేశం ఇరాన్ ప్రజలను, సైనిక బలగాలను ఐక్యంగా ప్రతిఘటించేలా చేసిందన్నారు. నేరపూరిత, ఉగ్రవాద, అవినీతిపరులైన అమెరికా,జియోనిస్టు పాలకులపై ఇరాన్ సాధించిన విజయాన్ని యావత్ ప్రపంచం గుర్తించిందని అన్నారు.ఇస్లామిక్ పవిత్ర వ్యవస్థను కూల్చివేస్తామని అమెరికా–ఇజ్రాయెల్ భ్రమల్లో బతుకుతున్నాయని ఘాలిబాఫ్ విమర్శించారు. కాగా ఖమేనీ స్ఫూర్తితో ఇరాన్ రక్షణ సామర్థ్యాన్ని మరింతబలోపేతం చేస్తామని ఆ దేశ రక్షణమంత్రిత్వశాఖ ప్రతిజ్ఞ చేసింది.

## కట్టుకథలు నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఎటువంటి ఆటంకాలు ఉండకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో 22ఎ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై సిఎం రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వారి ఆస్తులు 22 ఎ జాబితాలో ఉంటే, రెవెన్యూ అధికారులు 2 రోజుల్లో పరిశీలించి అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని సిఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22 ఎ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని, అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఈ సందర్భంగా సిఎం భరోసా ఇచ్చారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రైవేటు భూములకు సంబంధించి ఒక్క అంగుళానికి కూడా ఇబ్బంది రానివ్వబోమని సిఎం చెప్పారు.

## వందేమాతరం పాడటానికి ముందు..

### తమిళ గీతాన్ని ఆలపించడంపై ఎటువంటి నిషేధం లేదు

**చెన్నై :** ప్రభుత్వ కార్యక్రమాలలో 'వందేమాతరం', జాతీయ గీతానికి ముందు తమిళనాడు రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వార్తు'ను ఆలపిచండంపై ఎటువంటి చట్టపరమైన ఆంక్షలు లేదా నిషేధం లేదని మం గళవారం మద్రాస్ హైకోర్టు స్పష్టంచేసింది. చెన్నై నివాసి ఒకరు హోం మంత్రిత్వశాఖ జారీచేసిన సర్క్యులర్‌ను సవాల్‌చేస్తూ స్థానిక కార్యక్రమాలలో 'తమిళ్ తాయి వార్తు'ను ఆలపించే సాంప్రదాయాన్ని పరిరక్షించాలని కోర్టును అభ్యర్థిస్తూ ఆయన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని( పిల్) దాఖ లు చేశారు. ఈ పిల్‌ను మ ద్రాస్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ఎస్ ఏ. ధర్మాధికారి, జస్టిస్ జి.అరుల్ మురుగన్‌ల తో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.

## భేటీ సమావేశం

**న్యూఢిల్లీ:**దేశంలో కీలక అంశాలు ఎజెండాగా కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే రాజకీయ వ్యూహ రచనకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) బుధవారం సమావేశం నిర్వహించనున్నది. విద్యార్థుల సమస్యలు, అయోధ్య రామ మందిరం విరాళాల దోపిడీ వ్యవహారంపై భారతీయ జనతాపార్టీని ప్రతిపక్షాలన్నీ కలిసి ఉక్కిరిబిక్కిరిచేసే ఒక బృహత్తర ప్రణాళిక రూపొందించడం ఎజెండాగా ఈ సమావేశం జరుగుతుందని సంబంధిత వర్గాలు చెప్పాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com